
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY




శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు

బుధవారం 2 ఆగస్టు 2017 | 16

క్రికెట్ బుకీలు, బెట్టింగ్‌ల వ్యవహారంలో తొలి వేటు పోలీసు శాఖపైనే పడింది. గూడూరు డీఎస్పీ బీ శ్రీనివాస్, నెల్లూరు నగర డీఎస్పీ జీ వెంకటరాముడులను వీఆర్‌కు పంపుతూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేసింది. నెల్లూరులో ఇద్దరు సీఐలను కూడా వీఆర్‌కు పంపనున్నట్లు విశ్వసనీయ సమాచారం. క్రికెట్ బెట్టింగ్‌లు, బుకీల వ్యవహారాలు, పేకాట, ఇసుక, ఎర్రచందనం అక్రమ రవాణా తదితర వాటిపై ఎస్పీ రామకృష్ణ రహస్య నివేదికను ప్రభుత్వానికి సమర్పించడంతో చర్యలు మొదలయ్యాయి. బుకీలు, బెట్టింగ్ రాయుళ్లు, పంటర్లను అరెస్టు చేయక ముందే సొంత శాఖపై ఎస్పీ తీసుకున్న నిర్ణయం అన్ని వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇక పోలీసుల అదుపులో ఉన్న వారి అరెస్టుపై ఎడ తెరగని ఉత్కంఠ కొనసాగుతోంది. బుధ లేదా గురువారంలోగా అరెస్టులు చూపేందుకు పోలీసులు సర్వం సిద్ధం చేస్తున్నారు. కృష్ణసింగ్ ఆచూకీ తెలపాలంటూ కొందరు హైకోర్టులో పిటిషన్ వేసినట్లు సమాచారం.

తొలివేటు పోలీస్ పైనే!


గూడూరు డీఎస్పీ శ్రీనివాస్


నెల్లూరు డీఎస్పీ వెంకటరాముడు

- వీఆర్‌కు గూడూరు, నెల్లూరు డీఎస్పీలు
- ఇద్దరు సీఐలు కూడా.. ఎస్ఐలు, కానిస్టేబుళ్లపైనా వేటు?
- సొంత శాఖపైనే ఎస్పీ చర్యలు
- నేడో, రేపో నిందితుల అరెస్టులు
- వీడుతున్న ఉత్కంఠ

- వివరాలు 16లో..



- ధర ఉన్నా ఉత్పత్తి ఏదీ!?
- 4 లక్షల రొయ్య పిల్లలు వదిలితే.. రెండు లక్షలే దిగుమతి
- ఉష్ణోగ్రతల్లో విపరీతమైన మార్పులు
- నీటి కాలుష్యమూ మరో కారణం
- లబోదిబోమంటున్న సాగుదారులు
- తిరిగి వ్యవసాయం వైపు దృష్టి

8 లో..

వెనామీ విలాపం

మొన్నటి దాకా ధర లేదు.. ఇప్పుడు ఉత్పత్తి లేదు... రొయ్యసాగుదారుల దైన్యస్థితి ఇది. ఎన్నో ఆశలతో రూ.లక్షలు పెట్టుబడిగా పెట్టి కంటికి రెప్పలా రొయ్యలు సాగు చేసినా చివరకు దిగుబడి లేకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వాతావరణంలో పెనుమార్పులు, భూగర్భజలాలు ఇంకిపోవడం, అవగాహనారాహిత్యం తదితర కారణాలే ఇందుకు కారణమని నిపుణులు పేర్కొంటున్నారు.

- కోట

ఇదే సమయం కానిచ్చేద్దాం!

డీఎఫ్‌వో పదవీ విరమణ సభ.. హడావుడిలో అధికారులు

అదనుచూసి పాగా వేసిన 'ఎర్ర' కూలీలు

ముందస్తు సమాచారంతో అడవుల్లో కూంబింగ్

6

ఏసీబీ వలలో కోవూరు కార్యదర్శి

లంచగొండులపై ఏసీబీ కొరడా ఝుళిపిస్తూనే ఉంది. తాజాగా కోవూరు ఇన్‌చార్జి కార్యదర్శి నలగట్ల మురళీమోహన్ లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఓ భవన నిర్మాణానికి అనుమతి ఇచ్చేందుకుగాను రూ.35వేలు లంచం అడిగాడు. ఇది ఇచ్చుకోలేని బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో మంగళవారం సాయంత్రం పక్కావ్యూహంతో అధికారులు పట్టుకున్నారు.

6


ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్న కోవూరు కార్యదర్శి మురళీమోహన్, స్వాధీనం చేసుకున్న నగదు

ట్రాఫిక్ నియంత్రణకు పక్కా ప్రణాళిక

ఐలాండ్‌ల కుదింపు..వాహనాల మళ్లింపు • 3 నెలల్లో పూర్తిగా ప్రక్షాళన 8

ప్రజా సహకారంతోనే పరిష్కారం • ట్రాఫిక్ సలహా మండలి భేటీ నిర్ణయం

'సేఫ్' జిల్లాగా మారుస్తాం : కలెక్టర్ • ఇబ్బంది పెట్టడం ఉద్దేశం కాదు : ఎస్పీ

టీచర్ల బదిలీ.. తొలిరోజు 91 మంది 3



● విద్యే ప్రాధాన్యం
● యువతలో పెరిగిన చైతన్యం
● తల్లిదండ్రుల్లోనూ మార్పు
● గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే తంతు..
● ఉద్యోగం తర్వాతే పెళ్లి అంటున్న మహిళలు

మనువా.. వద్దు

ఆడపిల్లను ఏం చదివిస్తాములే పెళ్లి చేసి అత్తారింటికి పంపించి గుండెలపై కుంపటి దించుకోవాలని ఒకప్పుడు తలిదండ్రులు అనుకునేవారు. ఆ ఆలోచన నుంచి వారు క్రమంగా బయటపడుతున్నారు. మగపిల్లాడితో సమానంగా చదువు చెప్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అటు పట్టణాలతోపాటు ఇటు గ్రామాల్లోనూ తల్లిద్రండుల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. తమ బిడ్డలను కనీసం డిగ్రీ వరకైనా చదివించాలని భావిస్తున్నారు. ఆడపిల్లలూ తమ కాళ్లపై నిలబడ్డాకే పెళ్లిళ్ల వ్యవహారం చూద్దామంటూ అడుగులు వేస్తున్నారు. విద్యకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఫలితంగా ఏటా జిల్లాలో ఉన్నత చదువులు చదివే విద్యార్థినుల సంఖ్య పెరుగుతూ వస్తోంది.

- నెల్లూరు (క్యాంపస్)

తల్లిదండ్రుల్లో మార్పు వచ్చింది



కొన్నేళ్లుగా తల్లిదండ్రుల్లో మార్పు వస్తుంది. గతంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థినులను ఇంటర్‌లో తక్కువ శాతం మంది చేర్చేవారు. అయితే ఇప్పుడు ఎక్కువ మంది విద్యార్థినులు చదువుపై ఆసక్తి కనబరుస్తున్నారు. కొన్ని కళాశాలల్లో బాలుర కంటే బాలికలే ఎక్కువగా ఉంటున్నారు. ఈ మార్పు ఎంతో మంచిది.

- బాబూజాకబ్, ఆర్ఐవో

ఇంటర్ తరువాత ఏం చదవాలి... ఏ రంగంలో స్థిరపడాలన్న ఆలోచనలు చేస్తున్నారు. అయితే విద్యార్థుల ప్రస్తుత ఆలోచలన్నీ చదువుపైనే. జీవితాన్ని మలుపు తిప్పేది చదువు ఒక్కటేనని, చదువుతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని విద్యార్థినులు భావిస్తున్నారు. వీరి ఆలోచనలకు అధ్యాపకుల సలహాలు, స్ఫూర్తి తోడవుతుండడంతో వారు బాగా చదివి డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు అవుతున్నారు. చదువుకునే సమయంలోనే ఇంటర్వ్యూల ద్వారా మంచి ఉద్యోగాలు సాధిస్తున్నారు.

భార్యా భర్తలిద్దరూ ఉద్యోగం చేస్తేనే..

పెరిగిన ఖర్చులకు ఒక్కరు సంపాదిస్తే కుటుంబం గడవడం కష్టమవుతున్న ఈ తరుణంలో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేయక తప్పడం లేదు. దీంతో పురుషులతో పాటు మహిళలూ ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. యువతులు ఉద్యోగాలు సాధించాకే పెళ్లి గురించి ఆలోచిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా తమ ఆడబిడ్డల చదువులపై మక్కువ చూపుతున్నారు.

ఫలితాల్లో బాలికలదే పైచేయి

పదో తరగతి నుంచి ఏ ఉన్నత విద్య వరకూ విడుదలవుతున్న ఫలితాల్లో బాలికలదే పైచేయిగా ఉంటోంది. ఈ ఏడాది వచ్చిన పదో తరగతి, ఇంటర్, ఎంసెట్, నీట్ తదితర ఫలితాల్లో బాలికలదే హవా నడిచింది. కార్పొరేట్, ప్రైవేటు పదో తరగతి ఫలితాల్లో బాలికల హవా... ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థినులు.... ఎంసెట్ ఫలితాల్లో టాపర్‌గా నిలిచిన విద్యార్థినీ... నీట్‌లో విజయభేరి మోగించిన విద్యార్థినులు బ్యాంకు ఫలితాల్లో... గ్రూపుల్లో... ఇలా చదువులోనూ... ఉద్యోగాలలోనూ... మహిళలే ముందంజలో ఉన్నారు. కార్పొరేట్, ప్రైవేట్, ప్రభుత్వ విద్యా సంస్థలన్న తేడా లేకుండా ప్రతి దానిలో విద్యార్థినులే ముందంజలో ఉంటున్నారు.

అవకాశాలు వెతుక్కుంటూ...

ప్రస్తుతం మారుతున్న కాలానుగుణంగా పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థినులను పై చదువులు చదువుకునేందుకు ఉన్న అవకాశాలను వెతుక్కుంటున్నారు. రెసిడెన్షియల్, హాస్టళ్లు, ఇలా ఎక్కడ చదువుకునేందుకు అవకాశముందో కనుక్కుని తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. డబ్బులు ఎక్కువ ఖర్చు చేయాల్సిన అవసరం లేదని, ఉచితంగా చదువుకునే అవకాశం ఉందని తల్లిదండ్రులకు వివరించి, ఉన్నత చదువులను విద్యార్థినులు చదువుతున్నారు. మొత్తం మీద కొద్ది రోజుల్లోనే పూర్తి స్థాయిలో మహిళా లోకం పూర్తి విద్యతో నిండుతుంది.

పెరుగుతున్న ఉద్యోగ అవకాశాలు

పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి చెందడం, నగరంలో ఎన్నో షోరూంలు, దుకాణాలు వెలుస్తుండడంతో మహిళలకు ఎక్కువ ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. శ్రీసిటీ, అపాచి, మేనకూరు సెజ్, పోర్టు, టీపీగూడూరు ప్రాంతంలోని పరిశ్రమల్లో ఎక్కడ చూసినా మహిళలకు ఉద్యోగావకాశాలున్నాయి. నగరంలోని పలు బట్టల దుకాణాలు, షోరూంలలో మహిళలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే కనీసం ఇంటర్ పూర్తి చేసిన వారికే ఉద్యోగ అవకాశాలు లభిస్తుండడంతో ఎక్కువగా మహిళలు చదువుపై దృష్టి సారిస్తున్నారు.

విద్యార్థినులలో పెరిగిన చైతన్యం



మా రోజులతో పోల్చుకుంటే ఇప్పుడు విద్యార్థినులకు చదువు పట్ల ఆసక్తి పెరిగింది. అప్పట్లో నేను ఉద్యోగం వచ్చిన తర్వాతే వివాహం చేసుకోవాలనే నిశ్చయించుకుని ఉద్యోగం సాధించాను. అప్పటి నన్ను నేటి యువతలో చూసుకుంటున్నా. ప్రతిఒక్కరూ ఉన్నత చదువులు చదువుకోవడానికి ఆసక్తి చూపడం ఆనందంగా ఉంది.

- విజయ, ఏడీప

ఉద్యోగమే లక్ష్యంగా కష్టపడుతున్నారు



మేము బ్యాంకు కోచింగ్‌కు శిక్షణ ప్రారంభించిన సమయంలో యువకులు అధికంగా ఉండేవారు. యువతులు శిక్షణ తీసుకున్నా ఒకటి, రెండు పోటీ పరీక్షలు రాసి ఇంకేముందిలే అని పెళ్లిళ్లు చేసుకునే వారు. అయితే ప్రస్తుతం ఉద్యోగమే లక్ష్యంగా యువతులు ముందుకెళ్తున్నారు.

- హరి,
శ్రీహర్ష కోచింగ్ సెంటర్ డైరెక్టర్

నిరుద్యోగులకు భృతి

● హామీపై సీఎం చంద్రబాబు కసరత్తు
● చిగురించిన ఆశలు

నేను ఇంజనీరింగ్ పూర్తి చేసి మూడేళ్లైనా ఉద్యోగం రాలేదు. ఇంట్లో వారిపై ఆధారపడడం ఏ మాత్రం ఇష్టం లేదు. ఈ రోజు కాకపోతే రేపైనా ఉద్యోగం రాకపోతుందా అనే ఆశ ఉండేది. ఉద్యోగం రాకపోవడంతో ఏడాదికేడాది ఆశలు సన్నగిల్లుతుంది. కనీసం నిరుద్యోగ భృతి అయినా దక్కితే కొంతలో కొంత మేలు... అని నిరుద్యోగి రవికిషోర్ అభిప్రాయం ఇది. ఇలాంటి అభిప్రాయంతోనే వేలాది మంది రాష్ట్రప్రభుత్వం ప్రకటించబోయే నిరుద్యోగ భృతిపై ఆశలు పెంచుకుని ఎదురుచూస్తున్నారు.

ఆత్మకూరు: జిల్లాలో వేలాది మంది ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల వేటలో ఉన్నారు. ఉన్నత చదువులు చదివినా గుమస్తా గిరి తప్పడం లేదు. ఇటీవల జిల్లాలో హౌసింగ్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఔట్‌సోర్సింగ్ కింద నియామకాలు చేపట్టిన డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు వందల మంది సివిల్, ఈసీఈ విద్యార్థులు హాజరవ్వడమే ఇందుకు నిదర్శనం. ఏడాదికేడాది నిరుద్యోగులు పెరిగిపోతూనే ఉన్నారు. రాష్ట్ర విభజన అనంతరం వచ్చిన మార్పులు, చేర్పులు నిరుద్యోగ యువతపై ప్రభావం చూపింది. కనీసం రెండు, మూడేళ్లలో ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని ఆశతో ఉన్నారు. ఇలాంటి వారికి భరోసా కల్పించే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకునే విధంగా నిరుద్యోగ భృతిని అమలు చేసేందుకు కసరత్తు మొదలుపెట్టారు. జిల్లాలో ఉపాధి కల్పన కార్యాలయంలో ప్రతి ఏటా 50 వేల మంది వరకు నిరుద్యోగులు పేర్లు నమోదు చేసుకుంటున్నారు. కొన్నేళ్లుగాఉపాధి కల్పన కార్యాలయం వైపు తొంగి చూసిన యువత చాలా తక్కువే. ప్రస్తుతం ప్రభుత్వం నిరుద్యోగులకు భృతి కల్పించేందుకు అడుగులు వేస్తుంది. నిరుద్యోగుల సంఖ్య గణాంకాలు రాబట్టాలని ఆదేశాలు వెలువడ్డాయి. కుల, మత ప్రాతిపదికన పక్కన పెట్టి నిరుద్యోగ భృతి కల్పిస్తే అదే తమకు మనోధైర్యాన్ని ఇస్తుందన్న అభిప్రాయాన్ని యువత వ్యక్తం చేస్తుంది. ఉపాధి కల్పన కార్యాలయంలో కాకుండా నిరుద్యోగులుగా మిగిలిపోయిన వారి సంఖ్య సుమారు రెండు లక్షల మంది పైబడి ఉంటుందని అంచనా. కార్మిక శాఖ సహకారంతో ఈ గణాంకాలను వెలికితీయబోతున్నారు.



నిరుద్యోగ భృతి ఎంత..?

జిల్లాలో 18-35 ఏళ్ల వయస్సు ఉన్న జనాభా 9.16 లక్షలు. వీరిలో 10వ తరగతి పాసైన వారితో పాటు ఇంటర్, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారితో పాటు ఇంజనీరింగ్, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగులు రెండు లక్షలకు పైబడే ఉన్నారు. ముఖ్యమంత్రి నిరుద్యోగులకు భృతి కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం కావడంతో ఇప్పుడు అందరి దృష్టి ఆ వైపు మళ్లింది. ఎంత మొత్తంలో నెలవారీ భృతి చెల్లించ బోతుందని తర్జన భర్జనలు ప్రారంభమయ్యాయి. నిరుద్యోగుల్లో మాత్రం ఈ పరిమాణం కొంత ఆసక్తికరంగా మారింది.

టీచర్ల వివాదంపై విచారణ

దొరవారిసత్రం: మండలంలోని నెలబల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల వివాదంలో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు కావడంతో మంగళవారం ఎస్సీ ఎస్టీ కమిషన్ విచారణ చేపట్టింది. కమిషన్ సభ్యుడు బద్దిపూడి రవీంద్ర, జిల్లా సభ్యుడు పార్వతయ్య పాఠశాలకు విచ్చేసి ఉపాధ్యాయులు, విద్యార్థులను విచారణ చేపట్టారు. కేసుపై డీఎస్పీతో మాట్లాడి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

'ఉపాధి' ద్వారా శ్మశానాల అభివృద్ధి

నెల్లూరు (జడ్పీ) : ఉపాధి హామీ పథకం నిధులతో అన్ని మతాల శ్మశానాలను అభివృద్ధి చేస్తున్నట్లు డ్వామా పీడీ హరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ప్రారంభ దశలో ఉపాధి హామీ నిధులతో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ వారు పనులు చేశారని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ వారి ద్వారా 516 పనులకుగాను 393 పనులను పూర్తి చేసినట్లు వివరించారు. ప్రస్తుతం ఉపాధి హామీ నిధులతో ఈ శ్మశానాల పనులు జరుగుతున్నాయన్నారు. ఇందుకు అంచనా విలువ రూ.10.00 లక్షలు కాగా అందులో రూ.7లక్షల ఉపాధి నిధులు రూ.3లక్షలు. ఎన్ఆర్ఐ విరాళాలు గాని లేక గ్రామంలో ఎవరైనా దాతలు విరాళంగా ఇవ్వవచ్చన్నారు. ఈ పథకం నిధులతో శ్మశానం ప్రధాన మార్గానికి గేటు, ఆర్చ్, ఇరువక్కల ప్రహరీ (6 మీటర్ల ఎత్తు), బర్నింగ్ ప్లాట్‌ఫాంగాని, షెల్టర్‌గాని నిర్మించడం, అదేవిధంగా డ్రెస్సింగ్‌రూం నిర్మించడం, స్థలం చుట్టూ బయోఫెన్సింగ్ ఏర్పాటు చేయవచ్చన్నారు. దాతలు విరాళం ఇచ్చినట్లయితే దాంతో ప్రహరీ, బోరు వేయడం చేస్తామన్నారు. ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకంలో 88 పనులకుగాను రూ.630.64లక్షలను అంచనా వేశామన్నారు.



పాఠకులకు సూచన:

క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు. ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు.

బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు.

పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

- మేనేజర్

టీచర్ల బదిలీలు ప్రారంభం

- తొలిరోజు ఆలస్యంగా కౌన్సెలింగ్
- హెచ్‌ఎంలకు ప్రక్రియ పూర్తి
- నేడు ఎస్‌ఏలకు నిర్వహణ



బదిలీ అయిన హెచ్‌ఎంకు నియామక ఉత్తర్వులు ఇస్తున్న జడ్పీ చైర్మన్ రాఘవేంద్రరెడ్డి, చిత్రంలో డీఈవో రామలింగం, తదితరులు

నెల్లూరు (క్యాంపస్): నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో మంగళవారం టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభమైంది. తొలిరోజు హెచ్‌ఎంలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉదయం 8గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రక్రియ మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభమైంది. దీంతో హెచ్‌ఎంలు నిరీక్షించక తప్పలేదు.

● ఆలస్యంగా ప్రారంభం

జడ్పీ కార్యాలయానికి ఉదయం 8గంటలకు హెచ్‌ఎంలు చేరుకున్నారు. 9.30లకు డీఈవో మువ్వా రామలింగం వచ్చి హెచ్‌ఎంలతో వారాంతపు పరీక్షల వివరాలు తెలుసుకున్నారు. 10.30లకు జడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి చేరుకున్నారు.11.30లకు జడ్పీ చైర్మన్ కౌన్సెలింగ్ మొదటి హాలులోకి చేరుకున్నారు. డీఈవో, జడ్పీ చైర్మన్‌కు వారాంతపు పరీక్ష వివరాలను ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. అనంతరం 12.08లకు హెచ్‌ఎంల సీనియారిటీ జాబితా విడుదలైంది. ఆ జాబితాను డీఈవో స్క్రీన్‌పై హెచ్‌ఎంలకు చూపించారు. దీనిపై అభ్యంతరాలుంటే పదినిమిషాల్లో తెలపాలని కోరారు. పదిమందిలోపలే హెచ్‌ఎంలు అభ్యంతరాలు తెలియచేశారు. దీంతో వాటిని కమిషనర్ కార్యాలయం దృష్టికి తీసుకొని వెళ్లాలని సిబ్బందిని ఆదేశించారు. ఆ వివరాలు వచ్చేలోపు సీనియారిటీ జాబితా వారీగా హెచ్‌ఎంలను కూర్చోబెట్టారు. సరిగ్గా 1.30గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభించారు.

● నిబంధనల ప్రకారం నిర్వహించండి

జడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మికి ముందుగా అనుమతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవోలో పొందుపరిచిన విధంగా కౌన్సెలింగ్ నిర్వహించాలని డీఈవోకు సూచించారు. ఉపాధ్యాయులు నష్టపోకుండా కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు.14 రోజుల పాటు కౌన్సెలింగ్ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు.

● జడ్పీ వద్ద సందడి

కౌన్సెలింగ్‌తో జడ్పీ కార్యాలయం వద్ద సందడి నెలకొంది. కార్యాలయం బయట ఉపాధ్యాయ సంఘాలు సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. హెచ్‌ఎంలకు వెబ్ కౌన్సెలింగ్‌పై అవగాహన, ఖాళీల వివరాలు అందజేశారు. యూటీఎఫ్ సహాయ కేంద్రం వద్దకు ఎమ్మెల్సీ యండ్లపల్లి శ్రీనివాసులురెడ్డి వచ్చి ఉపాధ్యాయుల అనుమానాలు నివృత్తి చేశారు. కౌన్సెలింగ్ కేంద్రం వద్ద పీఈటీలు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చర్యలు చేపట్టారు. పోలీసు బందోబస్తుతో కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది.

● నేడు ఎస్‌ఏలకు..

బుధవారం ఉదయం 8 గంటల నుంచి రెండు హాళ్లలో స్కూల్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ జరగనుంది.

● 91 మంది బదిలీ

తొలిరోజు గ్రేడ్ -2 లోకల్‌బాడీస్ 133 హెచ్‌ఎంలకు కౌన్సెలింగ్ జరగ్గా, వారిలో 91 మంది బదిలీ అయ్యారు. మిగిలిన 42 మంది వారి స్థానాల్లోనే కొనసాగుతారు. 122 ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలకు కౌన్సెలింగ్ జరగ్గా, వారిలో 65 మంది బదిలీ అయ్యారు. మిగిలిన 57 మంది వారి స్థానాల్లోనే కొనసాగుతారు. 30 అడ్‌హక్ హెచ్‌ఎంలకు కౌన్సెలింగ్ జరగ్గా వారిలో 30 బదిలీ అయ్యారు.

కలెక్టరేట్‌లో ప్రత్యక్ష ప్రసారం

నెల్లూరు(కలెక్టరేట్): జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్ సమావేశ మందిరంలో టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేశారు. బదిలీల కౌన్సెలింగ్ పూర్తయ్యే వరకు ఈ ప్రత్యక్ష ప్రసారం ఉంటుంది.



జడ్పీ కార్యాలయం వెలుపల నిరీక్షిస్తున్న హెచ్‌ఎంలు

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నేత్రదానం

కావలి: కావలి సొసైటీ కాలనీ సాయి మెడోజ్ అపార్టుమెంట్‌లో ఉంటున్న కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి మృతి చెందారు. రెడ్‌క్రాస్ సహాయంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఆయన కార్నియాలను నెల్లూరు మోడరన్ ఐ బ్యాంకు సిబ్బంది సేకరించారు. రమణారెడ్డి మృతదేహాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ డి రవి ప్రకాష్, రెడ్‌క్రాస్ నేత్రదాన కన్వీనర్ ఐ సాయిప్రసాద్, కలికి శ్రీహరిరెడ్డి తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను అభినందించారు.


వెంకటరమణారెడ్డి(ఫైల్)

హైవేపై డ్రోన్‌తో సర్వే


సర్వే చేస్తున్న ఆర్టీవో అధికారులు

కావలి(క్రైం): రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయరహదారిపై మంగళవారం ప్రకాశంజిల్లా చేవూరు నుంచి నెల్లూరు వరకు డ్రోన్ కెమెరాతో సర్వే నిర్వహించామని కావలి మోటారు వాహనాల తనిఖీ అధికారి కె. మురళీమోహన్ తెలిపారు. ఈ సర్వేను కలెక్టర్, ఎస్పీ, ఉపరవాణ కమిషనర్ ఆదేశాలతో చేపట్టామన్నారు. రహదారిపై డ్రోన్ సాయంతో ఛాయచిత్రాలు తీశామన్నారు. రహదారి సంకేతాలు అవసరమైన ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణ నివేదికను తయారు చేశామన్నారు. .ఈ కార్యక్రమంలో ఎంవీఐ బాలమురళీకృష్ణ, టోల్‌వే ఇంజనీర్ విజయభాస్కర్, డిప్యూటీ సర్వేయర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువతి తప్పిపోయింది

కావలి(క్రైం): కావలి పట్టణం మేదరబజారుకు చెందిన యువతి షేక్ నస్రీన్ కనిపించడంలేదని ఆమెతల్లి షేక్ షబ్బీరా మంగళవారం కావలి 1వ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాది తెలిపిన వివరాల మేరకు ఆమె కుమార్తె కావలిలోని ఒక నర్సింగ్‌హోంలో పనిచేస్తోంది. డ్యూటీకి వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరి : గుత్తికొండ

కావలిటౌన్: పిల్లలందరు ఎంఆర్ వ్యాక్సిన్ టీకా వేయించుకోవాలని ప్రభుత్వ ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గుత్తికొండ కిషోర్ పేర్కొన్నారు. మంగళవారం ఏరియా వైద్యశాలలో పీపీ యూనిట్ ఆధ్వర్యంలో టీకా కార్యక్రమం ప్రారంభమయింది, ఈ కార్యక్రమంలో గుత్తికొండతో పాటు ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ సుబ్బారావు పాల్గొన్నారు. వారు మాటాడుతూ 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలందరు మీజెల్స్, రూబెల్లా వ్యాక్సిన్ టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ టీకాలతో తట్టు, అమ్మవారు, ఆటలమ్మ తదితర వ్యాధులను నివారించవచ్చన్నారు. టీకా వేయించుకోకపోతే గర్భిణులకు అబార్షనులు అయ్యే ప్రమాదం ఉందని బుద్ధిమాంద్యం పిల్లలు పట్టే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ డైరెక్టర్ వెంకటరావు, డాక్టర్ రజనీ పాల్గొన్నారు. విశ్వోదయ బాలుర పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ పి. అలేఖ్య పిల్లలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పీపీ యూనిట్ డాక్టర్ రజనీ, వైద్యాధికారులు బిందుమాధవి, కవిత, రమేష్, సబ్‌యూనిట్ మాతయ్య పాల్గొన్నారు. డాక్టర్ రజనీ మాట్లాడుతూ మొత్తం 15,240 మంది పిల్లలకు నెల రోజుల పాటు ఈ టీకాలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. తొలి రోజు 1791 మంది పిల్లలకు టీకాలు వేయించామన్నారు.

అల్లూరు : పిల్లల్లో వచ్చే తట్టు, రూబెల్లా వ్యాధి నిర్మూలనకు వైద్యశాఖ ఉచితంగా ఎంఆర్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించింది. అల్లూరు మండలం ఇస్కపల్లి పీహెచ్‌సీకి చెందిన వైద్యసిబ్బంది తొమ్మిది బృందాలుగా ఏర్పడి ఇస్కపల్లి పంచాయతీ పరిధిలోని పాఠశాలల చిన్నారులకు ఈ వ్యాక్సి


కావలిలో ఎంఆర్ టీకా వేస్తున్న చైర్‌పర్సన్ అలేఖ్య


అల్లూరులో వ్యాక్సిన్ వేస్తున్న వైద్యాధికారి శేషమ్మ

వేశారు. వైద్యాధికారి శేషమ్మ ఈ వ్యాక్సిన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందజేసిందన్నారు. ఇస్కపల్లి పంచాయతీలో 1602 గాను 1447 మంది విద్యార్థులకు ఈ వ్యాక్సిన్‌ను వేసి 86 శాతం పూర్తి చేశామన్నారు. మిగిలిన వారికి మరో విడతలో వ్యాక్సిన్ వేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ పరమేశ్వరి, వెంకటేశ్వర్లు, పీ .కృష్ణయ్య, ఆశా వలంటీర్లు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

1304 చిన్నారులకు టీకాలు

కలిగిరి: మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నరేంద్రభారతి, మాలతి, పవిత్ర ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లోనే 1304 మంది విద్యార్థులకు టీకాలు వేసినట్లు వైద్యాధికారి బాలనాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణాధికారి జీ.శ్రీనివాసులు, సిబ్బంది ముజీబ్ పాల్గొన్నారు.

దగదర్తి: దగదర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్ పంపిణీజరిగింది. మొత్తం మూడు బృందాలుగా 485 మంది పిల్లలకు టీకావేశాశారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కంచర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ టీకాను ప్రతి ఒక్కరికి అందేలా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు అనితారెడ్డి, పలు వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎంఆర్ వ్యాక్సిన్‌తో ఆరోగ్య రక్షణ

బిట్రగుంట: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పిల్లల బంగారు భవిష్యత్ దృష్ట్యా తట్టు, రూబెల్లా వ్యాధులను నివారించేందుకు ఎంఆర్ వ్యాక్సిన్ టీకాలను మంగళవారం బోగోలు మండలం నాగులవరం ప్రాథమిక పాఠశాలలో కోవూరుపల్లి వైద్యుడు సురేష్ బాబు ప్రారంభించారు. చిన్నారులకు ఈ టీకా సంజీవని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ పరిధిలోని 1504 గాను 1391 మందికి టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పి. శ్రీహరిరెడ్డి, కమిటీ సభ్యులు కొండేటి చక్రవర్తి , వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కలిగిరిలో విద్యార్థులకు టీకా వేస్తున్న వైద్యసిబ్బంది


దగదర్తిలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది

అన్నగారిపాలెంలో బీఎంఆర్ పర్యటన

కావలి: కావలి రూరల్ మండలం అన్నగారిపాలెంలో సీఆర్డీఏ సభ్యుడు బీద మస్తాన్‌రావు సోమవారం విస్తృతంగా పర్యటించారు. అన్నగారిపాలెం పంచాయతీ కంసాలిపాలెంలో పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం సమస్యలపై ప్రజలు మస్తాన్‌రావుకు వినతిపత్రాలు ఇచ్చారు. స్పందించిన ఆయన సమస్యలు పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మస్తాన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం రూరల్ మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కంసాలిపాలెం పాఠశాల భవనానికి రూ. 7.20 లక్షలు మంజూరు చేయించి నిర్మాణం చేపట్టామన్నారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పులి శివకోటయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్ కొండూరు పాలిశెట్టి, నుడా డైరెక్టర్ పొలడుగు రంగారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, టీడీపీ మండల అధ్యక్షుడు కోసూరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ప్రళయకావేరి భాస్కర్, ఆవుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పాఠశాల ప్రహరీ నిర్మాణ శంకుస్థాపనలో బీఎంఆర్

విద్యార్థుల సంఘీభావం


నిరసన దీక్షలో తొలగించిన జేబీ సిబ్బంది

కావలిటౌన్: విధుల నుంచి తొలగించిన జేబీ అధ్యాపకేతర సిబ్బందికి మంగళవారం వైసీపీ విద్యార్థి విభాగం సంఘీభావం తెలిపింది. మంగళవారంతో జేబీ సిబ్బంది నిరసన దీక్షలు 23వ రోజుకు చేరాయి. విద్యార్థి విభాగం వైసీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు జే మహేష్ మాట్లాడుతూ జేబీ అధ్యాపకేతర సిబ్బంది 23 రోజులుగా విధుల్లోకి తీసుకోవాలని నిరసన దీక్షలు చేస్తున్నప్పటికి యాజమాన్యం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. విద్యాశాఖాధికారులు, విద్యాశాఖ మంత్రులు దీనిపై స్పందించకపోవడం దారుణమన్నారు. తక్షణమే సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు జంపాని చైతన్య, అనీల్, సాయికుమార్, శ్రీనివాసులరెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

అల్లూరు : ఇందుపూరు పంచాయతీ భవనీకాలనీలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని ఎంపీడీవో కనకదుర్గాభవాని తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ తాగునీటి సమస్యపై అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటారన్నారు. ఇస్కపల్లి పంచాయతీ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని, మురుగు నిల్వ చేరుతోందన్న అంశాలను ఎంపీటీసీ గంగపట్నం శ్రీనివాసులు సభ దృష్టికి తేగా వాటిపై సంబంధిత అధికారుల వివరణ తీసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంగపట్నం మంజుల, తహసీల్దారు పీ జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ చల్లా వాసు

కావలి(క్రైం):వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కావలి 2వ పట్టణ ఎస్ఐ చల్లావాసు పేర్కొన్నారు. రోడ్డు భద్రతలో భాగంగా మంగళవారం నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో కావలి, జలదంకి, కలిగిరిలలో 70 వాహనాలను పరిశీలించామన్నారు. వాటిలో 12 వాహనాల డ్రైవర్లకు లైసెన్సులు లేకపోవడంతో కేసులు నమోదు చేశామన్నారు. వాహనాలు నడిపేవారు కచ్చితంగా లైసెన్సులు కలిగి ఉండాలని తెలిపారు. ముఖ్యంగా ఆటోడ్రైవర్లు బ్యాడ్జి నంబరు లేకుండా ఆటోలు నడుపుతున్నారని అటువంటివారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మద్యం తాగి వాహనాలను నడిపినా, ఆటోలలో ఎక్కువమంది ప్రయాణి కులను ఎక్కించినా, నిబంధనలకు వ్యతిరేకంగా ఆటోలను నడిపినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు.

తనిఖీల పేరుతో వేధిస్తున్నారు

కావలిటౌన్: వాహనాను నిలిపి తనిఖీల పేరుతో వేధిస్తున్నారని దళితసంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. మంగళవారం దళిత నాయకులతో కలిసి ఆర్డీవో ఐ. భక్తవత్సలరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. మల్లి మాట్లాడుతూ జిల్లాలో ప్రతి కిలో మీటరుకు రవాణా శాఖ అధికారులు, పోలీసులు తనిఖీల పేరుతో ఆటోల జప్తు, వేధింపులు అన్యాయమన్నారు. బడాబాబులు ప్రయాణించే కార్ల జోలికి వెళ్ళడం లేదని కార్లును తనిఖీ చేసిజప్తు చేసినట్లు ఒక్కటి కూడ లేదన్నారు. జప్తు చేసిన ఆటోలను పోలీసుస్టేషన్‌లో పెట్టుకుని వేధిస్తున్నారన్నారు. ఇప్పటికైన పేద దళితులు నడుపుకొనే ఆటోల జోలికి రావద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం శ్యాంసన్, ఎ మోహన్‌రావు, సంపత్‌కుమార్, ఖాసీ, విజయరత్నం, లక్ష్మీనర్సు తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘాల నాయకులు

పక్కా ఇళ్ల మంజూరుపై గ్రామ సభలు

కొండాపురం: పక్కా ఇళ్ల మంజూరుపై మండలంలోని అన్ని పంచాయతీల్లో నేటి నుంచి గ్రామ సభలు నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో గోపీనాథ్ మంగళవారం తెలిపారు. తహసీల్దార్ ప్రమీల గ్రూపు 2న పార్లపల్లి, 3న రేణమాల, 4న సత్యవోలు, 5న శెట్టిపాలెం, 7న గుడవళ్ళూరు, 8న వెలిగండ్ల, వ్యవసాయ అధికారి సుధారాణి 2న గొట్టిగుండాల, 3న గరిమెనపెంట, 4న గొట్టిగుండాలపాలెం, 5న ఇస్కదామెర్ల, 7న చింతలదేవి,8న ఉప్పులూరు, ఎంపీడీవో నాగరాజకుమారి 2న కొమ్మి, 3న మర్రిగుంట, 4న నేకునాంపేట, 5న సాయిపేట, 7న తూర్పు యర్రబల్లి, 8న గానుగపెంట,10న బీమవరప్పాడు పంచాయతీల్లో సభలు నిర్వహిస్తారన్నారు.

'బెల్ట్'పై ఉక్కుపాదం

- వరుస దాడులతో తగ్గిన విక్రయాలు
- నిందితులను వదలం : ఎక్సైజ్ శాఖ


అమ్మకానికి సిద్ధంగా మద్యం సీసాలు


బెల్టు దుకాణంలో తాగి పడేసిన సీసాలు

కావలిరూరల్: మద్యం మత్తులో వాహనాలు నడపడంతో జరుగుతున్నా ప్రమాదాలు అరికట్టేందుకు, పేద కుటుంబాలు వీధిన పడకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం బెల్టు దుకాణాలపై ఉక్కుపాదం మోపుతోంది. ప్రజల జీవితాలతో చెలగాటమాడే ఈ దుకాణాలను పూర్తి స్థాయిలో నిర్మూలించాలని ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని బెల్టు దుకాణాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు మొదలెట్టారు. కావలి రూరల్ మండలంలోని 18 పంచాయతీల్లో 76 గ్రామాలున్నాయి. రుద్రకోట, ఆనెమడుగు, గౌరవరం, తుమ్మలపెంట పంచాయతీలో మద్యం దుకాణాలున్నాయి. ఈ దుకాణాల నుంచి ఆటోల్లో గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్టు దుకాణాలకు యథేచ్ఛగా మద్యం సరఫరా జరిగేది. ఎక్సైజ్ అధికారుల వరస దాడులతో బెల్టు దుకాణాల నిర్వహణ కొంత మేర తగ్గింది. అయితే మండలంలోని చెంచుగానిపాలెం, అన్నగారిపాలెం, మత్స్యకార గ్రామాల్లో పార్టీలకు అతీతంగా స్థానిక నాయకుల అండదండలతో లక్షల్లో పాటలు నిర్వహించి మరీ నడుపుతున్న బెల్టు దుకాణాలు యథేచ్ఛగానే సాగుతున్నాయి. వీటిపై ఎక్సైజ్ అధికారులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక బృందాలతో గస్తీ

ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో గస్తీ తిరుగుతూ బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్నాం. ఎక్కడైన బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న సమాచారం అందగానే వెంటనే స్పందించి దుకాణ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం. బెల్ట్ దుకాణాలకు మద్యం సరఫరా చేసే వారిపై కేసులు నమోదు చేస్తాం. బెల్ట్ నిర్వహణపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం మోపుతోంది.

– రామారావు, ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ, కావలి

'బెల్ట్'ను నిర్మూలించాలి



తాగునీరు దొరకని గ్రామాల్లో సైతం మద్యం దొరుకుతోంది. బెల్టు దుకాణాల్లో మద్యం అమ్మకాలు పూర్తిగా నిలిపివేసేలా ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలి. అప్పుడే పేద కుటుంబాలు పట్టెడన్నం తింటాయి.

– బూచి శివయ్య, లక్ష్మీపురం

మహిళలు సహకరించారు



గ్రామంలో బెల్టు దుకాణాలు స్థానిక మహిళల సహకారంతో తొలగించాం. గ్రామీణ యువత ముందుండి బెల్టు దుకాణాల తొలగింపునకు పూనుకుంటే మద్యం అమ్మకాలు పూర్తిస్థాయి నిర్మూలనకు అవకాశం ఉంటుంది.

– గుంటూరు మల్లికార్జున్, ఆర్సీపాలెం సర్పంచు

తాగునీటి సమస్యపై స్పందన

కొండాపురం: మండలంలోని సాయిపేట పంచాయతీ యర్రబాలెం గ్రామంలో తాగునీటి సమస్యపై మంగళవారం అధికారులు స్పందించారు. ఆంధ్రజ్యోతి పత్రికలో సోమవారం గొంతెండుతోంది తాగునీటి అందించండి అనే కథనం వచ్చింది. స్పందించిన అధికారులు ఆ గ్రామానికి వెళ్ళారు. ఉప్పునీటి బోరుకు కొందరు వ్యక్తులు మోటారు తగిలించి తాగునీటి పైపులైన్‌కు అనుసంధానం చేయగా సమస్య ఉత్పన్నమయింది. ఇన్‌చార్జి ఎంపీడీవో గోపీనాథ్, తహసీల్దార్ ప్రమీల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి బోరు మోటార్లను వెంటనే తొలగించమని ఆ వ్యక్తులకు సూచించారు. పగిలిని పైపులైన్‌కు మరమ్మతు చేయించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని పాలకులను ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అటవీ భూమి దున్నిన వారిపై కేసు

దగదర్తి: మండలంలోని నారాయణపురం గ్రామంలో అటవీ భూమిలో అటవీశాఖ అధికారులు వేసిన జామాయిల్ మొక్కలను దున్నేశారంటూ ఫారెస్టు అధికారులు మంగళవారం దగదర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నారాయణపురం గ్రామానికి చెందిన బాపట్ల చంద్రమౌళి, వట్టికాల మహేష్, వట్టికాల చినమాదవయ్య, వట్టికాల తిరుతయ్య, వట్టికాల వెంకటేశ్వర్లు అనువారు వేసిన మొక్కలను ఉద్దేశపూర్వకంగా రాత్రి వేళలో దున్నేశారని తెలిపారు. దీని వల్ల సుమారు రూ. 2 లక్షల నష్టం ఆస్తి నష్టం వాటిల్లినట్లు దగదర్తి ఫారెస్టు సెక్షన్ అధికారి ఓ. ప్రకాష్ ఎస్‌ఐ విజయశ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న ఎస్‌ఐ విజయశ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సరైన పత్రాలు లేకపోతే కేసు నమోదు

కలిగిరి: వాహనదారులు తమ వాహనాలాకు సంబంధించి అన్ని పత్రాలను ఉంచుకోవడంతోపాటు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని జిల్లా ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి వల్లా వాసు తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయ కూడలిలో మంగళవారం వివిధ వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్సు వెంట లేని వారికి జరిమానా విధించారు. నాలుగు చక్రాల వాహనదారులు విధిగా యూనిఫాం, సీటు బెల్టు ధరించాలన్నారు. ప్రతి వాహన చోదకుడూ ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


వృద్ధులకు పింఛను పంపిణీ చేస్తున్న అమరా వేదగిరి

సంక్షేమానికి చిరునామా టీడీపీ

కావలిటౌన్: సంక్షేమ పథకాలకు చిరునామా టీడీపీ అని టీడీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు అమరా వేదగిరి పేర్కొన్నారు. మంగళవారం33వ వార్డు మున్సిపల్ పాఠశాల వద్ద వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు అమరా పింఛనులు అందజేశారు. అమరా మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు రూ. 1000లు పింఛను అందించిన ఘనత రాష్ట్రచరిత్రలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. లోటు బడ్జెట్‌లో కూడ పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించకుండా ముఖ్యమంత్రి ప్రభుత్వాన్ని నడిపిస్తున్న తీరు దేశప్రజలను అబ్బురపరుస్తోందన్నారు. సీఆర్‌డీపీ సభ్యుడు బీద మస్తాన్‌రావు చొరవతో పట్టణాభివృద్ధికి కోట్లాది నిధులు మంజూరు చేయిస్తున్నారన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

కావలి(క్రైం): కావలి ఏరియా వైద్యశాలలో అనస్తీషియా స్పెషలిస్ట్ డాక్టర్ మూరంరెడ్డి వెంకట సుబ్బారెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం ఆసుపత్రిలోని రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ కే. సుబ్బారావు, సర్జన్ రామకృష్ణ, చిన్నపిల్లల వైద్య నిపుణులు మండవ వెంకటేశ్వర్లు, వైద్యులు, సిబ్బంది డాక్టర్ సుబ్బారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ హయాంలోనే తీరప్రాంత అభివృద్ధి : ఎమ్మెల్సీ బీద

అల్లూరు : తెలుగుదేశం పార్టీ హయాంలోనే తీర ప్రాంత గ్రామాల అభివృద్ధి సాధ్యపడిందని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఆయన అల్లూరు మండలంలోని తూర్పుగోగులపల్లి, విడవలూరు మండలం రామతీర్థం గ్రామాల మధ్య బకింగ్‌హామ్ కాలువపై నిర్మిస్తున్న వంతెన పనులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అల్లూరు మండలానికి విడవలూరు మండలానికి మధ్య వారధి లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ గ్రామాలను కలుపుతూ వంతెనలు, రోడ్ల నిర్మాణ పనులు చేపట్టడంతో రైతులు, మత్స్యకారులు, విద్యార్థులు, కూలీలకు ఎంతో మేలు చేకూరుతోందన్నారు. 1999-2004 టీడీపీ హయాంలో ఇక్కడి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, అయితే అప్పుడు రోడ్లు మాత్రమే నిర్మించామన్నారు. 2009-2004 హయాంలో బీద మస్తాన్‌రావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆనాటి ప్రజాప్రతినిధుల సహకారంతో ఎన్‌సీఆర్ఎంపీ ద్వారా తీరప్రాంతాల్లో కాలువపై వంతెనలు మంజూరు చేయించామన్నారు. సీఎంగా చంద్రబాబు వచ్చిన తరువాత రద్దయిన వంతెనలకు తిరిగి టెండర్లు వేశామని, ఈ వంతెనకు రూ.24 కోట్లుతో టెండర్లు పిలిచి ప్రస్తుతం రూ.33 కోట్లుతో 3.9 కి.మీ రోడ్డు, 52 పిల్లర్లతో 300 మీటర్ల వెడల్పుతో నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. కావలి నియోజకవర్గంలోని పైడేరు రూ.22 కోట్లుతో చిప్పలేరు, గోగులపల్లి వద్ద పైడేరుపై బకింగ్‌హామ్ కాలువ , చెంగల వాగుపై 73 కోట్లుతో మూడు వంతెనలు, చిప్పలేరులో రూ.22 కోట్లు, గోగులపల్లి వద్ద పైడేరుపై రూ33 కోట్లు, ఇస్కపల్లి వద్ద రూ.17.5 కోట్లుతో, రూ.14 కోట్లుతో చెంగలవాగుపై వంతెలను నిర్మించి నియోజకవర్గ తీరప్రాంతాభివృద్ధికి ప్రభుత్వం దోహదపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భక్తవత్సలరెడ్డి, పైడేరు ఎస్కేప్-2 చానల్ అధ్యక్షుడు బీద గిరిధర్, టీడీపీ మండల కన్వీనర్ బిట్రగుంట ఉమా ప్రసాద్‌రెడ్డి, మేడా విజయకుమార్‌రెడ్డి, సూరిశెట్టి వెంకటసుబ్బయ్య, డాకవరం బుజ్జయ్య, తహసీల్దారు పీ జనార్దనరావు, ఎంపీడీవో కనకదుర్గాభవాని, గోళ్ళ ఆదాం, కాళహస్తి రము, తోట శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న బీద రవిచంద్ర

శంకుస్థాపన

అల్లూరు మండలం తూర్పుగోగులపల్లి పంచాయతీకి సంబంధించిన చెత్తనుంచి సంపద తయారీ కేంద్ర నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానికంగా ఎటువంటి సమస్యలు లేకుండా కేంద్రాన్ని నిర్మించాలని ఆయన అధికారులు ఆదేశించారు.

ఏసీబీ వలలో కోవూరు పంచాయతీ కార్యదర్శి



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ పరమేశ్వరరెడ్డి

కోవూరు: పౌరసేవలకు విపరీతంగా లంచం వసూలు చేసే పంచాయతీ కార్యదర్శిపై అవినీతి నిరోధక శాఖాధికారులు మంగళవారం కొరడా ఝుళిపించారు. భవనం నిర్మించేందుకు అనుమతి కోరిన వ్యక్తి నుంచి లంచం తీసుకొంటుండగా కోవూరు పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి నలగట్ల మురళీమోహన్‌ను ఏసీబీ అధికారులు వలపన్ని అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ పరమేశ్వరరెడ్డి కథనం ప్రకారం.. కోవూరుకు చెందిన వేగూరు రాజేంద్రరెడ్డి వేమారెడ్డి తోట ప్రాంతంలో భవనాన్ని నిర్మించాలనుకుని పంచాయతీ కార్యదర్శి మురళీమోహన్‌ను అనుమతి కోరారు. రూ.35వేలు లంచం ఇస్తే అనుమతిని ఇస్తానని కార్యదర్శి డిమాండ్ చేశారు. రూ.30వేలకు తగ్గితే అనుమతి ఇచ్చేందుకు వీలుకాదని కార్యదర్శి చెప్పాడు. దీంతో రాజేంద్రరెడ్డి ఏసీబీ అధికారుల్ని ఆశ్రయించారు. ఏసీబీ అధికారులిచ్చిన రూ.30వేలు నగదును పంచాయతీ కార్యాలయంలో చెల్లిస్తుండగా వలపన్ని పట్టుకున్నారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు శ్రీహరిరావు, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. విచారణ అనంతరం పంచాయతీ కార్యదర్శి నలగట్ల మురళీమోహన్‌ను అదుపులోకి తీసుకున్నారు. కోవూరు పరిసర ప్రాంత గ్రామాల్లో ఏసీబీ అధికారుల దాడి సంచలనం కల్గించింది.



పంచాయతీ కార్యదర్శి మురళీమోహన్

ఆది నుంచి వివాదాస్పదమే..

పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మురళీమోహన్ వివాదాస్పదంగానే ప్రవర్తించాడు. ఆయన సాగిస్తున్న అక్రమాలపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో పలు కథనాలు వెలువడ్డాయి. మురళీమోహన్ విద్యార్హతలపై కూడా పలు అనుమానాలు ఉన్నాయి. శానిటరీ సర్టిఫికెట్ కూడా నకిలీదేననీ సర్పంచు కూట్ల ఉమ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా కోవూరు పంచాయతీ కార్యాలయంలో చేరిన ఆయన కార్యదర్శిగా నియమితులయ్యారు. కార్యదర్శిగా బాధ్యతలు చేపడుతూ పలు పర్యాయాలు వివాదాస్పదంగా తయారయ్యారు. అధికారులు పదేపదే విచారణ సాగించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపారు. ఇటీవల పడుగుపాడు పంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. కోవూరు ఇన్‌చార్జ్ కార్యదర్శిగా పనిచేస్తూనే పలు అవకతవకలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు వెలువెత్తుతున్న సమయంలోనే ఏసీబీ అధికారులకు దొరికారు.

తట్టుకోలేక ఫిర్యాదు చేశా...

కోవూరు పంచాయతీ కార్యాలయంలో లంచం ఇవ్వనిదే పను లు సాగడం లేదు. ప్రతీ పనికి ఓ రేటు నిర్ణయించారు. వేలాది రూపాయలు చెల్లిస్తేనే అనుమతులు లభిస్తున్నాయి. ఏ సర్టిఫికెట్



పొందాలన్నా లంచం చెల్లించాల్సిందే. ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం చాలా పర్యాయాలు కార్యాలయం చుట్టూ తిరిగా. లంచం ఇస్తేనే అనుమతి ఇస్తానని చెప్పడంతో అవినీతి నిరోధకశాఖాధికారులకు ఫిర్యాదుచేశా.

- వేగూరు రాజేంద్రరెడ్డి

ఎర్ర దుంగల స్వాధీనం

● నిందితుల అరెస్టు

వెంకటగిరి(టౌన్): అక్రమంగా తరలిస్తున్న ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకొని, రవాణాకు పాల్పడిన ఐదుగురు నిందితులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీనివాసరావు విలేఖర్లతో మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ఎస్పీ పీహెచ్‌డీ. రామకృష్ణ నేతృత్వంలో ఓఎస్‌డీ విఠలేశ్వర్ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారన్నారు. ఆయన సూచన మేరకు మండలంలోని చెలికంపాడు గ్రామ సమీపంలో ఎస్ఎస్ కెనాల్ వద్ద దాడులు నిర్వహించగా అక్రమంగా తరలిస్తున్న ఎర్ర చందనం పట్టుబడిందన్నారు. వీరిని అదుపులోకి తీసుకునే సమయంలో ముద్దాయిలు సిబ్బందిపై రాళ్లతో, కత్తులతో దాడికి దిగారన్నారు. ఎంతో చాకచక్యంగా ఎస్ఐ తన సిబ్బందితో ఐదుగురు ముద్దాయిలను పట్టుకున్నారన్నారు. వీరి నుంచి నాలుగు లక్షల విలువైన 16 ఎర్ర చందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను వెంకటగిరి కోర్టులో హాజరు పరిచామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కొండప్ప నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎర్ర చందనం దుంగలు, ముద్దాయిలతో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కొండప్పనాయుడు

ఆ కారులో ఉన్నది ఎర్రచందనమే..

ఆంధ్రజ్యోతి కథనంతో కదిలిన పోలీసులు

పొదలకూరు: నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం వరదాపురం వద్ద రోడ్డు పక్కనే నాలుగైదు రోజులుగా పార్క్ చేసి ఉన్న కారులో ఎర్రచందనం ఉందన్న అనుమానం నిజమైంది. సోమవారం ఆంధ్రజ్యోతిలో "ఆ కారు ఎవరిదో"...నాలుగు రోజులుగా రోడ్డు పక్కనే.. అందులో ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతోందన్న ఆంధ్రజ్యోతి కథనం అక్షర సత్యమైంది. ఈ కథంతో మంగళవారం పొదలకూరు పోలీసులు కారు నిలిపి ఉన్న స్థలానికి చేరుకొని పరిశీలించారు. కారులో ఉన్నది ఎర్రచందనమేనని నిర్ధారించుకొని ఆ కారును నేరుగా జిల్లా ఎస్పీ కార్యాలయానికి తరలించారు. ఈ కారులో సుమారు మూడు లక్షల విలువైన ఏడు ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు తెలిసింది. తమిళనాడుకు చెందిన కారుకు స్మగ్లర్లు నెంబరు ప్లేట్ మార్చి ఏపీ 09, ఏఏ 0012నెంబరు అమర్చినట్లు పోలీసులు గుర్తించారు. పంక్చరైన ఆ కారు టైర్ పొదలకూరులో ఏ దుకాణంలో ఇచ్చారో కూడా పోలీసులు పసిగట్టి ఆ టైర్‌నే తీసుకెళ్లి కారుకు బిగించి తీసుకెళ్లారని తెలిసింది. దీన్ని బట్టి చూస్తే ఎర్ర చందనం రవాణా చేస్తున్నది ఈ ప్రాంతానికి చెందిన వారేనన్న అనుమానం నిజమవుతోంది. నాలుగు రోజులుగా రోడ్డు పక్కన అనుమానాస్పదంగా కారు నిలిపి ఉంటే ఆ మార్గంలో పలుమార్లు వెళ్ళిన పోలీసులు, ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చే వరకు పట్టించుకోలేదంటే వారు విధులు ఎంత చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నారో అర్థమవుతోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. పోలీసులకు ఇతర వ్యాపకాలపై ఉన్న శ్రద్ధ అసాంఘిక కార్యక్రమాలపై పెడితే అక్రమార్కుల ఆటలు కట్టించడం కష్టం కాదని వారంటున్నారు.



వరదాపురం వద్ద రోడ్డు పక్కన ఎర్రచందనం దుంగలతో పార్కింగ్ చేసిఉన్న కారు

ట్రాక్టర్ డ్రైవర్‌కు రెండేళ్ల జైలుశిక్ష

కోవూరు: ట్రాక్టర్‌ను అతివేగంగా నడిపి ఒకరి మృతి కారణమైన కేసులో నలుబోలు యానాదయ్యకు రెండేళ్ల జైలుశిక్ష, రూ.5,300 జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ ఎస్‌కే యూసఫ్ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వాకాడు ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం ఆటోలో 2013 ఆగస్టు 11వ తేది రామచంద్రాపురం గురుకుల పాఠశాలలో తమ కుమార్తెను చూసి తిరిగి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఆటోను వేగంగా ఢీ కొంది. ఆటోలో ప్రయాణిస్తున్న పి.యశ్వంత్ (9) తీవ్రగాయాలకు గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆటో డ్రైవర్ పి.శేషయ్య, మహిళ పి.మంజులకు గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితులు బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. అప్పటి ఎస్ఐ కే శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువు కావడంతో నలుబోలు యానాదయ్యకు రెండేళ్ల జైలుశిక్ష, రూ.5,300 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పి.వెంకటేశ్వర్లురెడ్డి వాదించారు.

మనస్థాపంతో ఒకరి ఆత్మహత్య

పెళ్లకూరు : మండల పరిధిలోని పాలచ్చూరు దళితవాడకు చెందిన ఓరేపల్లి చంద్రమోహన్ (47) మంగళవారం ఆత్మమత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల వివరాల మేరకు చంద్రమోహన్ మద్యం సేవిస్తూ ఇంట్లో తరచు గొడవలకు దిగుతుండేవాడు. మద్యం వల్ల కుటుంబంలో కలహాలు అధికమయ్యాయి. భార్యపై మనస్థాపం చెందిన చంద్రమోహన్ మద్యంలో పురుగుమందులు కలుపుకొని సేవించాడు. విషయం తెలుసుకున్న స్థానికులు, కుటుంబసభ్యులు ఆటోలో నాయుడుపేటకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. చంద్రమోహన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వే బిల్లులతో రవాణా...

● జీఎస్‌టీతో నెల విరామం

● నేటి నుంచి వే బిల్లుల జారీ

నెల్లూరు (సిటీ) : జిల్లాలో సరుకు రవాణాకు వే బిల్లులు జారీ అవుతున్నాయి. జీఎస్‌టీ చట్టం అమలుతో జూలై ఒకటి నుంచి వే బిల్లుల జారీ ఆగిపోయింది. నూతన చట్టంలో చిన్న వ్యాపారులకు, ఆహార పదార్థాలు, నిత్యావసర సరుకులకు పన్ను మినహాయింపు ఇచ్చారు. దీంతో అనేక మార్పులు, చేర్పుల మధ్య సరుకు రవాణాకు వే బిల్లు విధానాన్ని తాత్కాలికంగా నిలిపి వేశారు. ఈ నేపథ్యంలో జూలై 1 నుంచి వే బిల్లులు లేకుండా, సాధారణ బిల్లులు, ఇన్వాయిస్‌లతో సరుకు రవాణా జరుగుతూ వస్తోంది. నెల రోజుల విరామం తరువాత మళ్లీ వే బిల్లులు జారీ అవుతున్నాయి. సరుకు రవాణాకు వాహనంతోపాటు వే బిల్లులు తప్పని సరిగా ఉండాల్సి ఉంటోంది. వాహనాల్లో ఏ సరుకు ఉంది, ఎంత బరువు ఉంది, ఎక్కడ కొనుగోలు చేశారు, ఎక్కడికి రవాణా జరుగుతోందన్న వివరాలతోపాటు వాహనం సమాచారంతో వే బిల్లులు జారీ అవుతున్నాయి. అందులో ఉన్న వివరాల ప్రకారమే వాహనంలో సరుకు ఉండాల్సి ఉంటుంది. అలా కాకుండా ఎక్కువ సరుకు ఉన్నా, వే బిల్లులో చూపని సరుకులు ఉన్నా అధికారులు వాహనాన్ని సరుకుతోసహా సీజ్ చేస్తారు. నూతనంగా మంజూరు చేస్తున్న వే బిల్లులను వ్యాపారులు ఆన్‌లైన్ నుంచి నేరుగా పొందే అవకాశాన్ని వాణిజ్య పన్నుల శాఖ కల్పించింది. గతంలో వే బిల్లుల కోసం కార్యాలయాలకు వెళ్లి అక్కడ అధికార సిబ్బంది నుంచి పొందాల్సి ఉండేది. దీంతో వారికి వ్యాపారులు మామూళ్లను ముట్టచెప్పాల్సి వచ్చేది. కార్యాలయ అవినీతిని అరికట్టేందుకు వే బిల్లుల జారీని ఆన్‌లైన్ చేశారు. కాగా, జిల్లాలో ఇప్పటివరకు 16 వేల మంది వ్యాపారులు జీఎస్‌టీలో నమోదై ఉన్నారు. రోజుకు నాలుగు వేలకు పైగా సరుకు వాహనాలు వెళుతున్నట్లు సమాచారం.

ఎర్ర కూలీల పాగా...!

● పోలీసులు, అటవీ సిబ్బంది కూంబింగ్

● ఆరు ఎర్రచందనం దుంగల గుర్తింపు

● తృుటిలో తప్పించుకొన్న కూలీలు

సీతారామపురం: మండలంలోని దేవమ్మచెరువు, పండ్రంగి అటవీ ప్రాంతాల్లో ఎర్రకూలీలు పాగా వేశారన్న సమాచారంతో పోలీసులు, అటవీ సిబ్బందితోపాటు, రాపూరు స్క్వాడ్ బృందం మంగళవారం కూంబింగ్ నిర్వహించారు. వీరి రాకను ముందే గుర్తించిన ఎర్ర కూలీలు అక్కడి నుంచి జారుకున్నట్లు తెలిసింది. డీఎఫ్‌వో జానకి రాజు పదవీ విరమణ సందర్భంగా సోమవారం ఈ ప్రాంతంలోని సెక్షన్ అధికారులు, డీఆర్వోలు, అటవీ సిబ్బంది నెల్లూరుకు వెళ్లగా, ఎర్ర చందనం దొంగలు పెద్దఎత్తున అడవుల్లోకి ప్రవేశించారని సమాచారం అందింది. దీంతో రాపూరు స్క్వాడ్, ఏఆర్, ఉదయగిరి పోలీసులు, అటవీ సిబ్బంది వేర్వేరు బృందాలుగా అడవుల్లో గాలించగా పండ్రంగి బీటు పరిధిలోని బూరుగూడు ప్రాంతంలో ఆరు ఎర్రచందనం దుంగలను గుర్తించినట్లు సమాచారం. పోలీసుల రాకను ముందే పసిగట్టిన కూలీలు దట్టమైన అడవుల్లోకి జారుకున్నట్లు తెలిసింది.

విద్యార్థి అదృశ్యం

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వినయ్ (13) కన్పించడం లేదని పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. ఆత్రేయవీధిలోని రైజ్‌ఎచైల్డ్ హోంలో ఈ విద్యార్థి ఉంటున్నాడు. సోమవారం పాఠశాలకు విచ్చేసి ఉదయం ప్రార్థన తదుపరి మరో విద్యార్థి సైకిల్ తీసుకొని వెళ్లాడని అప్పటి నుంచి కన్పించడం లేదని హోం నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. ఆమేరకు ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి: డక్కిలి మండలం శివగిరికి చెంది న వినాయక ప్రసాద్ (9) నాల్గవ తరగతి విద్యార్థి అదృశ్యమైనట్లు మంగళవారం విద్యార్థి కు టుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వినాయక ప్రసాద్‌ను ఏర్పేడు వ్యాసశ్రమంలో 4వ తరగతిలో హాస్టల్‌లో చేర్పించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గత నెల 28వ తేదీన హాస్టల్ నుంచి పాఠశాలకు వెళ్లి వినయ్ తిరిగి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసి అన్ని ప్రాంతాల్లో గాలించామన్నారు.



బయోమెట్రిక్..

రాయితీ ఎరువులకే

వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు కన్నయ్య



?: రైతులను ఈ- పాస్ విధానం వేధిస్తోందనే ఆరోపణలున్నాయి. మీరేమంటారు.

!: కొత్త విధానంలో తొలుత కొన్ని కష్టాలు తప్పవు. క్రమంగా సమస్యలన్నీ పరిష్కరిస్తున్నాం. రెవెన్యూ శాఖ వెబ్‌ల్యాండ్‌లో పొలాల సమాచారం ఆన్‌లైన్‌కాక రైతులకు ఈ తరహా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అన్నిటిని పరిగణలోకి తీసుకుని రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకుంటూ వెళ్తున్నాము. ఈ-పాస్ విధానం ద్వారా రైతులకే ప్రయోజనం ఎక్కువగా ఉంటుంది.

?: రాయితీ ఎరువులు పొందలేకున్నామనే ఆవేదన రైతుల్లో కనిపిస్తోంది. ఎందుకని.

!: వ్యవసాయ శాఖ ప్రవేశపెట్టిన బయోమెట్రిక్ విధానం కేవలం రాయితీ ఎరువులకు మాత్రమే. ప్రైవేట్‌గా కొనుగోలు చేసే ఎరువులకు బయోమెట్రిక్‌తో సంబంధం లేదు. రైతులు ఈ విషయం స్పష్టంగా తెలుసుకోవాలి. బయోమెట్రిక్ విధానంతో రైతులు త్వరలో ప్రయోజనం పొందుతారు. ప్రస్తుతం ఎరువుల కంపెనీలు ఆ ప్రయోజనం పొందుతున్నాయి.

?: ఎరువుల విక్రయాల్లో ఎమ్మార్పీ ఉల్లంఘనపై చర్యలేమిటి.

!: ఏ వ్యాపారైనా సరే ఎరువుల బస్తాలపై ఉన్న ఎమ్మార్పీకే వాటిని విక్రయించాలి. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాము. ఈ విషయంలో రైతులు చైతన్యవంతులు కావాలి. ఎమ్మార్పీ ఉల్లంఘన జరిగిన వెంటనే మాకు సమాచారం ఇస్తేచాలు. ఆ దుకాణంపై చర్యలు తీసుకుంటాము.

?: బయోమెట్రిక్ విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారా...

!: మా శాఖతోపాటు సహకార రంగాన్ని కూడా రంగంలోకి దింపి బయోమెట్రిక్ విధానంపై అవగాహన కల్పిస్తున్నాము. రైతుల వద్ద వారి పొలం పాసుపుస్తకంతోపాటు ఆధార్ కార్డు నకలు ఉంటే రాయితీ ఎరువులు ఇస్తాం. ఆ పత్రాలతో రైతే వెళ్లాల్సిన అవసరం లేదు. ఎవరినైనా రాయితీ ఎరువులకు పంపించవచ్చు. కానీ వెళ్లేవాళ్ల ఆధార్ కార్డు నకలు కూడా సమర్పించాల్సి ఉంటుంది.

?: పంటల సాగులో ఎరువులను విచ్చలవిడిగా వాడేస్తున్నారు. దీనిని అరికట్టే మార్గం లేదా...

!: అవగాహన లేమితోనే ఎరువులను అధికంగా వాడుతున్నారు. దీని వల్ల రైతులకే నష్టం. అందుకే త్వరలో భూసార పరీక్షల పత్రం ఆధారంగా ఎరువులను విక్రయించడం జరుగుతుంది. అందులో సిఫార్సుల మేరకు మాత్రమే దుకాణాల్లో ఎరువులు అమ్ముతారు. అంతకు మించి కిలో ఎరువు కూడా బయోమెట్రిక్ ద్వారా ఇవ్వలేరు. అలా కొంత ఎరువులు విచ్చవిడి తనానికి కళ్లెం వేయవచ్చు.

- నెల్లూరు (వ్యవసాయం)

యువకుడి బలవన్మరణం

నెల్లూరు (క్రైం): మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఓ యువకుడు బలవన్మరణం చెందాడు. వరికుంటపాడు మండలం తోట చెరువుపల్లి గ్రామానికి చెందిన బషీర్‌కు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు వారం రోజుల క్రితం చికిత్స నిమిత్తం నారాయణ ఆసుపత్రిలో చేర్పించారు. సోమవారం ఆసుపత్రి నుంచి బయటకు వచ్చిన తరువాత గాంధీనగర్‌లో నివాసం ఉన్న బాధితుడి మామ మస్తాన్ ఇంటి వద్దకు వెళ్లారు. ఇంటి వద్ద ఏవరూ లేని సమయంలో బాధితుడు సూపర్ వేస్మాల్‌ను తాగేశాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందాడు. ఆసుపత్రి వర్గాల సమాచారంతో ఐదో పట్టణ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మృతుడి తండ్రి ఖాజా మెహిద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

తప్పులు చేయవద్దు.. నిజాయతీగా పని చేద్దాం!

● ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



రెవెన్యూ హాలులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు భక్తవత్సలనాయుడు

నెల్లూరు (కలెక్టరేట్): 'విధి నిర్వహణలో తప్పులు చేయవద్దు.. నిజాయతీగా పని చేసి, మంచి పేరు తెచ్చుకుందాం'.. అని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ భక్తవత్సలనాయుడు అన్నారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ అసోసియేషన్ భవనంలో మంగళవారం వీఆర్వోల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ తప్పు చేస్తే ఎవరూ కాపాడలేరని, రైతాంగం కోసం కొన్ని సర్టిఫికెట్లు ఇవ్వాల్సి వస్తుందన్నారు. అన్ని పరిశీ లించి సర్టిఫికెట్లు జారీ చేస్తే సమయం మించిపోతుందని, నమ్మకంపై ఇలా సర్టిఫికెట్లు ఇస్తుంటామని ఆయన చెప్పారు. కొందరు వీటిని ఫోర్జరీ చేసి రెవెన్యూ అధికారులను బలి చేస్తున్నారని, అందుకే వీఆర్వోలంతా జాగ్రత్తగా విధులు నిర్వహించి మంచి మార్గంలో నిలవాలని కోరారు. పసుపు కుంభకోణం పేరుతో 19 మంది వీఆర్వోలు సస్పెండ్ అయిన సంగతిని ఆయన గుర్తు చేస్తూ, వీరిలో కొందరు తప్పు చేయకపోయినా శిక్ష పడినట్లు సమాచారం ఉందని, దీనిపై కలెక్టర్‌తో చర్చిస్తామని చెప్పారు.

కలెక్టర్‌ను కలిసిన రెవెన్యూ నాయకులు

పసుపు కుంభకోణం ఆరోపణలపై సస్పెండ్ అయిన 19 మంది వీఆర్వోల వ్యవహారంపై మంగళవారం సాయంత్రం కలెక్టర్ ముత్యాల రాజును రెవెన్యూ నాయకులు కలిశారు. సస్పెండ్ అయిన వీరిలో ముగ్గరి వీఆర్వోలకు ఎలాంటి సంబంధం లేదని వారు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన సానుకూల ంగా స్పందించి విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు జిల్లా వీఆర్వో అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అసోసియేషన్ నాయ కులు రవీంద్రబాబు, సుధాకర్, నరసింహులు, దారా రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

'నీరు-ప్రగతి' నిబంధనల మేరకు ఉండాలి

● అవసరమైన పనులకే మంజూరు కోరాలి
● భూసేకరణ వేగం పెంచండి
● కలెక్టర్ ముత్యాలరాజు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

నెల్లూరు(కలెక్టరేట్): నీరు-ప్రగతి పథకం కింద చేపట్టే పనులు నిబంధనల మేరకు ఉండాలని కలెక్టర్ ముత్యాలరాజు ఆదేశించారు. కలెక్టర్ బంగ్లాలో మంగళవారం నీరు-ప్రగతి, భూసేకరణ కార్యక్రమాలపై ఇరిగేషన్ అధికా రులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ నీరు-ప్రగతి పనులన్నిటిలో నాణ్యత పాటిం చాలన్నారు. ఈ పథకం మొదటి దశ కింద చేపట్టిన పనులు పూర్తయ్యాయని తెలిపారు. రెండో దశలో ఈ ఏడాది జూన్ 30 లోపు మొదలు కాని పనులను రద్దు చేయాలని సూచించారు. 2017-18 సంవత్సరంలో మూడో దశ కింద చేపట్టాల్సిన 3,280 పనులపై సమీక్ష జరిపి ఉపయోగం లేని పనులను రద్దుకు ప్రతిపాదించాలన్నారు. ఇకపై అవసరమైన పనులనే మంజూరు కోసం కోరాలని సూచించారు. వాగుల మీద చెక్ డ్యామ్‌లను నియమనిబంధనల ప్రకారం నిర్మించాలన్నారు. తెలుగుగంగ ప్రాజెక్టు కాలు వలు, మిగిలిపోయిన పనులను సత్వర మే పూర్తి చేయాలన్నారు. సోమశిల -స్వర్ణముఖి లింక్ కెనాల్‌కు భూసేకరణ సత్వరమే పూర్తి చేయాలన్నారు. ఆనం సంజీవరెడ్డి హైలెవల్ కెనాల్‌కు సంబంధించి భూసేకరణ పనులు పూర్తి చేయాలన్నారు. సోమశిల ఉత్తర కాలువ, కావలి కాలువ పనులు, భూసేకరణ పనులు పూర్తి చేయాలన్నారు. సంగం, నెల్లూరు బ్యారేజీలు, కండలేరు ఎడమ కాలువ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే నెల్లూరు నగరంలోని 7.7 లక్షల జనాభాకు తాగునీటిని సోమశిల నుంచి వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ అంశాన్ని పర్యవేక్షించాలని ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ ఈఈ కృష్ణమోహన్‌ను ఆదేశించారు. ఈ సమావేశం లో తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ పీ ప్రశాంతి, తెలుగుగంగ ఎస్‌ఈ కేవీ రమణ, ఇరిగేషన్ ఎస్‌ఈ ప్రసాద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

'లిక్విడ్ బయోఫర్టిలైజర్'కు అనుమతి నిరాకరణ



సమావేశానికి హాజరైన సర్పంచ్, అధికారులు

కొడవలూరు: పంచాయతీ పరిధిలోని ఇఫ్కో కిసాన్ సెజ్‌లో నిర్మించనున్న లిక్విడ్ బయోఫర్టిలైజర్ కంపెనీకి, ఇఫ్కో లాజిస్టిక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి అనుమతిని తిరస్కరించినట్లు సర్పంచు శ్రీనివాసులు తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో లిక్విడ్ బయోఫర్టిలైజర్ కంపెనీ, ఇఫ్కో లాజిస్టిక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల నిర్మాణాలకు అనుమతులు కోరుతూ సర్పంచు శ్రీనివాసులు అధ్యక్షతన మంగళవారం వార్డు సభ్యులతో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో చేరుకొని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ రైతులకు పూర్తి నష్టపరిహారాన్ని అందించే వరకు ఎలాంటి తీర్మానాలు చేయరాదని అన్నారు. దీంతో సర్పంచుతోపాటు మిగిలిన వార్డు సభ్యులు ఈ కంపెనీలకు పంచాయతీ తీర్మానాలను తిరస్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు కటారి ప్రసాదు, పోలయ్య, దశరధరామయ్య, జయమ్మరైతు సంఘం నాయకులు అకుల్‌రెడ్డి, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

మొన్నటి దాకా ఆక్వా సాగులో ఎన్నో వడిదిడుకులు ఎదుర్కొంటూ వచ్చిన రైతులకు మరోసారి దెబ్బ తగిలింది. ఆశించిన స్థాయిలో ధర ఉన్నా ఉత్పత్తులు లేకపోవడంతో వెనామీ రైతు లబోదిబోమంటున్నాడు. సముద్రతీర ప్రాంత మండలాలైన కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో పదేళ్లుగా రొయ్యల సాగు జరుగుతోంది. మొదట వరిసాగునే నమ్ముకున్న అన్నదాతలకు అతివృష్టి, అనావృష్టిలతో నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. దీంతో రొయ్యలసాగుపై దృష్టి పెట్టారు. ఆశించిన స్థాయిలో లాభాలు వస్తుండటంతో పొలాలను రొయ్యల చెరువులుగా మార్చేశారు. మొదట టైగర్ రొయ్య సాగు చేసినా పెద్దగా గిట్టుబాటు రాకపోవడంతో వెనామి సాగుపై మక్కువ చూపారు. ఈ సాగులో బంపర్ ఆఫర్‌లా లక్షల నుంచి కోట్ల రూపాయలు సంపాదించారు.

- కోట



- ధర ఉన్నా ఉత్పత్తి ఏదీ!?
- లబోదిబోమంటున్న సాగుదారులు

వైట్‌ఫికల్‌తో రొయ్యలు చనిపోవడంతో వదిలేసిన గుంటలు

వెనామీ విలాపం



సముద్ర తీర ప్రాంత మండలాల్లో ఫ్రీక్‌వాటర్ ద్వారా సాగులో ఉన్న వేనామీ రొయ్యల ఉత్పత్తులు ఇటీవల కాలం నుంచి పూర్తిగా పడిపోయాయి. గతంతో పోల్చుకుంటే ఈ ప్రాంతంలో వెనామీ సాగు విస్తారంగా పెరిగిపోయింది. దీనికితోడు 2015, 16 సంవత్సరాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులతోపాటు అతివృష్టి, అనావృష్టిల ప్రభావం రైతులపై పడింది. దీంతో వేసిన పంటలు మలమల మాడిపోయి వరి రైతులు నష్టపోయారు. ఇక విధిలేని పరిస్థితులలో లక్షలాది రూపాయలు అప్పు చేసి వెనామీ సాగు చేపట్టారు. కోట మండలంలో 4వేల ఎకరాలు, వాకాడులో 3500 ఎకరాలు, చిట్టమూరులో 3800 ఎకరాల్లో వెనామీ సాగు విస్తరించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, అనధికారికంగా కొన్ని వందల ఎకరాల్లో ఈ ఆక్వాసాగు సాగుతోంది. ప్రస్తుతం ఉత్పత్తులు గణనీయంగా పడిపోతుండటంతో వెనామీ రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. పుదుచ్చేరి, నెల్లూరు, చెన్నై వంటి ప్రాంతాలలో ఉన్న హెచరీల నుంచి తెచ్చిన రొయ్య పిల్లలు నాణ్యతలేనివిగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణమని చెబుతున్నారు. అంతేగాక రెండేళ్లుగా వర్షాభావ పరిస్థితులు రావడం ఎక్కువగా ఉష్ణోగ్రతలు పెరగడం కూడా ఓ కారణమని ఆక్వా నిపుణులు చెబుతున్నారు. ఎకరా గుంటలో 4 లక్షల రొయ్య పిల్లలను వదిలితే హార్వేస్టింగ్ సమయంలో కేవలం 2 లక్షల పిల్లలు మాత్రమే ఉత్పత్తి వస్తోంది. భూగర్భ జలాలు అడుగంటడం, వాతావరణంలో ఉష్ణోగ్రతలు విపరీతంగా మారడం వల్ల రొయ్యలు ఎదుగుదల లేకుండా టన్నెజీలు పడిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఈ ఏడాది వెనామి రైతులు భారీగా నష్టపోతుండటం వల్ల లబోదిబోమంటున్నారు.

లక్షల్లో నష్టపోతున్నాం



వెనామిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. మొదట్లో పెరుగుదల బాగానే వచ్చింది. వేల నుంచి లక్షల రూపాయలు ఖర్చు పెట్టాం. దిగుబడులపై అనుమానంగా ఉంది. ఇప్పటికే రెండుసార్లు నష్టపోయాం.

- వెంకటకృష్ణయ్య, దొరువుకట్ట

మళ్లీ వ్యవసాయం వైపు రైతులు..



వరి సాగులో వరుస నష్టాలు చవిచూసిన రైతులు ఆక్వాసాగుపై దృష్టి పెట్టడం మంచిదే. సంబంధిత శాఖల అధికారుల సూచనలు, సలహాలు తీసుకుని ఉంటే బాగుండేది. రొయ్యపిల్లల నాణ్యత లోపించినందువల్లే ఉత్పత్తుల పడిపోవడానికి ప్రధాన కారణంగా ఉంది.

- నిర్మల, వ్యవసాయాధికారిణి, కోట

ఉత్పత్తులు పడిపోయాయి

రొయ్యల ఉత్పత్తులు పూర్తిగా పడిపోయాయి. ఒకటిన్నర ఎకరం గుంటలో 4లక్షల రొయ్యల పిల్లలను వదిలాను. కేవలం ఒక టన్ను మాత్రమే రొయ్యల దిగుబడి వచ్చింది. దీంతో రూ.15లక్షల వరకు నష్టపోయా. రొయ్యల బాగా వచ్చినప్పటికీ ఉత్పత్తులు తగ్గిపోవడంతో అప్పులపాలయ్యాను.



- లీలా మోహన్‌రెడ్డి, విద్యానగర్

● ధరలు ఆశాజనకం

గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం వెనామీ ధరలు కొంత మేర ఆశాజనకంగా ఉన్నాయి. ఇటీవల వరకు 30 కౌంట్ రొయ్య రూ.350 నుంచి 430 వరకు, 40కౌంట్ రొయ్య రూ 330 నుంచి 360, 50 కౌంట్ రొయ్య రూ.270 నుంచి 300, 60 కౌంట్ రొయ్య రూ. 250 నుంచి 280, 70 కౌంట్ రొయ్య రూ.230 నుంచి 260, 80 కౌంట్ రూ.210 నుంచి 250 వరకు ధర పలుకుతోంది.

ముందు జాగ్రత్త పాటించాలి

వెనామీ రైతులు ముందుజాగ్రత్త పాటించాలి. వాతావరణంలో మార్పుల వల్ల దిగుబడులు తగ్గేందుకు ప్రధాన కారణం. భూగర్భ జలాలు పెద్దగా లేకపోవడం, ఉన్న నీటిపై అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల నీరంతా ఉప్పుగా మారిపోతోంది. ప్రస్తుత తరుణంలో ఆ ఉప్పునీటిని వెనామి పిల్లలు తాగడం వల్లే పెరుగుదల పడిపోయి ఉత్పత్తులు తగ్గిపోవడానికి కారణం. ఇలాంటి మార్పులు సహజమే.



- చెంగాయ్య, ఆక్వా నిపుణుడు

- పిల్లల ఆరోగ్యానికి, ఎదుగుదలకు తోడ్పాటు
- తల్లుల్లో గుండె జబ్బులు, కేన్సర్ల నివారణకు అవకాశం
- అవగాహన కల్పనలో వైద్యశాఖ నిర్లక్ష్యం
- 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

అమ్మపాలు అమృతం

చిన్నారి ఆరోగ్య సంరక్షణకు, ఎదుగులకు తల్లిపాలు ఎంతగానో తోడ్పడుతాయి. చిన్నారుల్లో రోగ నిరోధక శక్తితోపాటు కావాల్సిన పోషకాలు, విటమిన్లు అన్ని తల్లిపాలలో ఉన్నాయి. పుట్టిన చిన్నారికి అమృతంగా భావించే ముర్రిపాలు గంట తరువాత ఇస్తారు. ఇవి బిడ్డలో మానసిక ఎదుగుదలకు, మెదడు చురుకుగా పని చేసేందుకు తోడ్పడుతాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ఎన్నో రకాల పాల ఉత్పత్తులు వచ్చినా, తల్లిపాలకు మించిన పౌష్టికాహారం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ తల్లి పాల ప్రాధాన్యతపై ఈ నెల ఒకటి నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నది. ఇందుకు ఆయా ప్రభుత్వాలు కూడా సహకరిస్తున్నాయి.

- నెల్లూరు (వైద్యం)

జిల్లా వ్యాప్తంగా 74 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 477 ఉప కేంద్రాలు, 27 వరకు 24 గంటల ప్రసూతి ఆసుపత్రులు, మూడు ఏరియా ఆసుపత్రులు, ఒక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉన్నాయి. ఆయా ఆసుపత్రులలో తల్లిపాల ఆవశ్యకతపై పూర్తి అవగాహన కల్పించాల్సి ఉంది. తల్లిపాల విశిష్టతను తెలిపే అవగాహన సదస్సులు నిర్వహించాలి. జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలో విస్తృతంగా అవగాహన సదస్సులు జరగాలి. అలాగే పీహెచ్‌సీలలోనూ గర్భిణులకు తల్లిపాలు ప్రాధాన్యతను తెలియచేయాలి. అయితే ప్రభుత్వ ఉద్దేశం నీరుగారుతుంది. గర్భిణులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించడంలో ఐసీడీఎస్, అంగన్‌వాడీలు చొరవ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వారం పాటు గ్రామస్థాయిలో చేపట్టాల్సిన ప్రచారాలు నత్తనడకన నడుస్తున్నాయి. తల్లిపాల విశిష్టతపై ప్రభుత్వం కరపత్రాల రూపంలో వైద్య శాఖకు వచ్చినా అవి గ్రామీణ ప్రజలకు అందడంలేదు. ఎంతో ప్రాధాన్యత ఉన్న నిరుపేదలకు సైతం అత్యంత పౌష్టికాహారం తల్లిపాలే కావడం ఇందులో విశిష్టం. ఈ పరిస్థితిలో ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీలతో పాటు మిగిలిన ప్రాంతా ల్లో కూడా విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తే చిన్నారుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేసినట్లే. అయితే అవగాహన కల్పించడంతో వైద్యఆరోగ్య శాఖ విఫలమవుతోంది.

చిన్నారులకు ఉపయోగాలిలా...

- నవజాత శిశువు జన్మించిన తరువాత తల్లికి వచ్చే ముర్రిపాలు తాగించాలి.
- ఇందులో ఎన్నో పోషకాలు, విటమిన్లు ఉంటాయి.
- పిల్లల ఎదుగుదలకు తల్లిపాలు శ్రేష్టమైనవి.
- చిన్నారుల్లో రోగ నిరోధక శక్తిని పెంచే గుణం తల్లిపాలలో ఉంది.
- ఊబకాయం కూడా నిరోధించడమే కాకుండా మెదడు చురుకుగా పని చేసేలా తల్లిపాలు ఆరోగ్య ప్రదాయినిలా ఉన్నాయి.

పాలిచ్చే తల్లులకు ఎంతో మేలు

- బిడ్డలకు పాలిచ్చే తల్లులలో రొమ్ము కేన్సర్ ప్రమాదస్థాయిని తగ్గిస్తుంది.
- గర్భాశయంలోనూ, అండాశయంలోనూ కేన్సర్లను నిరోధిస్తుంది. కణజాలంలో ఈస్ట్రోజన్ తక్కువగా ఉత్పత్తి కావడంతో ఈ పరిస్థితి ఏర్పడుతుంది.
- బిడ్డ జన్మించిన క్రమంలో రుతుక్రమం ఆగడం వల్ల బోలు ఎముకల వ్యాధి వచ్చే అవకాశం నిరోధించేందుకు తల్లిపాలు బిడ్డలకు ఇవ్వాలి.
- భావోద్వేగాలు అరికడుతుంది.



తల్లిపాలు ఎంతో శ్రేష్ఠం



పుట్టిన ప్రతి చిన్నారికి తల్లిపాలు ఇవ్వాలి. ఈ తల్లిపాలను గంట లోపు ఇస్తే ఎన్నో పోషక విలువలు, వ్యాధి నిరోధక శక్తి చేకూరుతుంది. తల్లిపాలల్లో ఎన్నో ఔషద గుణాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పుట్టిన శిశువుకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరం.

- డాక్టర్ సుశీల, గర్భకోశవ్యాధి నిపుణురాలు, జీజీహెచ్ ఆసుపత్రి

ప్రతి తల్లి గుర్తుంచుకోవాలి



ప్రతి తల్లి పుట్టిన బిడ్డకు తన పాలివ్వడం వల్ల ఎలాంటి ఉపయోగాలో ముందుగానే తెలుసుకోవాలి. అప్పుడే ఆ తల్లిపాల విశిష్టత ఏమిటో తెలుస్తుంది. తల్లిపాలు చిన్నారికి త్వరగా జీర్ణమవుతాయి. ఇందులో కార్బొహైడ్రేట్, మినరల్స్, కాల్షియం, పొటాషియం వంటివి ఉన్నాయి. దీని వల్ల చిన్నారి పెరుగుదలకు, ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుంది.

- డాక్టర్ లక్ష్మీదుర్గ, గర్భకోశవ్యాధి నిపుణులు, కిమ్స్ ఆసుపత్రి



వైద్యులకు సూచనలిస్తున్నాం



గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఏఎన్ ఎంలు తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్నాం. అవసరమైతేనే వైద్యులు కూడా అవగాహన కల్పిస్తున్నారు. తల్లిపాలు విశిష్టతను వివరిస్తున్నారు. ఎన్నో పోషకాలు తల్లిపాలలో ఉన్నాయి. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు(ముర్రుపాలు) అందిస్తే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుంది.

- డీఎంహెచ్‌వో డాక్టర్ వరసుందరం

ట్రాఫిక్ నియంత్రణకు పక్కా ప్రణాళిక

- ఐలాండ్‌ల కుదింపు- వాహనాల మళ్లింపు
- మూడు నెలల్లో పూర్తిగా ప్రక్షాళన
- ప్రజా సహకారంతోనే సమస్య పరిష్కారం
- ట్రాఫిక్ సలహా మండలి భేటీ నిర్ణయం

నెల్లూరు (క్రైం): జిల్లాలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మార్గాన్వేషణ చేసే లక్ష్యంతో, ప్రజలు, వివిధ వర్గాల సలహాలు సూచనలు సేకరించే ఉద్దేశంతో ఇటీవలే ఏర్పాటుచేసిన ట్రాఫిక్ అడ్వైజరీ కమిటీ మంగళవారం తొలిసారిగా సమావేశమయింది. నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహించిన ఈ సమావేశంలో కలెక్టర్ ముత్యాలరాజు, ఎస్పీ రామకృష్ణతో పాటు రవాణా, ఆర్టీసీ తదితర అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎస్పీ రామకృష్ణ పలు ప్రతిపాదనలు ప్రవేశపెట్టి ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. వీటిలో ప్రధానంగా ట్రాఫిక్ ఐలాండ్‌ల కుదింపు, అవసరం లేని చోట చిన్నచిన్న ఐలాండ్‌ల తొలగింపు, ప్రభుత్వ పార్కింగ్ స్థలాలు, పెయిడ్ పార్కింగ్ స్థలాల ఏర్పాటు, నగర శివార్లలో ఆటోస్టాండ్‌లు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడం... ఇలా అన్ని సమస్యలపై ఒక నివేదికను సిద్ధంచేసి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అందరికీ తెలియచేశారు. వీటిపై ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. తదనంతరం ఆయా వర్గాలతో కొన్ని ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ఈ ప్రతిపాదనలపై తుది నిర్ణయాలు తీసుకుంటామని అధికారులు ప్రకటించారు.



ట్రాఫిక్ సలహా మండలి సమావేశాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు

లా అండ్ ఆర్డర్ బాగుంటేనే..

ఈ సందర్భంగా కలెక్టర్ ముత్యాలరాజు మాట్లాడుతూ జిల్లాలో లా అండ్ ఆర్డర్ బాగుంటేనే మిగిలిన అన్ని వ్యవస్థలు బాగుంటాయన్నారు. ఎస్పీ రామకృష్ణ ఈ వ్యవస్థను బాగు చేసేందుకు పలు సంస్కరణలు చేపడుతున్నారని, మంచి అధికారిని ప్రోత్సహిస్తే ప్రజలకు కూడా మంచే జరుగుతుందన్న విషయాన్ని అందరం గ్రహించాలని అన్నారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయగలిగామని, వీటిని పూర్తిగా అరికట్టేందుకు ఎక్కువ రీచ్‌లు ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఈ అడ్వయిజరీ కమిటీ సమావేశాన్ని పెద్దఎత్తున ఏర్పాటు చేశామన్నారు. నెల్లూరు స్మార్ట్‌సిటీ జాబితాలో ఉంది. నిధులకు కొరతేమీ లేదు. అందరి అభిప్రాయాలతో చేపట్టాల్సిన నిర్మాణాలు చేపట్టి, తొలగించాల్సిన అడ్డంకులను తొలగించి సమస్యను పరిష్కరిస్తాం. జిల్లాగా 'సేఫ్' జిల్లాగా మారుస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

ఇబ్బంది పెట్టడం మా ఉద్దేశం కాదు

ఎస్పీ రామకృష్ణ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. ఎవరినీ ఇబ్బంది పెట్టాలని మాకుండదు. ప్రజల సుఖ శాంతులే మాకు ముఖ్యం. వారికి ఇబ్బందులు కలగకూడదన్న ఉద్దేశ్యంతోనే ప్రత్యేక తనిఖీలు, డ్రైవ్‌లు చేపట్టాం. వీటికి ప్రజలు కూడా సహకరించాలి. జూన్ నెలలో జిల్లాలో సంభవించిన రోడ్డు ప్రమాదాల్లో 50 మృతి కేసులు నమోదైతే, ఈ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించిన తరువాత మరణాల సంఖ్య 28కి తగ్గింది. లైసెన్స్‌లు, నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరిస్తేనే ప్రజల ప్రాణాలకు రక్షణ ఉంటుంది. ఎవరిమీద కక్ష సాధింపు చర్యలు చేపట్టడం లేదన్న విషయాన్ని ప్రజలు తెలుసుకుని నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. చాలామంది తమకు వెసులుబాటు కల్పించాలని, ఉపాధి కోల్పోతున్నామని, అధికారులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. లక్షలాది ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ తమకు సమస్య అంటే ఎలా? ఇంతకాలం ఈ నిబంధనలు, పద్ధతులు ఎందుకు పాటించకుండా నిర్లక్ష్యం చేశారో ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఇకనుంచైనా పద్ధతి ప్రకారం, నిబంధనల ప్రకారం నడుచుకోవడం, వాహనదారులకూ, ప్రజలకు కూడా మంచిదని స్పష్టం చేశారు. అనంతరం వివిధ వర్గాల ప్రజలు ట్రాఫిక్ సమస్యపై తమ సూచనలు, సమస్యలు తెలియచేశారు. ఈ సమావేశంలో ఉప రవాణా కమిషనర్ శివరామ ప్రసాద్, ఆర్టీసీ ఆర్ఎం విజయరవివర్మ, కార్పొరేషన్ అదనపు కమిషనర్ ప్రదీప్‌కుమార్, ట్రాన్స్‌కో ఎస్ఈ విజయ్‌కుమార్‌రెడ్డి, అదనపు ఎస్పీ శరత్‌బాబు, ఇతర అధికారులు, డీఎస్పీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలు, లారీ యాజమాన్యాలు, వ్యాపార వర్గాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'తారకేశ్వర' నిర్మాణస్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో

సూళ్లూరుపేట : సూళ్లూరుపేటకు వరద ముప్పు కలిగించేలా నిర్మాణమవుతున్న తారకేశ్వర టెక్స్‌టైల్ పార్కు ప్రాంతాన్ని నాయుడుపేట ఆర్డీవో శీనానాయక్ మంగళవారం తనిఖీ చేశారు. తారకేశ్వరా.. ముంచేస్తావా? అంటూ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం స్థానికంగా సంచలనం కలిగించింది. దీంతో మంగళవారం ఆర్డీవో ఈ ప్రాంతాన్ని తనిఖీ చేశారు. అక్కడ ప్రతినిధులను వాకబు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి కథనంతో స్పందించి పరిశీలనకు వచ్చానన్నారు. అయితే ఈ నిర్మాణం వల్ల సూళ్లూరుపేట ముంపునకు గురవుతుందని గుర్తించారా అని ప్రశ్నించగా ఆయన సమాధానాన్ని దాటవేశారు. వరద ఏమేరకు వస్తుంది.. ప్రమాదం ఏమేరకు ఉంటుందన్న విషయం ఇరిగేషన్ అధికారులు చెప్పాల్సి ఉందన్నారు. ఈ ప్రాంతాన్ని ఆరు అడుగులమేర ఎత్తు పెంచుతుండడంతో ఆ మట్టిని చెరువుల నుంచి తవ్వేందుకు ఇరిగేషన్ ఎలా అనుమతి ఇచ్చిందని తాను ఆశాఖ అధికారులను కూడా ప్రశ్నించానన్నారు. ఇక్కడి విషయాన్ని కలెక్టర్‌కు నివేదిస్తానని చెప్పారు.



తారకేశ్వర నిర్మాణస్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శీనానాయక్

కులవృత్తితో ప్రభుత్వాదాయం తెచ్చేది గౌడలే

బిట్రగుంట: కులవృత్తితో ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చేది కులుగీత కార్మికుడు గౌడ మాత్రమేనని నెల్లూరు జిల్లా గౌడసేవా సమితి అధ్యక్షుడు పీ గోవిందగౌడ్ అన్నారు. బోగోలు మండలంలోని పలు పంచాయతీల్లో నివసిస్తున్న గీత కార్మికుల కుటుంబాలను కావలి బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంది పెనుగొండయ్యగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయన సందర్శించారు. 10వ తరగతిలో ప్రతిభ చాటిన గౌడ విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం మాట్లాడుతూ బతుకు కోసం గౌడలు కులవృత్తిని నమ్ముకున్నారని, ఆర్థికంగా వెనుకబడినప్పటికీ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివి ప్రతిభ చాటిన గౌడ విద్యార్థులకు ఐదు వేల నగదు ప్రోత్సాహం, విద్యాసామాగ్రిని ఆగస్టు 20వ తేదీ నెల్లూరు పురమందిరంలో పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం కమిటీ సభ్యులు రంగయ్య గౌడ్, రామకృష్ణయ్యగౌడ్, రమణయ్యగౌడ్, చినగోవిందయ్యగౌడ్, శేషయ్యగౌడ్, మల్లికార్జునరావు, వెంకటేశ్వర్లుగౌడ్ పాల్గొన్నారు.



జక్కేపల్లి గూడూరులో చిన్నారితో మాట్లాడుతున్న గోవిందగౌడ్

జిల్లాకు భూసార మినీ ల్యాబ్‌లు



మండలాలకు కేటాయించిన మినీ ల్యాబ్ కిట్లు

● మండలానికి రెండు చొప్పున కిట్ల పంపిణీ

నెల్లూరు(వ్యవసాయం) : భూసార పరీక్షలను కట్టుదిట్టం చేస్తూ సారవంతాన్ని పెంపొందించేందుకు జిల్లాకు భూసార మినీ ల్యాబ్‌లను కేటాయించారు. మండలానికి రెండ చొప్పున కిట్లను ఇప్పటికే వ్యవసాయశాఖ అందజేసింది. ఏటా మండలానికి 200 నమూనాలను పరీక్షించే సామర్థ్యం కలిగిన మందులు అందజేశారు. ఏవో పర్యవేక్షణలో సాగే ఈ ప్రక్రియకు వంద శాతం సబ్సిడీపై అందచేసే సూక్ష్మధాతుల పంపిణీకి భూసార పరీక్షలను లింకుపెట్టారు. అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులున్న ప్రాంతాలలోనే ఈ మినీ ల్యాబ్‌లను ఉపయోగించనున్నారు. రబీ, ఖరీఫ్ సీజన్‌లలో ఏటా లక్ష వరకు గ్రిడ్లను ఎంపిక చేసి భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు. రెండు సైకిళ్ల పద్ధతుల్లో ఒక్కొక్క సైకిల్ విభాగంలో మూడు విడతలుగా భూసార పరీక్షలకు లక్ష్యాలను సాధారణ సాగు ఆధారంగా ఎంపిక చేసుకుని వ్యవసాయశాఖ భూసార పరీక్షలను నిర్వహిస్తుంది. ఇందులో అత్యధిక శాతం జింకు లోపం పంట పొలాలను వెంటాడుతుండగా, 17 శాతానికి పైగా చౌడు భూముల్లో చేరుతుంది. 40 శాతం ఐరన్ లోపాలు జిల్లాలో 8 లక్షల వ్యవసాయ భూముల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇవన్నీ తాజా భూసార పరీక్షల ద్వారా తేటతెల్లమవడంతో ఎప్పటికప్పుడు జిల్లా పరిస్థితులను అధ్యాయనం చేస్తున్న కేంద్రం మినీ ల్యాబ్‌లను కేటాయించింది. స్థానిక ఏవో పర్యవేక్షణలో ఉండే ఈ ల్యాబ్‌ల ద్వారా భూసార పరీక్షలను క్షేత్ర స్థాయిలో నిర్వహించనున్నారు. పంట భూముల్లో సూక్ష్మలోపాలు ఏర్పడిన సమయాల్లో మాత్రమే వీటిని వినియోగించనున్న ఏవోలు ఏటా 200 నమూనాలకు సరిపడా పరీక్షలను ప్రాథమిక దశలో చేపట్టనున్నట్లు వ్యవసాయశాఖ సూచించింది.

భూసార పరీక్షలతో సబ్సిడీ లింకు

వ్యవసాయ భూముల్లో ఏర్పడే జింకు, బోరాన్, ఐరన్, చౌడు సమస్యలను నివారించి సూక్ష్మధాతులను వంద శాతం రాయితీపై అందచేసేందుకు భూసార పరీక్షలతో లింకు పెట్టిన వ్యవసాయ శాఖ ఈ తరహా సూక్ష్మధాతులను ఏ రైతు పొందాలన్న భూ పరీక్షలు ఖచ్చితం చేశారు. ఎక్కడికక్కడ భూమిలో సారవంతాన్ని పెంచి రసాయనిక ఎరువుల వాడాకాన్ని తగ్గించేందుకు కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఈ నూతన విధానం అమల్లోకి తీసుకువచ్చినట్లు తెలుస్తుంది.

మండలానికి రెండు ల్యాబ్‌లు



మండలానికి రెండు మినీ ల్యాబ్‌లను కేటాయించాం. జిల్లా స్థాయి నమూనాల సేకరణ, పరీక్షలు యధావిధిగా సాగుతాయి. మండల స్థాయిలో ఎక్కడైన ఇబ్బందులు తలెత్తితేనే వీటిని సద్వినియోగం చేసుకోవాల్సి ఉంది. సూక్ష్మధాతులు పొందాలంటే తప్పనిసరిగా భూపరీక్షలుండాలి.

- సుమలత, ఏడీ, జీవ నియంత్రణ ప్రయోగశాల

ఆలోచన విధానం, సునిశిత దృష్టి.. ప్రధానం

పోలిక పరీక్ష

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో పదం, దానికి ఒక సంబంధం ఇస్తారు. మరో పదం ఇచ్చి ఆ పదానికి కూడా అలాంటి సంబంధాన్నే తెలపమని అడుగుతారు. ఈ విభాగంలోని ప్రశ్నల్లో జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు కూడా ఉంటాయి. అభ్యర్థి ఆలోచన విధానం, విజ్ఞానం, సునిశిత దృష్టి, పరిశీలనాత్మకతను అంచనా వేయడమే ఈ పరీక్ష ముఖ్యోద్దేశం. ఇందులో మూడు రకాల ప్రశ్నలు ఉంటాయి. అవి..

1. పదాల పోలిక పరీక్ష
2. వర్ణమాల అక్షరాల పోలిక పరీక్ష
3. సంఖ్యలతో పోలిక పరీక్ష


Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

మోడల్ - 1

1. చాక్‌పీస్: నల్లబల్ల:: ---- : పలక
ఎ) కలం బి) పెన్సిల్ సి) బలపం డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: నల్లబల్లపై చాక్ పీస్‌తో రాస్తారు. అదేవిధంగా పలకపై బలపంతో రాస్తారు.

2. విటమిన్ ఎ : రేచీకటి :: ----- : రికెట్స్
ఎ) విటమిన్ బి బి) విటమిన్ సి
సి) విటమిన్ డి డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: విటమిన్ ఎ లోపంతో వచ్చే వ్యాధి రేచీకటి. అదేవిధంగా విటమిన్ డి లోపంతో వచ్చే వ్యాధి రికెట్స్

3. పత్రం: క్లోరోఫిల్ :: రక్తం : -----
ఎ) కెరొటిన్ బి) జాంథోఫిల్
సి) హిమోగ్లోబిన్ డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: పత్రాల ఆకులు పచ్చగా ఉండటానికి కారణం క్లోరోఫిల్. అదేవిధంగా రక్తం ఎర్రగా ఉండడానికి కారణం హిమోగ్లోబిన్

4. ధర్మామీటర్: ఉష్ణోగ్రత :: అమ్మీటర్ : -------
ఎ) విద్యుత్ బి) ఉష్ణం సి) తేమ డి) వేగం
సమాధానం : **ఎ**
వివరణ: ఉష్ణోగ్రతను కొలిచే సాధనం ధర్మామీటర్. అలాగే విద్యుత్‌ను కొలిచేది అమ్మీటర్

5. రైతు : పొలం :: శాస్త్రజ్ఞుడు: -------
ఎ) కర్మాగారం బి) పాఠశాల
సి) ప్రయోగశాల డి) రంగస్థలం
సమాధానం: **సి**
వివరణ: రైతు పనిచేసే ప్రదేశం పొలం. అదేవిధంగా శాస్త్రవేత్త పనిచేసే ప్రదేశం ప్రయోగశాల

6. పక్షులు : ఆర్నిథాలజీ::గుండె: ------
ఎ) హెమటాలజీ బి) కార్డియాలజీ
సి) సెమన్‌టిక్స్ డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: పక్షులను గురించి వివరించే శాస్త్రం ఆర్నిథాలజీ. అదేవిధంగా హృదయ స్పందన గురించి వివరించే శాస్త్రం కార్డియాలజీ

7. రైతు : నాగలి :: సైనికుడు: ---------
ఎ) తుపాకి బి) కత్తి సి) సూది డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: నాగలిని ఉపయోగించే వ్యక్తి రైతు. అదేవిధంగా తుపాకిని ఉపయోగించే వ్యక్తి సైనికుడు

8. పాల స్వచ్ఛత: లాక్టోమీటర్ :: భూకంపాలు: ---
ఎ) బారోమీటర్ బి) అనిమోమీటర్
సి) ఆడో మీటర్ డి) సిస్మోగ్రాఫ్
సమాధానం: **డి**
వివరణ: పాల స్వచ్ఛతను కొలిచే పరికరం లాక్టోమీటర్. అలాగే భూకంప తీవ్రతను కొలిచే సాధనం సిస్మోగ్రాఫ్

9. బలం: వాట్ :: విద్యుత్ : --------
ఎ) జౌల్ బి) డిగ్రీ సి) ఆంపియర్ డి) సెకండ్స్
సమాధానం: **సి**
వివరణ: బలానికి ప్రమాణం వాట్ అలాగే విద్యుత్‌కు ప్రమాణం ఆంపియర్

10. ముఖేష్: హాకీ :: చెస్ : -------
ఎ) గగన్ నారంగ్ బి) హరి కృష్ణ
సి) లక్ష్మణ్ డి) ఎవరూకాదు
సమాధానం: **బి**
వివరణ: ముఖేష్ హాకీ క్రీడాకారుడు. అలాగే హరికృష్ణ చెస్ క్రీడాకారుడు

11. కొలంబో : శ్రీలంక :: ------ : ఆఫ్ఘనిస్థాన్
ఎ) ఇస్లామాబాద్ బి) కాబూల్ సి) తింపు డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: శ్రీలంక రాజధాని కొలంబో. అలాగే ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్

12. హస్తినాపురం : న్యూఢిల్లీ :: మద్రాస్ : -----
ఎ) చెన్నై బి) పనాజి సి) కోల్‌కతా డి) ముంబై
సమాధానం: **ఎ**
వివరణ: హస్తినాపురానికి కొత్త పేరు న్యూఢిల్లీ, అలాగే మద్రాస్‌కు కొత్త పేరు చెన్నై

13. భరతనాట్యం: తమిళనాడు :: యక్షగానం: -------
ఎ) కేరళ బి) మహారాష్ట్ర సి) కర్ణాటక డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: తమిళనాడు శాస్త్రీయ నృత్యం భరతనాట్యం. కర్ణాటక శాస్త్రీయ నృత్యం యక్షగానం

14. న్యూజిలాండ్ జాతీయ పక్షి : కివి :: మన జాతీయ పక్షి : --------
ఎ) నెమలి బి) పావురం సి) చిలుక డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: న్యూజిలాండ్ జాతీయ పక్షి కివి అదేవిధంగా మన జాతీయ పక్షి నెమలి.

15. చార్మినార్: హైదరాబాద్ :: తాజ్‌మహల్:-------
ఎ) న్యూఢిల్లీ బి) ఆగ్రా సి) మీరట్ డి) ఔరంగాబాద్
సమాధానం: **బి**
వివరణ: చార్మినార్ హైదరాబాద్‌లో ఉంది. తాజ్‌మహల్ ఆగ్రాలో ఉంది.

16. ఇండియా : రూపాయి :: జపాన్ : -------
ఎ) డాలర్ బి) ఫ్రాంక్ సి) యన్ డి) దీనార్
సమాధానం: **సి**
వివరణ: ఇండియా కరెన్సీ రూపాయి. జపాన్ కరెన్సీ యన్

17. గ్రహాలు : ఖగోళ శాస్త్రం :: నాణేలు : -----------
ఎ) సిస్మోగ్రాఫ్ బి) పేలియోగ్రఫీ
సి) పాథాలజీ డి) న్యూమిస్‌మాటిక్స్
సమాధానం: **డి**
వివరణ: గ్రహాల గురించి వివరించే శాస్త్రం ఖగోళశాస్త్రం. అలాగే నాణేల గురించి వివరించే శాస్త్రం న్యూమిస్‌మాటిక్స్

18. ఆర్య సమాజం: దయానంద సరస్వతి:: రామకృష్ణ మిషన్: --------
ఎ) అనిబిసెంట్ బి) స్వామి వివేకానంద
సి) నివేదిత డి) ఎవరూకాదు
సమాధానం: **బి**
వివరణ: ఆర్య సమాజ స్థాపకుడు దయానంద సరస్వతి. అదేవిధంగా రామకృష్ణ మిషన్ స్థాపకుడు స్వామి వివేకానంద

19. స్వామి వివేకానంద: నరేంద్రదత్:: దయానంద సరస్వతి: -------
ఎ) గదాధరుడు బి) మూల శంకర్
సి) రామచందర్ డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: స్వామి వివేకానంద అసలు పేరు నరేంద్ర దత్. దయానంద సరస్వతి అసలు పేరు మూల్ శంకర్

20. మెగస్తనీస్: ఇండికా:: పాణిని: -----------
ఎ) అష్టాధ్యాయి బి) హర్ష చరిత్ర
సి) చరక సంహిత డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: మెగస్తనీస్ రచించిన గ్రంథం ఇండికా, అదేవిధంగా పాణిని రచించిన గ్రంథం అష్టాధ్యాయి.

21. పాస్కల్: ఒత్తిడి:: ఆంపియర్: -------
ఎ) విద్యుత్ బి) బలం సి) శక్తి డి) స్వచ్ఛత
సమాధానం: **ఎ**
వివరణ: పాస్కల్ అనేది ఒత్తిడికి ప్రమాణం. అలాగే ఆంపియర్ అనేది విద్యుత్‌కు ప్రమాణం

22. కన్నడం: కర్ణాటక:: మరాఠీ: -------
ఎ) మధ్యప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) గుజరాత్ డి) రాజస్థాన్

23. హాంకాంగ్: చైనా:: వాటికన్: --------
ఎ) నార్వే బి) డెన్మార్క్
సి) నెదర్‌లాండ్ డి) రోమ్
సమాధానం: **డి**
వివరణ: చైనాలోని ఒక నగరం హాంకాంగ్. అలాగే రోమ్‌లోని నగరం వాటికన్ సిటీ

24. ఇన్సులిన్: హార్మోన్::ట్రిప్సిన్: -------
ఎ) ఎంజైమ్ బి) విటమిన్ సి) హార్మోన్ డి) గ్రంధి
సమాధానం: **ఎ**
వివరణ: ఇన్సులిన్ అనేది హార్మోన్. అలాగే ట్రిప్సిన్ అనేది ఒక ఎంజైమ్

25. వినడం: చెముడు:: మాట్లాడడం: --------
ఎ) నిశ్శబ్దం బి) మూగ సి) శాంతి డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: వినలేకపోవడం చెముడు అలాగే మాట్లాడలేకపోవడం మూగ

26. భాక్రానంగల్: సట్లెజ్:: హీరాకుడ్ : -------
ఎ) గోదావరి బి) కృష్ణ సి) కావేరి డి) మహానది
సమాధానం: **డి**
వివరణ: భాక్రానంగల్ డ్యామ్ సట్లెజ్ నదిపై ఉంది అలాగే హీరాకుడ్ డ్యామ్ మహానదిపై ఉంది.

27. హరిత విప్లవం: మొక్కలు:: నీలి విప్లవం: ------
ఎ) చేపలు బి) పాలు సి) నూనె గింజలు డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: మొక్కల అధికోత్పత్తికి చేపట్టిన కార్యక్రమం హరిత విప్లవం. అలాగే చేపల అధిక దిగుబడికి చేపట్టిన కార్యక్రమం నీలి విప్లవం

28. తూర్పు: వాయవ్యం:: నైరుతి: ----
ఎ) ఈశాన్యం బి) తూర్పు సి) ఆగ్నేయం డి) ఉత్తరం
సమాధానం: **బి**
వివరణ: తూర్పునకు 135 డిగ్రీల అపసవ్యదిశ వాయవ్యం. నైరుతికి 135 డిగ్రీల అపసవ్య దిశ తూర్పు

29. సత్యజిత్ రే: సినిమా:: పికాసో: ------
ఎ) రచయిత బి) నాటక కర్త
సి) చిత్రకారుడు డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: సినిమా రంగానికి చెందిన ప్రముఖుడు సత్యజిత్ రే. అలాగే సుప్రసిద్ధ చిత్రకారుడు పికాసో

30. రెస్టారెంట్: మెను:: లైబ్రరీ: -----
ఎ) చదువు బి) పుస్తకాలు సి) విద్య డి) క్యాటలాగ్
సమాధానం: **డి**
వివరణ: మెను అనేది ఐటెమ్స్ లిస్ట్. కేటలాగ్ అనేది బుక్స్ లిస్ట్

31. ఓనం: కేరళ:: బిహు: ------
ఎ) కర్ణాటక బి) మిజోరాం సి) అసోం డి) ఒడిశా
సమాధానం: **సి**
వివరణ: కేరళ ప్రజలు చేసుకొనే పండుగ ఓనం. అసోం ప్రజలు చేసుకొనే పండుగ బిహు

32. ప్రమాదం: అజాగ్రత:: వ్యాధులు: -------
ఎ) అపరిశుభ్రత బి) వైద్యుడు
సి) మందులు డి) వైద్యం సమాధానం: **ఎ**
వివరణ: అజాగ్రత్తతో ప్రమాదం లభిస్తుంది. అలాగే అపరిశుభ్రత వల్ల వ్యాధులు ప్రబలుతాయి.

33. శిల్పం: రూపం:: పాట ------
ఎ) సంగీతం బి) గానం సి) చెప్పలేం డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: శిల్పానికి మంచి రూపం ఉండాలి. అలాగే పాటకు మంచి గానం ఉండాలి.

అడ్మిషన్స్

ఐఎన్‌ఎటి 2017

పుణెలోని ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐయుసిఎఎ), నేషనల్ సెంటర్ ఫర్ రేడియో ఆస్ట్రో ఫిజిక్స్ (ఎన్‌సిఆర్ఎ) సంస్థల్లో పిహెచ్‌డి చేసే వారికి ఉద్దేశించిన రీసెర్చ్ స్కాలర్‌షిప్‌నకు ప్రకటన విడుదలైంది.
విభాగాలు: ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, ఫిజిక్స్
అర్హత: ఆగస్టు నాటికి 55 శాతం మార్కులతో (బిఎస్సీ/ ఎమ్మెస్సీ/ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ)(ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్స్/ ఆస్ట్రానమీ/ అప్లయిడ్ మేథమెటిక్స్) లేదా బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ పూర్తి.
ఎంపిక: ఐయుసిఎఎ - ఎన్‌సిఆర్ఎ అడ్మిషన్ టెస్ట్(ఐఎన్‌ఎటి 2017), ఇంటర్వ్యూ ద్వారా
పరీక్ష కేంద్రం: ఐయుసిఎఎ, పుణె
ఇంటర్వ్యూ: డిసెంబరు 7, 8
వేదిక: ఎన్‌సిఆర్ఎ - టిఐఎఫ్ఆర్, పుణె
దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 15, 2017
వెబ్‌సైట్: http://inat.ncra.tifr.res.in/inat

పుణె పాలిటెక్నిక్

పుణెలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ - **అడ్వాన్స్‌డ్ డిప్లొమా(ఆటోమోటివ్ మెకట్రానిక్స్)** ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ స్కిల్ బేస్డ్ జాబ్ ఓరియంటెడ్ కోర్సును **'మెర్సిడెజ్ - బెంజ్'** సహకారంతో నిర్వహిస్తున్నారు.
కోర్సు వ్యవధి: ఏడాది
అర్హత: డిప్లొమా/ డిగ్రీ (ఇంజనీరింగ్)
ఎంపిక: ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా
ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఆగస్టు 18
పూర్తి వివరాలకు వెబ్‌సైట్ చూడవచ్చు.
వెబ్‌సైట్: www.gppuneamc.org

ఎయిమ్స్

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)- పిహెచ్‌డి ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన **'ఆన్‌లైన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్'**కు దరఖాస్తులు కోరుతోంది.
ఎగ్జామినేషన్ తేదీ: సెప్టెంబరు 8
పరీక్ష కేంద్రం: ఢిల్లీ/ ఎన్‌సిఆర్
ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 3, 2017
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 17, 2017
వెబ్‌సైట్: www.aiimsexams.org

డిఎస్‌సి

ద ఢిల్లీ స్కూల్ ఆఫ్ కమ్యూనికేషన్(డిఎస్‌సి)- పీజీ(కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. మ్యాట్/ క్యాట్ అర్హత పొంది ఉండాలి. లేదా డిఎస్‌సి ఇంటర్నల్ అడ్మిషన్ టెస్ట్‌లో అర్హత పొంది ఉండాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 7, 2017
వెబ్‌సైట్: www.dsc.edu.in/

డిఐఎంహెచ్

చెన్నైలోని డైరెక్టరేట్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ అండ్ హోమియోపతి (డిఐఎంహెచ్)- బిఎస్ఎంఎస్/ బిఎఎంఎస్/ బిఎన్‌వైఎస్/ బియుఎంఎస్/ బిహెచ్ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: హయ్యర్ సెకండరీ
క్యాంపస్‌లు: తిరునల్వేలి. చెన్నై, మధురై, కన్యాకుమారి **దరఖాస్తు ఫీజు:** రూ.500
అప్లికేషన్ డౌన్‌లోడింగ్‌కు చివరి తేదీ: ఆగస్టు 30, 2017
హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31, 2017
చిరునామా: The Secretary, Selection Committee, Directorate of Indian Medicine and Homoeopathy, Arignar Anna Govt.Hospital of Indian Medicine Campus, Arumbakkam, Chennai-600106
వెబ్‌సైట్: www.tnhealth.org

‘ద లైఫ్ డివైన్’ గ్రంథ రచయిత ఎవరు?

హోంరూల్ ఉద్యమం

1. భారతదేశం బ్రిటిష్ సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉంటూ స్వయంపాలన సాగించుకొనే స్థితిని సాధించే లక్ష్యంతో ప్రారంభమైన ఉద్యమం?
ఎ) సహాయనిరాకరణ ఉద్యమం
బి) హోంరూల్ ఉద్యమం
సి) క్విట్ ఇండియా ఉద్యమం డి) ఉప్పుసత్యాగ్రహం
2. హోంరూల్ లీగ్‌ను 1916 ఏప్రిల్‌లో స్థాపించింది?
ఎ) బాలగంగాధర్ తిలక్ బి) సుబ్రమణ్య అయ్యర్
సి) సి.పి.రామస్వామి అయ్యర్ డి) పి.కె.తెలాంగ్
3. హోంరూల్ అనే పదాన్ని ఏ ఉద్యమం నుంచి స్వీకరించారు?
ఎ) గ్రీక్ ఉద్యమం బి) లాటిన్ ఉద్యమం
సి) ఐరిష్ ఉద్యమం డి) గ్రీన్‌పీస్ ఉద్యమం
4. 1916 సెప్టెంబరులో హోంరూల్ లీగ్‌ను స్థాపించింది?
ఎ) మోతీలాల్ నెహ్రూ బి) అనిబిసెంట్
సి) పి.కె.తెలాంగ్ డి) ఎస్.సుబ్రమణ్య అయ్యర్
5. 1897లో హోంరూల్ లీగ్ అనే పదాన్ని మొట్టమొదట ఉపయోగించింది?
ఎ) శ్యాంజీ కృష్ణవర్మ బి) శ్రీకృష్ణ కార్పడే
సి) నరసింహచింతామన్ కేల్కర్
డి) మోతీలాల్ నెహ్రూ
6. ‘న్యూ ఇండియా’ పత్రికను స్థాపించింది?
ఎ) శ్యాంజీ కృష్ణవర్మ బి) బి.పి.వాడియా
సి) జె.ఎస్.అరుండేల్ డి) అనిబిసెంట్
7. ‘ఇండియన్ ఉమెన్స్ అసోసియేషన్’ అనే సంస్థను స్థాపించింది?
ఎ) మహమ్మద్ అలీ జిన్నా
బి) అంబికా చరణ్ మజుందర్
సి) అనిబిసెంట్ డి) సురేంద్రనాథ్ బెనర్జీ
8. 1885లో Fabian societyలో చేరి Fabian Essays అనే పత్రికలో సోషలిజం మీద వ్యాసాలు రాసింది?
ఎ) అనిబిసెంట్ బి) భగవాన్‌దాస్
సి) బి.పి.వాడియా డి) జె.ఎస్.అరుండేల్
9. అనిబిసెంట్ దివ్యజ్ఞాన సమాజంలో ఎప్పుడు చేరారు?
ఎ) 1885 బి) 1889 సి) 1895 డి) 1899
10. బెనారస్‌లో ‘కేంద్రీయ హిందూ కళాశాల’ను స్థాపించింది?
ఎ) గాంధీ బి) రాస్‌బిహారి ఘోష్
సి) అనిబిసెంట్ డి) బాలగంగాధర్ తిలక్
11. ‘భగవద్గీత’ను అనిబిసెంట్ ఎవరి సహకారంతో ఆంగ్లంలోకి అనువదించారు?
ఎ) రాస్‌బిహారి ఘోష్ బి) బి.పి.వాడియా
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) డాక్టర్ భగవాన్ దాస్
12. భారతీయులు పాశ్చాత్య సంప్రదాయాల పట్ల ఆకర్షితులు కావడాన్ని వ్యతిరేకించింది?
ఎ) సాండర్స్ బి) అనిబిసెంట్
సి) చెమ్స్‌ఫర్డ్ డి) మాంటేగ్
13. 1907లో కల్నల్ ఆల్కాట్ మరణం తరవాత దివ్యజ్ఞాన సమాజ బాధ్యతలు చేపట్టింది?
ఎ) అనిబిసెంట్ బి) బాలగంగాధర్ తిలక్
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) జె.ఎస్.అరుండేల్
14. ‘ద లైఫ్ డివైన్’ అనే గ్రంథాన్ని రచించింది?
ఎ) అరవింద్‌ఘోష్ బి) తిలక్
సి) లాలాలజపతిరాయ్ డి) బిపిన్ చంద్రపాల్
15. 1895-1907 మధ్య బెనారస్ కేంద్రంగా హిందూ మతం గురించి ఉపన్యాసాలు చేసింది?
ఎ) పి.కె.తెలాంగ్ బి) ఎస్.సుబ్రమణ్య అయ్యర్
సి) సి.పి.రామస్వామి అయ్యర్ డి) అనిబిసెంట్
16. 1916 లక్నో సమావేశంలో అతివాదులు తిరిగి కాంగ్రెస్ చేరడంలో కీలక పాత్ర పోషించింది?
ఎ) అనిబిసెంట్ బి) సురేంద్రనాథ్ బెనర్జీ
సి) రాస్‌బిహారి ఘోష్
డి) బాలకృష్ణ శివరాం మోహన్‌జీ
17. 'Englands difficulty is Indian opportunity' అనే నినాదాన్ని ఇచ్చింది?
ఎ) చాంబర్లీన్ బి) అనిబిసెంట్
సి) బి.పి.వాడియా డి) మహమ్మద్ అలీ జిన్నా
18. కాంగ్రెస్, ముస్లిం లీగ్ మధ్య 1916లో లక్నో ఒడంబడిక జరగడంలో కీలక పాత్ర పోషించింది?
ఎ) సి.పి.రామస్వామి అయ్యర్
బి) పి.కె.తెలాంగ్
సి) అనిబిసెంట్ డి) బి.పి.వాడియా
19. ‘న్యూ ఇండియా’ డైలీ ఎప్పుడు ధరావతును కోల్పోయింది?
ఎ) 1914 బి) 1912 సి) 1915 డి) 1916
20. హోంరూల్ ఉద్యమానికి ప్రతిస్పందిస్తూ ఆగస్టు ప్రకటన చేసింది?
ఎ) చాంబర్లీన్ బి) మాంటేగ్
సి) హార్డింజ్ డి) పాల్ రిచర్డ్
21. ఏ సంవత్సరంలో అనిబిసెంట్ రాజకీయ రంగప్రవేశం చేస్తూ భారతదేశానికి హోంరూల్ ఇవ్వాలని కోరారు?
ఎ) 1911 బి) 1912 సి) 1913 డి) 1914
22. 1917లో ఏ ఐఎన్‌సి సమావేశానికి అనిబిసెంట్ నాయకత్వం వహించారు?
ఎ) కలకత్తా బి) బొంబాయి సి) మద్రాసు డి) గౌహతి
23. ఐఎన్‌సికి అధ్యక్షత వహించిన తొలి మహిళ?
ఎ) దుర్గాభాయి దేశ్‌ముఖ్ బి) విజయలక్ష్మి పండిట్
సి) నిర్మలాదేశ్ పాండే డి) అనిబిసెంట్



కె. చెంచుకుమార్
సీనియర్ ఫ్యాకల్టీ

పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ



బాలగంగాధర్ తిలక్



అనిబిసెంట్

24. ‘బాయ్ స్కౌట్ అసోసియేషన్’ అనే సంస్థను స్థాపించింది?
ఎ) మహాత్మాగాంధీ బి) అనిబిసెంట్
సి) మోతీలాల్ నెహ్రూ
డి) వినాయక దామోదర్ సావర్కర్
25. మద్రాసులోని అడయార్‌లో అనిబిసెంట్ స్థాపించిన జాతీయ విశ్వవిద్యాలయానికి చాన్సలర్‌గా వ్యవహరించింది?
ఎ) రవీంద్రనాథ్ ఠాగూర్ బి) శ్యాంజీ కృష్ణవర్మ
సి) విజయలక్ష్మి పండిట్ డి) బి.పి.వాడియా
26. 1916 మేలో చిత్తూరు జిల్లాలోని మదనపల్లిలో ‘థియోసాఫికల్ కళాశాల’ను స్థాపించింది?
ఎ) జె.ఎం.చటర్జీ బి) చాంబర్లీన్
సి) అనిబిసెంట్ డి) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య
27. అనిబిసెంట్ ముఖ్య శిష్యుడు?
ఎ) కొండా వెంకటప్పయ్య
బి) పర్వతనేని వీరయ్య చౌదరి
సి) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య డి) జిడ్డు కృష్ణమూర్తి
28. 'At the feet of master' గ్రంథ రచయిత?
ఎ) జిడ్డు కృష్ణమూర్తి బి) నీలకంఠ బ్రహ్మచారి
సి) అనిబిసెంట్ డి) విజయలక్ష్మి పండిట్
29. బ్రిటిష్ సారథ్యం కింద ఉంచుతూనే భారతీయులకు క్రమానుగతంగా స్వయం పరిపాలన ఇస్తామని ప్రకటన చేసిన భారత రాజ్య కార్యదర్శి?
ఎ) మింటో బి) మాంటేగ్ సి) మార్లే డి) హార్డింజ్
30. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌లో ముఖ్యపాత్ర పోషించింది?
ఎ) గణేష్ శ్రీకృష్ణ కార్పడే
బి) నరసింహ చింతామన్ కేల్కర్
సి) బాలకృష్ణ శివరాం మోహన్‌జీ డి) పైవారందరూ
31. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు అధ్యక్షుడిగా పని చేసింది?
ఎ) చాంబర్లీన్ బి) మార్లే
సి) జోసెఫ్ బాప్టిస్టా డి) పి.కె.తెలాంగ్
32. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు కార్యదర్శి?
ఎ) పాల్ రిచర్డ్ బి) కేల్కర్
సి) మీరా రిచర్డ్ డి) ఎస్.పి.సిన్హా
33. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ ఉద్యమం ఏయే ప్రాంతాలకు పరిమితం అయింది?
ఎ) ఉత్తరప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) కర్ణాటక డి) బి, సి
34. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరించింది?
ఎ) సర్ ఎస్.సుబ్రమణ్య అయ్యర్
బి) కేల్కర్ సి) జోసెఫ్ బాప్టిస్టా
డి) బాలగంగాధర్ తిలక్
35. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు ప్రధాన కార్యదర్శులుగా వ్యవహరించింది?
ఎ) జోసెఫ్ బాప్టిస్టా బి) సి.పి.రామస్వామి అయ్యర్
సి) పి.కె.తెలాంగ్ డి) బి, సి
36. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ ఉద్యమం ఏయే ప్రాంతాలకు విస్తరించింది?
ఎ) దక్షిణ భారతదేశం బి) బీహార్, బెంగాల్
సి) యునైటెడ్ ప్రావిన్స్, సింధు డి) పైవన్నీ
37. అనిబిసెంట్ కృషి ఫలితంగా ఏ ఐఎన్‌సి సమావేశంలో బాలగంగాధర్ తిలక్ కాంగ్రెస్‌లో చేరారు?
ఎ) కలకత్తా బి) బొంబాయి సి) లక్నో డి) పూనా
38. 1916లో జరిగిన లక్నో కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షత వహించింది?
ఎ) రాస్‌బిహారి ఘోష్
బి) అంబికా చరణ్ మజుందర్
సి) అరుండేల్ డి) వాడియా
39. భారతదేశానికి స్వపరిపాలన ఇవ్వాలని ఏ ఐఎన్‌సి సమావేశం తీర్మానించింది?
ఎ) లక్నో బి) భోపాల్ సి) అమృత్‌సర్ డి) లాహోర్
40. కాంగ్రెస్, ముస్లింలీగ్ మధ్య రాజ్యాంగ సంస్కరణల విషయమై కుదిరిన ఒడంబడిక ఎప్పుడు జరిగింది?
ఎ) 1915 బి) 1916 సి) 1917 డి) 1918
41. Common Schemeను రూపొందించడంలో ముఖ్యపాత్ర వహించింది?
ఎ) మహాత్మాగాంధీ బి) బాలగంగాధర్ తిలక్
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) మోతీలాల్ నెహ్రూ
42. 1916 డిసెంబర్‌లో ఏ ప్రాంతంలో సమావేశమై కాంగ్రెస్, ముస్లింలీగ్‌లు ఒక సామన్య ప్రణాళిక కోసం చెరొక కమిటీని నియమించాయి?
ఎ) మద్రాస్ బి) తిరువనంతపురం
సి) లక్నో డి) బెంగళూరు
43. హోంరూల్ ఉద్యమ కాలం?
ఎ) 1916-18 బి) 1920-22 సి) 1930-32 డి) 1940-42
44. భారతదేశ వైశ్రాయిగా 1916లో నియమితులైనది?
ఎ) మార్లే బి) లార్డ్ చెమ్స్‌ఫర్డ్
సి) మింటో డి) లార్డ్ కర్జన్
45. శాడ్లర్ కమిషన్‌ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
ఎ) 1914 బి) 1915 సి) 1916 డి) 1917
46. ‘వందేమాతరం’ అనే పత్రికను నడిపిన అతివాద నాయకుడు?
ఎ) మహాత్మాగాంధీ బి) అరవింద్ ఘోష్
సి) తిలక్ డి) లాలాలజపతి రాయ్
47. మితవాద రాజకీయాలను Policy of prayer, petition and protestగా అభివర్ణించింది?
ఎ) తిలక్ బి) లాలాలజపతిరాయ్
సి) అరవింద్ ఘోష్ డి) బిపిన్ చంద్రపాల్
48. ‘సావిత్రి’ అనే గ్రంథం రచించింది?
ఎ) మదన్ మోహన్ మాలవ్యా
బి) లాలాలజపతిరాయ్
సి) బాలగంగాధర్ తిలక్ డి) అరవింద్ ఘోష్
49. అరవింద్ ఘోష్ జన్మస్థలం?
ఎ) గౌహతి బి) కలకత్తా
సి) భువనేశ్వర్ డి) మద్రాసు

సమాధానాలు

1) బి	8) ఎ	15) డి	24) బి	33) డి	42) సి
2) ఎ	9) బి	16) ఎ	25) ఎ	34) ఎ	43) ఎ
3) సి	10) సి	17) బి	26) సి	35) డి	44) బి
4) బి	11) డి	18) సి	27) డి	36) డి	45) సి
5) ఎ	12) బి	19) డి	28) ఎ	37) సి	46) బి
6) డి	13) ఎ	20) బి	29) బి	38) బి	47) సి
7) సి	14) ఎ	21) సి	30) డి	39) ఎ	48) డి
		22) ఎ	31) సి	40) బి	49) బి
		23) డి	32) బి	41) డి	

JOBS ఉద్యోగాలు

నీతి ఆయోగ్

నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా ఆయోగ్ (నీతి ఆయోగ్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 173
పోస్టులు - ఖాళీలు: అడ్వైజర్/ సీనియర్ అడ్వైజర్ 7, జాయింట్ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, డిప్యూటీ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ 28, రీసెర్చ్ ఆఫీసర్(ఫ్లెక్సీ పూల్) 28, ఎకనామిక్ ఆఫీసర్ (ఫ్లెక్సీ పూల్)28, ఎకనామిక్ ఆఫీసర్ 44
అర్హత: పోస్టును అనుసరించి పీజీ/ ఎంబిబిఎస్
వయసు: 26 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 25, 2017
వెబ్‌సైట్: www.niti.gov.in

సఫ్దర్‌జంగ్ హాస్పిటల్

ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ హాస్పిటల్- జూనియర్ రెసిడెంట్ (నాన్ పీజీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 58
కాంట్రాక్ట్ వ్యవధి: ఏడాది
అర్హత: ఎంబిబిఎస్ డిగ్రీ ఉత్తీర్ణత + ఢిల్లీ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు పొంది ఉండాలి. అభ్యర్థులు 2015 జూలై 1 తరవాతనే ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి.
ఎంపిక: రాత పరీక్ష, కౌన్సెలింగ్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.500 (ఒబిసిలకు రూ.250 కాగా ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు మినహాయింపు వర్తిస్తుంది).
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును నిర్దేశిత చిరునామాకు పంపాలి
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 10, 2017
చిరునామా: The Medical Superintendent, Safdarjung Hospital & VMMC, New Delhi- 110029
వెబ్‌సైట్: www.vmmc.sjh.nic.in/

ఇండియన్ ఆర్మీ

ఇండియన్ ఆర్మీ కింది పోస్టుల భర్తీకోసం విడివిడిగా దరఖాస్తులు కోరుతోంది.
లా గ్రాడ్యుయేట్స్
ఖాళీలు: 14 (పురుషులకు 10, మహిళలకు 4 పోస్టులు కేటాయించారు)
అర్హత: 55 శాతం మార్కులతో లా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు మూడేళ్ల అనుభవం ఉండాలి. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా/ స్టేట్‌లో రిజిస్ట్రేషన్‌కు అర్హత పొంది ఉండాలి.
వయసు: 21 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 23, 2017
ఎన్‌సిసి స్పెషల్ ఎంట్రీ (43 కోర్స్)
ఖాళీలు: 54 (పురుషులకు 50, మహిళలకు 4 పోస్టులు కేటాయించారు)
అర్హత: ఎన్‌సిసి సర్టిఫికెట్‌తోపాటు 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. బ్యాటిల్ క్యాజువాలిటీస్/ ఆర్మీ పర్సనల్ పిల్లలకైతే ఎన్‌సిసి సర్టిఫికెట్ అవసరం లేదు.
వయసు: 19 నుంచి 25 ఏళ్లు
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 23, 2017
కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ **ఖాళీలు:** 142
ట్రేడ్స్ వారీ ఖాళీలు: మెటీరియల్ అసిస్టెంట్ 6, ఎల్‌డిసి 1, ఫార్మసిస్ట్ 1, టెలీ ఆపరేటర్ 1, ఫైర్‌మన్ 36, ట్రేడ్స్‌మన్(మేట్) 94, ఎంటిఎస్ 1, దోబి 1, టైలర్ 1
అర్హత: పోస్టును అనుసరించి బిఇ/ బిటెక్/ డిఫార్మసీ/ డిప్లొమా / ఇంటర్/ 10వ తరగతి
వయసు: పోస్టును అనుసరించి 18 నుంచి 27 ఏళ్లు
ఎంపిక: ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్, స్కిల్ టెస్ట్, రాత పరీక్ష ఆధారంగా.
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును స్పీడ్ / రిజిస్టర్డ్/ ఆర్డినరీ పోస్టుద్వారా నిర్దేశిత చిరునామాకు పంపాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 16, 2017
చిరునామా: Commandant 21 Field Ammunition Depot - 909721
వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in

విధులు సక్రమంగా నిర్వర్తించాలి

విడవలూరు: విధులను సక్రమంగా నిర్వర్తించాలని లేకుంటే చర్యలు తప్పవని ఎంపీడీవో విజయకుమార్ తెలిపారు.మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామి ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పనులను గుర్తించి జాబ్‌కార్డు దారులకు పనిదినాలను కల్పించాలన్నారు.పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

ఎమ్మార్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలి


కోవూరు: రుబెల్లా వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది


నార్తురాజుపాళెంలో విద్యార్థినికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది


ఇందుకూరుపేటలో..


పెనుబల్లిలో..

కోవూరు: 9 నెలల నుంచి 15 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలందరూ ఎమ్మార్ (తట్టు, రుబెల్లా) వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలని కోవూరు జడ్పీటీసీ సభ్యుడు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. లైబ్రరీ సెంటర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎమ్మార్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైద్య ఆరోగ్యశాఖపై దృష్టి సారించి కోట్లాది రూపాయలు ఆసుపత్రుల అభివృద్ధి కోసం విడుదల చేశారన్నారు. ఇనమడుగు ప్రాథమిక వైద్యాధికారిణి అనిత మాట్లాడుతూ మండలంలో 84 పాఠశాలలో 11,927 మంది విద్యార్థులకు వేయాలని నిర్ణయించి సెప్టెంబరు 8 వరకు ఈ వ్యాక్సిన్ వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉమ, ఆరోగ్య సిబ్బంది చంద్రకిరణ్, విల్సన్ తదితరులు ఉన్నారు.

బుచ్చిరెడ్డిపాళెంరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో చిన్నారులకు ఎమ్మార్ వ్యాక్సిన్‌ను వేశారు. మంగళవారం జొన్నవాడ, మినగల్లు, ఇస్కపాళెం సబ్ సెంటర్‌లలోని జొన్నవాడ, పెనుబల్లి, మినగల్లు, పంచేడు, ఇస్కపాళెం వడ్డిపాళెం గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు వైద్యసిబ్బంది ఎమ్మార్ వ్యాక్సిన్ వేశారు. ఈసందర్భంగా జొన్నవాడ ఆరోగ్యకేంద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్ ఉమామహేశ్వరరావు, ఎంపీపీ దొడ్ల విజయలక్ష్మి, పెనుబల్లి సర్పంచు కుండా స్వప్న పెనుబల్లి జడ్పీ హైస్కూలులో విద్యార్థులకు వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జొన్నవాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్‌కే ఖాదర్‌బాషా, వైద్యఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు. మంగళవారం 1223 మంది చిన్నారులకు ఈ వ్యాక్సిన్ వేసినట్లు వైద్యాధికారి తెలిపారు.

ఇందుకూరుపేట : మండలంలోని చిన్నారులకు తట్టు, రూబెల్లా వ్యాక్సిన్ వేశారు. జగదేవిపేట, మైపాడు పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆశ సిబ్బందితో దాదాపు 20 గ్రామాలలో ఈ వ్యాక్సిన్ కార్యక్రమాలను నిర్వహించారు. దాదాపు నెల రోజులపాటు వ్యాక్సిన్ ప్రతి గ్రామంలోనూ, ప్రతి పాఠశాలలోనూ అందుబాటులో ఉంటుందని తల్లిదండ్రులు కూడా అవగాహనతో బిడ్డలకు అందించేందుకు సహకరించాలని వారు కోరారు.

విడవలూరు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వైద్యసిబ్బంది మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేశారు. ఈ సందర్భంగా విడవలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యురాలు విజయలక్ష్మీ మాట్లాడుతూ తట్టు వ్యాధి ప్రాణాంతకరమైందన్నారు. పిల్లలకు ఈ వ్యాధి సోకకుండా ఉండేందుకు మండలంలో రెండురోజుల పాటు వ్యాక్సిన్‌ని వేస్తామన్నారు.

కొడవలూరు: మండలంలోని 9 నెలల నుంచి 15 ఏళ్ల పిల్లలకు ఎమ్మార్ వ్యాక్సిన్‌ను ఆగస్టు 1వ తేదీ నుంచి వేస్తున్నామని కొడవలూరు వైద్యాధికారి హరిశ్చంద్రసతీష్ తెలిపారు. మొదటి రోజు నార్తురాజుపాళెం ప్రాథమిక పాఠశాల చిన్నారులకు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం 842 మంది పిల్లలకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు.

కనిగిరి రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయాలి


మాట్లాడుతున్న సర్పంచు నారయ్య

కొడవలూరు: తాగునీటి అవసరాల నిమిత్తం సోమశిల జలాలను కనిగిరి రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయాలని కొత్తవంగల్లు గ్రామ సర్పంచు చెక్కా నారయ్య కోరారు. కొత్తవంగల్లు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం విలేఖర్ల సమావేశం జరిగింది. నియోజకవర్గంలోని పలు గ్రామాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. కొడవలూరు మండలం కొత్తవంగల్లు పంచాయతీ పరిధిలోని గ్రామాలలో భూగర్భ జలాలు అడుగంటిపోయి తాగునీటి ఎద్దడి నెలకొందని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. సోమశిల జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్సీ బీద రవిచంద్రకు,ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి దృషికి తీసుకెళ్లామన్నారు. త్వరితగతిన సోమశిల జలాశయం నుంచి నీటిని కనిగిరి రిజర్యాయర్‌కు తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు రమేష్,ఎస్‌వై దాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నిరసన

బుచ్చిరెడ్డిపాళెం:బుచ్చిరెడ్డిపాళెంలో ఎస్సీ,బీసీ ఇంటర్మీడియట్ విద్యార్థుల హాస్టళ్లు అద్దె భవనాల్లో నడుస్తుండడంపై మంగళవారం సమాజ న్యాయ ప్రచార సమితి స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అద్దె భవనాలలో నడుస్తున్న హాసళ్లలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని వారు పేర్కొన్నారు.సొంత భవనాలల్లో హాస్టళ్లు నడిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శ్రీలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు లెనిన్, పవన్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి


పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

కొడవలూరు: తాగునీటి సమస్యలను పరిష్కరించాలంటూ రాచర్లపాడు గ్రామానికి చెందిన మహిళలు మంగళవారం రేగడచెలిక పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ రాచర్లపాడు గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటిపోయి బోరు బావులు, కొళాయిల నుంచి నీరు రాక నెల రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. బిందె నీటిని రూ. 20 ఇచ్చి కొనుక్కుంటున్నామని వాపోయారు. తాగునీటి కోసం ఇన్ని ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. అనంతరం అక్కడ ఉన్న అధికారులు నాయకులు నిర్లక్ష్య సమాధానం చెప్పడంతో వారిపై మహిళలు వాగ్వాదానికి దిగారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు కలుగజేసుకొని తాగునీటి సమస్యను పరిష్కరిస్తామనడంతో మహిళలు వెనుదిరిగారు.

జేసీ ఆకస్మిక తనిఖీ

ఇందుకూరు పేట : స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా భూములకు చెందిన రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కాలంలో మండలంలోని పోరంబోకు, సీజేఎఫ్ఎస్ భూములకు పట్టాలు ఇచ్చారనే అంశంపై నోటీసులు జారీచేసి వివరణ కోరారు. ఆ రికార్డులు కూడా జేసీ పరిశీలించారు. ఈయన వెంట తహసీల్దార్ వెంకటనారయణమ్మ, సిబ్బంది ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న జేసీ ఇంతియాజ్ అహ్మద్

పచ్చిరొట్ట విత్తనాలతో భూసారాన్ని పెంచుకోండి

కొడవలూరు:పచ్చరొట్ట విత్తనాలను రాయితీ ద్వారా రైతులు ఉపయోగించుకొని భూసారాన్ని పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి సురేందర్‌రెడ్డి తెలిపారు.మండలంలోని కొత్తవంగల్లు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈవో కిరణ్, సర్పంచు చెక్కా నారయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని రైతులకు వ్యవసాయశాఖ అధ్వర్యంలో 75శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయశాఖ ఏఈవో అనూషా తెలిపారు. మంగళవారం మండలంలోని రేబాల, నాగమాంబాపురం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమం సందర్భంగా ఆశాఖ సిబ్బందితో ఆమె వరిపొలాలను పరిశీలించి వరిలో సుడిదోమ, పాముపొడ తెగుళ్లను గుర్తించారు. ఈ తెగుళ్ల నివారణకు వాడాల్సిన మందులను రైతులకు వివరించారు.

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

ఇందుకూరుపేట : ఇందుకూరుపేట మండలంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని దాదాపు 72 కేంద్రాలలో ఈ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించి మహిళలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు ఈ కార్యక్రమానికి ఆహ్వానించి అంగన్‌వాడీలలో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. అనంతరం స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ సునీలత మాట్లాడుతూ తల్లిపాలతోనే మంచి ఆరోగ్యకరమైన బాల్యాన్ని రూపొందించుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన పిల్లలతోనే మంచి సమాజం ఏర్పడుతుందని తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని వారు తెలిపారు. అదే విధంగా గంగపట్నం లోని పాఠశాల హెచ్‌ఎం జాలయ్య మహిళలతో సమావేశం నిర్వహించి తల్లిపాల వారోత్సవాలు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు, గర్భవతులు పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న హెచ్‌ఎం జాలయ్య

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు గడువు పెంచాలి

సీతారామపురం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర సబ్సిడీ రుణాల దరఖాస్తు గడువును ఉన్నతాధికారులు పెంచాలని ఉదయగిరి నియోజకవర్గ శాలివాహన కుమ్మర సంఘ ఇన్‌చార్జి ఆత్మూరి వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు.జూలై 31తో దరఖాస్తు గడువు ముగియడం, ఇంటర్నెట్ సరిగా పనిచేయకపోవడంతో చాలా మంది అర్హులు ర దరఖాస్తు చేసుకోలేకపోయారన్నారు. మండలంలో ఐదుగురు వీఆర్వోలు సస్పెండ్ కావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకొని దరఖాస్తు గడువు పెంచాలని కోరారు

వాడవాడలా తట్టు, రూబెల్లా వ్యాక్సినేషన్

ఉదయగిరి రూరల్: మండలంలో మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 9 నెలల నుంచి 15 ఏళ్లలోపు పిల్లలకు మీజిల్స్, రూబెల్లా వ్యాధులకు వైద్యఆరోగ్య సిబ్బంది టీకాలు వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మంజులమ్మ మాట్లాడుతూ మండలంలో 8,157 మంది చిన్నారులను గుర్తించగా, తొలిరోజు 1,214 మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేయాల్సి ఉందన్నారు. ఏడు బృందాల ద్వారా 1,171 మందికి వ్యాక్సిన్ వేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది వెంకటసుబ్బయ్య, రియాజ్, అక్బర్‌బాషా, వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో డాక్టర్ మాసిలామణి చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమం 1-17వ తేదీ వరకు దశలవారీగా జరుగుతుందన్నారు. మండలంలో 9,299 మంది లక్ష్యంగా ఈ వ్యాక్సిన్ వేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జిగా డాక్టర్ కె.రాజేంద్ర రెడ్డి వ్యవహరించారు. సర్పంచు బాలకృష్ణారెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది బీబీజాన్, ఇందిర, గురవయ్య, చిన్నయ్య, నరసయ్య, షఫీ, ఉపాధ్యాయులు పిచ్చయ్య, హజరత్‌రెడ్డి, వీరరాఘవులు, శివకోటారెడ్డి, శేషగిరిరావు తదితరులున్నారు.

సీతారామపురం: స్థానిక జడ్పీ హైస్కూల్, కస్తూరిబా గాంధీ, ఆదర్శ పాఠశాల, గౌతమి హైస్కూల్‌లోని 876 మంది విద్యార్థులకు మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు.ప్రత్యేకాధికారి డాక్టర్ వీరేష్ పర్యవేక్షించారు. హెచ్‌వీ కృష్ణమ్మ, హెల్త్ అసిస్టెంట్లు శేఖర్‌రాజు, తిరుపాలురెడ్డి, ఏఎన్ఎం కుసుమ, అంగన్‌వాడీ కార్యకర్త చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఉదయగిరిలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్యాధికారిణి


వింజమూరులో టీకా వేస్తున్న డాక్టర్ మాశిలామణి

దుత్తలూరు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జడ్పీటీసీ సభ్యుడు చీదర్ల మల్లికార్జున్ ఎంఆర్ వ్యాక్సినేషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే టీకాతో తట్టు, రూబెల్లా వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలకు వ్యాక్సిన్ వేయించాలన్నారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పాముల సుబ్బరాయుడు, టీడీపీ మండల కన్వీనర్ గురవారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వెంగళరెడ్డి, వైద్యాధికారి శ్రావణి, ఎంఈవో అలాబక్ష్, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలో తొలిరోజు 356 మందికి ఎంఆర్ టీకాలు వేయాల్సి ఉండగా, 302 మందికి వ్యాక్సిన్ వేసినట్లు సిబ్బంది తెలిపారు. టీకాల కార్యక్రమాన్ని డాక్టర్ కల్యాణ్ పర్యవేక్షించారు. ఆరోగ్య పర్యవేక్షకులు రియాజ్, నూర్‌బాష, సిబ్బంది తదితరులున్నారు.

విద్యార్థికి అస్వస్థత

వరికుంటపాడు స్థానిక ఉన్నత పాఠశాలలోని ఓ విద్యార్థికి తట్టు, రూబెల్లా వ్యాక్సిన్ వేయగానే కళ్లు తిరిగి పడిపోయాడు. ఒళ్లంతా దురదతో ఇబ్బంది పడ్డాడు. వెంటనే డాక్టర్ అక్కడికి చేరుకొని ఇంజక్షన్ వేసి వైద్యసేవలందించడంతో విద్యార్థి కోలుకున్నాడు

● ఇంటర్వ్యూ



రికార్డుల పరిశీలన వేగవంతం

మస్తానయ్య, తహసీల్దారు

?. రెవెన్యూ రికార్డుల ప్యూరిఫికేషన్ ఎంతవరకు వచ్చింది.

!. 90 శాతం మేర పూర్తయ్యాయి. ప్రొఫార్మాలు తయారుచేసి ఆన్‌లైన్ చేయాల్సి ఉంది.

?. రికార్డుల భద్రతకు తీసుకుంటున్న చర్యలు

!. రికార్డులన్నీ పరిశీలించి ఎలాంటి అవకతవకలు జరగకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

?. సిబ్బందికి ఎలాంటి సూచనలిస్తున్నారు.

!. ప్రజల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి. వాస్తవాలను గ్రహించాలి. ఎలాంటి సందేహం వచ్చినా మా దృష్టికి తీసుకురావాలి. సొంత నిర్ణయాలు తీసుకోవద్దని సూచిస్తున్నాం.

\- వింజమూరు

పోలేరమ్మకు పొంగళ్లు


ఆలయ ప్రదక్షిణ చేస్తున్న ఎడ్ల బండి

వింజమూరు: ఎర్రబల్లిపాళెం గ్రామదేవత పోలేరమ్మ ఆలయ వేడుకల్లో భాగంగా మంగళవారం ఉదమం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రంగురంగులతో అలంకరించిన ఎడ్లబండ్లను అమ్మవారి దర్శనార్థం తీసుకొచ్చారు. మహిళలు ఆలయానికి చేరుకుని నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె బాట

ఉదయగిరి రూరల్: స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీ వర్కర్స్ జిల్లా గౌరవాధ్యక్షుడు కె.పెంచలనరసయ్య, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జే.లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎనిమిది నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఇచ్చే అరకొర వేతనాలు నెలల తరబడి నిలిచిపోవడంతో కుటుంబ పోషణ సైతం కష్టతరమైందన్నారు. పారిశుధ్య పనులను కాంట్రాక్టర్లకు అప్పగించరాదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు వెంటనే విడుదల చేయాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు నాగేశ్వరరావు, బాషా, తిమ్మయ్య, రమణయ్య, దిలావర్, నరసింహులు, గురవయ్య, శ్రీకాంత్, చిన్నయ్య, వెంకటరమణయ్య తదితరులున్నారు.


సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు

సబ్సిడీపై పంపిణీకి

విత్తనాలు సిద్ధం


రైతులకు సూచనలిస్తున్న ఏవో సుబ్రహ్మణ్యం

వింజమూరు: నల్లగొండ్ల, గుండెమడగల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురిస్తే విత్తుకోవడానికి కంది, మినుములు సబ్సిడీపై అందచేస్తామన్నారు. ఇప్పటివరకు పిల్లిపెసరలు, పెసలు, జీలుగలు, కందులు సబ్సిడీపై అందచేశామన్నారు. మండలంలో భూసార పరీక్షలు చేయించిన రైతులకు భూసార కార్డుల ఆధారంగా ఉదజని సూచిక 8 దాటిన వారికి జింక్, జిప్సం నూరు శాతం రాయితీతో అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మునెమ్మ, ఎంపీఈవోలు పెంచలరావు, శివశంకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ చేయకపోతే మాదిగల సత్తా చూపుతాం


దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వింజమూరు: ఎస్సీ వర్గీకరణకు అధికార, ప్రతిపక్షాలు సహకరించకపోతే మాదిగల సత్తా ఏంటో చూపుతామని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు పందిటి అంబేద్కర్ తెలిపారు. వర్గీకరణ సాధనకోసం చేస్తున్న దీక్ష మంగళవారం 13వ రోజుకు చేరిన సందర్భంగా మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో మాట తప్పిన చంద్రబాబుకు బుద్ధి చెప్పే రోజు దగ్గర పడిందన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్ అభ్యర్థి రంగంలో ఉంటారన్నారు. ఆ ఎన్నికల్లో మాదిగల సత్తా ఏంటో చూపుతామన్నారు. మురళి, చినమాలకొండయ్య, నాగేష్, బాబు, వీరరాఘవులు, నరసింహులు, మస్తాన్, నాగరాజు పాల్గొన్నారు.

ముగిసిన గంగమ్మ ఆలయ ఉత్సవాలు

వరికుంటపాడు: వరికుంటపాడులో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గంగమ్మ ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు బండ్లపొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. భక్తులు వాహనాలను ప్రత్యేకంగా అలంకరించి, ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

దుత్తలూరు: తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని అంగన్‌వాడీ కార్యకర్త బోగ్యం సరస్వతి తెలిపారు. మంగళవారం నందిపాడు, ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన అరగంటలోపు బిడ్డకు ముర్రుపాలు తాగిస్తే వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. డబ్బాపాలతో బిడ్డకు వ్యాధులు సక్రమిస్తాయన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు తగు సూచనలు అందచేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రామయ్య, దేవసహాయం, ఆయా సుజాత తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

వరికుంటపాడు: నారసింహాపురం గ్రామానికి చెందిన పాములపాటి లక్ష్మి మోకాళ్లకు శస్త్రచికిత్స చేయించుకోవడంతో సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.1,08,600ల చెక్కును, ఎంపీపీ సుంకర వెంకటాద్రి మంగళవారం ఆమె భర్త శ్రీరాములుకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ కుటుంబంలో ఆపద వచ్చినా ముఖ్యమంత్రి సహాయ నిధి కింద సాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రవెంకయ్య, శ్రీకాంత్‌యాదవ్, షేక్ మాలకొండ్రాయుడు, తోడిందుల వెంకటేశ్వర్లుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మేకల చోరీ

ఉదయగిరి రూరల్: మేతకు వెళ్లిన 16 మేకలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. తిరుమలాపురం గ్రామానికి చెందిన బాధితులు సున్నపు సుధాకర్ రెడ్డి, సున్నపు చంద్రయ్య, తిపిరిబోయిన నాగయ్యలకు చెందిన మేకలు నాలుగు రోజుల క్రితం గ్రామ సమీపంలో మేస్తుండగా అపహరణకు గురయ్యాయి. చుట్టుపక్కల విచారించినా ఫలితం లేకపోవడంతో ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వీటి విలువ రూ. 1.20 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 2, 5



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారులు, ప్రియతముల విషయాల్లో ప్రోత్సాహకరం. ఉన్నత విద్యా విషయాలు, సమావేశాలు, చర్చల్లో సత్ఫలితాలు సాధిస్తారు. ప్రయాణాలు, వ్యూహరచనలకు అనుకూలం.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగవుతుంది. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం లభిస్తుంది. ఇంటి అవసరాలకు సకాలంలో డబ్బు చేతికి అందుతుంది. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.



మిథునరాశి:(మే21-జూన్21): శ్రీవారు, శ్రీమతి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. బంధుమిత్రులతో సమావేశాలు ఫలిస్తాయి. ప్రియతముల నుంచి కీలక సమాచారం అందుకుంటారు. సమావేశాల్లో, బృందకార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు.



కర్కాటకరాశి:(జూన్22-జూలై23): విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆర్థిక విషయాల్లో సహోద్యోగులు సహకరిస్తారు. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. క్యాటరింగ్, రిటైల్ రంగం, హోటల్, వైద్య రంగాల వారికి ప్రోత్సాహకరం.



సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): పెట్టుబడులు, పొదుపు పథకాలు లాభిస్తాయి. విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. సృజనాత్మక రంగాల వారికి ప్రోత్సాహకరం. చిన్నారుల విషయంలో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీసోదరుల విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. అగ్రిమెంట్లపై ఒక నిర్ణయానికి వస్తారు. విలువైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులకు శుభప్రదం.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి శుభప్రదం. బదిలీలు, మార్పులకు సంబంధించి ముఖ్య సమాచారం అందుకుంటారు. సంస్మరణలు, ఆధ్మాత్మిక కార్యక్రమాలు సాంత్వన కలిగిస్తాయి.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో అదనపు ఆదాయం అందుకుంటారు. పెట్టుబడులు, పొదుపు పథకాల విషయంలో పెద్దల నుంచి మంచి సలహాలు లభిస్తాయి.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): అంచనాలు ఫలించడంతో మనసు ఉల్లాసంగా ఉంటుంది. కొత్త పనులు ప్రారంభిస్తాయి. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల కోసం నిధుల సేకరణకు ప్రయత్నిస్తారు. ప్రయాణాలు, సమావేశాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు. సమావేశాలు, వేడుకల్లో పాల్గొంటారు. పెట్టుబడులు ప్రోత్సాహకరం. బృందకార్యక్రమాల్లో పాల్గొంటారు. భాగస్వామి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది.



మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): వృత్తిపరమైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి. ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు. సంకల్పం నెరవేరుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

సీఏ - ఐపీసీసీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

నెల్లూరు (క్యాంపస్): ఐసీఏఐ మంగళవారం విడుదల చేసిన సీఏ- ఐపీసీసీ ఫలితాల్లో పలు విద్యా సంస్థల విద్యార్థులు ప్రతిభ చూపి మంచి మార్కులు సాధించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు విద్యా సంస్థల యాజమాన్యాలు అభినందనలు తెలిపారు.

ఉత్తమ మార్కులు సాధించిన దీక్ష విద్యార్థులు

ఈ ఫలితాల్లో దీక్ష అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా అకాడమీ ప్రాంగణంలో విద్యార్థులకు అభినందనలు తెలిపారు. దీక్ష అకాడమీ డైరెక్టర్లు ఎం.కృష్ణచైతన్య, ఎం.ఎం.రెడ్డి మాట్లాడుతూ ఈ ఫలితాల్లో సాయితేజ 420, రామకృష్ణ 405, పవన్ 396, చక్రవర్తి 342 మార్కులు సాధించారన్నారు. సీఏ ఐపీసీసీ అన్ని సబ్జెక్టులకు గాను 21 మంది ఆర్టికల్‌షిప్ అర్హత సాధించారన్నారు. విద్యార్థులు ఈ ఫలితాలు సాధించడం ఆనందంగా ఉందని, ఐపీసీసీ క్లాస్‌లు ఈనెల 4వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని వారు వివరించారు.

జెనెక్స్ విద్యార్థుల ప్రతిభ

ఈ ఫలితాల్లో జెనెక్స్ విజన్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చూపి మంచి మార్కులు సాధించారని అకాడమీ డైరెక్టర్లు ఎన్.వెంగల్‌రెడ్డి, పీ కొండలరావు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను హరనాథపురంలో ఉన్న అకాడమీ కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఫలితాల్లో కే సుమలత 259, ఏ.సాయివిఖిత 232, ఐశ్వర్య 228, వీఎల్. కళ్యాణి 225 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులు ఇలా మార్కులు సాధించడానికి అకాడమీ అందిస్తున్న ప్రత్యేక కోచింగ్ కారణమన్నారు. జెనెక్స్ విజన్‌లో మాత్రమే సీఏతో పాటు సీఎం ఏలో శిక్షణ అందిస్తున్నామని వారు ఈ సందర్భంగా వివరించారు.



విద్యార్థులను అభినందిస్తున్న దీక్ష, జెనెక్స్ సంస్థల డైరెక్టర్లు

నేడు చెస్ సబ్‌జూనియర్స్ ఎంపికలు

నెల్లూరు (క్యాంపస్): అండర్ - 15 బాలుర, బాలికల విభాగంలో సబ్ జూనియర్స్ జిల్లా జట్ల ఎంపికలు బుధవారం నగరంలోని శాంతినగర్‌లో ఉన్న సాయి చెస్ అకాడమీలో జరుగుతాయని జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి వై.సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికల్లో మొదటి నాలుగు స్థానాలు సాధించిన క్రీడాకారులు ఆగస్టు 4వ తేదీ నుంచి విజయనగరం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. 2002 జనవరి 1 తర్వాత జన్మించిన వారు ఎంపికలకు అర్హులని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఒరిజినల్ వయసు ధ్రువీకరణ పత్రంతో, చెస్ కిట్స్‌తో బుధవారం ఉదయం 10గంటలకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

డీవైఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి : ఎమ్మెల్సీ యండపల్లి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (వేదాయపాళెం): డీవైఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ 24, 25వ తేదీలలో నిర్వహించనున్నామని, ఈ సభలను జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి కోరారు. మంగళవారం నెల్లూరు బాలాజీనగర్‌లోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. రాష్ట్రంలో యువజనుల సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో ఎం సూర్యారావు, ఎం బాలసుబ్రమణ్యం, పీ కిరణ్, యూ ప్రసాద్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

రేపు ఫ్యాప్టో ధర్నా

నెల్లూరు (క్యాంపస్): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీ, కార్పొరేషన్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని ఫ్యాప్టో నాయకుడు ఎంసీ అచ్చయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

9న ప్రపంచ ఆదివాసి గిరిజనుల దినోత్సవం

వెంకటగిరి: ఈ నెల 9వ తేదీ ప్రపంచ ఆదివాసి గిరిజనుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు గిరిజన ఐక్యవేదిక నాయకులు మోపూరు అడివయ్య, శివయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ కూడలి నుంచి పురవీధుల్లో ప్రదర్శన, తహసీల్దారు కార్యాలయం వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సమస్యలున్నా, ఉత్తమ సేవలకు కృషి

- జిల్లాలో కొత్తగా 21 హాట్‌స్పాట్‌లు
- ఉదయం 8నుంచి రాత్రి 8వరకు బిల్లుల చెల్లింపు కౌంటర్
- సూళ్లూరుపేట, కావలిలో ఫైబర్‌నెట్
- బీఎస్ఎన్ఎల్ పీజీఎం మేరువ రవిబాబు



మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ పీజీఎం రవిబాబు

నెల్లూరు (వేదాయపాళెం): నెల్లూరులో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ల కోసం జరుగుతున్న తవ్వకాలతో టెలిఫోన్ కేబుళ్లు ధ్వంసమై, సేవలకు కొంత అంతరాయం ఏర్పడిందని బీఎస్ఎన్ఎల్ పీజీఎం మేరువ రవిబాబు పేర్కొన్నారు.అయినా సిబ్బంది సహకారంతో వెంటనే మరమ్మత్తులు చేపట్టి వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన వివరించారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. తవ్వకాలతో వస్తున్న సమస్యలపై ఇప్పటికే కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులతో చర్చించామన్నారు. నెల్లూరులోని ఎంజీబీ మాల్, రైల్వే స్టేషన్, ఆర్టీసీ తదితర ప్రాంతాలతో పాటు జిల్లాలో 21 చోట్ల హాట్‌స్పాట్‌లు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. సూళ్లూరుపేట, కావలిలలో ఫైబర్‌నెట్ సేవలను అందిస్తున్నామని, త్వరలోనే జిల్లా వ్యాప్తంగా ఈ సేవలు అందిచనున్నట్లు ఆయన వివరించారు. ఉద్యోగులు బిల్లులు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కార్యాలయంలో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు బిల్లులు చెల్లించే ఏర్పాట్లు చేశామన్నారు. ఎంసెట్, నీట్ విద్యార్థులకు రూ. 49తో ప్లాన్ తీసుకొచ్చామని తెలిపారు. అలాగే రూ.444 ఆఫర్‌ను ప్రకటించామని, దీంతో 90 రోజుల పాటు ప్రతి రోజు 4బీజీ డేటా వాడుకోవచ్చన్నారు. రూ. 333తో 56 రోజుల పాటు ప్రతి రోజు 3జీబీ డేటాను వాడుకోవచ్చన్నారు. రూ.349తో 26 రోజులపాటు అన్‌లిమిటెడ్ కాల్స్‌తో పాటు ప్రతి రోజు 2 జీబీ డేటాను వాడుకోవచ్చన్నారు. సాంకేతిక ఫీజిబిలిటీ ఉన్న ప్రాంతాలలో రూ.249 నెలసరి అద్దెతో ల్యాండ్ ఫోన్ సౌకర్యంతోపాటు, బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం వాడుకోవచ్చన్నారు. కొత్త ల్యాండ్‌లైన్, బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్లకు ఇన్‌స్టలేషన్ చార్జీలు ఉచితమని వివరించారు. బ్రాడ్‌బ్యాండ్ మోడెంకు 100శాతం క్యాష్ బ్యాక్ ఆఫర్ ఉందన్నారు. జిల్లాలోని 5 ఎక్స్ఛేంజ్‌లను న్యూజనరేషన్ నెట్‌వర్క్‌కు మార్చుతున్నామన్నారు. త్వరలో దీవి నియోగదారుల కోసం మరిన్ని పథకాలు తీసుకుని రానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎంలు, ఏజీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

22 క్యారెట్స్ బంగారం

గ్రాము ధర	-	2,742
సవర (8 గ్రాములు)	-	21,936
వెండి కిలో ధర	-	41,400
వెండి గ్రాము ధర	-	41.40

చికెన్ ధరలు



వెన్‌కాబ్..

బాయిలర్ రైతు ధర	79
లేయర్	75
స్కిన్ చికెన్	130
స్కిన్‌లెస్ చికెన్	153
లేయర్ మాంసం	125

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్..

బాయిలర్ లైవ్	87
లేయర్ లైవ్	72
స్కిన్ చికెన్	146
స్కిన్‌లెస్	170
లేయర్	128

నిమ్మ ధరలు (బస్తా) గూడూరు

పచ్చివి: రూ.1,200 నుంచి రూ. 2,200 వరకు

పండ్లు: రూ.800 నుంచి రూ.1,200 వరకు

జలాశయాల్లో నీటిమట్టాలు

సోమశిల

పూర్తి సామర్థ్యం:	78 టీఎంసీలు
ప్రస్తుత నీటినిల్వ:	7.174 టీఎంసీలు
ఇన్‌ఫ్లో :	------------
అవుట్‌ఫ్లో :	200 క్యూసెక్కులు
ఆవిరి :	64 క్యూసెక్కులు

సంగం ఆనకట్ట

నీటిమట్టం :	-------------
కనిగిరికాలువ :	-------------
ఎడమ కాలువ :	-------------
కనుపూరు కాలువ:	-------------
బీపీఆర్ కాలువ :	-------------
నెల్లూరుచెరువుకాలువ :	-----------

సూక్తి

లక్ష్య సాధనలో ఎన్నిసార్లు ఓడినా సరే.. మరోసారి ప్రయత్నించు.



వావ్.. చార్లెస్ వంతెన

స్విట్జర్లాండ్‌లోని ఆల్ప్స్ పర్వతాల్లో పచ్చదనం పరుచుకున్న అందాలతో, ప్రకృతి శోభతో అలరారే రెండు కొండ ప్రాంత గ్రామాలే.. జెర్మట్, గ్రెచెన్. వాటి మధ్యలో లోతైన గ్రాబెంగూఫర్ లోయ. గ్రెచెన్ నుంచి జెర్మట్‌కు చేరుకోవాలంటే ఆ లోయతో పాటు, చిన్న చిన్న కొండలూ ఎక్కి దిగాల్సిందే. మొత్తంగా మూడు గంటల సమయం పడుతుంది. అక్కడి ప్రజలకు ఇప్పుడు ఆ సమస్య తీరిపోయింది. కేవలం పది నిముషాల్లోనే ఇరు గ్రామాలకు చకచకా వెళ్లిపోవచ్చు. ఎలానో తెలుసా? ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెన అక్కడ ప్రారంభించారు.



ఆల్ప్‌పర్వతాల్లోని రెండు కొండల మధ్య ఓ పొడవాటి వంతెన నిర్మించారు. దాని పేరు "చార్లెస్ కువోనెన్'. గాలికి ఊగుతూ, తూగుతూ ఉండే ఆ వంతెనను చూస్తుంటే.. కొందరికి కొండల మధ్య వెండి ఊయల్లా తోస్తుంది. ఇంకొందరికి నడిచే రోలర్ కోస్టర్‌లా కనిపిస్తుంది. ఇది సస్పెన్షన్ మోడల్ బ్రిడ్జి. వంతెనపై నడుస్తుంటే కాస్త ఊగుతూ ఉంటుంది.

జూలై 29న ప్రారంభమైన ఈ వంతేన ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనగా రికార్డుల్లోకి ఎక్కింది. దీని పొడవు 494 మీటర్లు.

ఈ వంతెన భూ ఉపరితలానికి 85 మీటర్ల ఎత్తులో ఉంది.


ఇప్పటివరకు జర్మనీలోని 'టైటాన్-ఆర్‌టీ' వంతెనను అతి పొడవైనదిగా పేర్కొనేవారు.

ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనల్లో రష్యాలోని 'స్కైపార్క్ బ్రిడ్జ్' మూడో స్థానంలో ఉంది. 2016 సోచి ఒలింపిక్స్ సందర్భంగా దీన్ని నిర్మించారు.


ఎత్తయిన ప్రదేశాలను చూసి భయపడేవారు, 'చార్లెస్ కువోనెన్' వంతెన దాటాలంటే కళ్లు మూసుకోవాల్సిందేనని జెర్మట్ ట్రావెల్ బోర్డు ప్రతినిధి అంటున్నారు.

రోడ్డు మార్గంలో వంతెన కట్టాలంటేనే ఓ నెల రోజుల సమయం పడుతుంది. కానీ రెండు కొండల మధ్యలో నిర్మించిన ఈ బ్రిడ్జిని కేవలం 10 వారాల్లోనే పూర్తి చేయడం విశేషం.

రంగులు వేయండి



బొమ్మ గీయండి



టంగ్ ట్విస్టర్స్

1. I would if I could, and if I could-n't, how could I?You couldn't, unless you could, could you?
2. The crow flew over the river with a lump of raw liver.
3. National Sheepshire Sheep Association




ఒకే అక్షరం

1. TOTAL	మొ	
2. BUD	మొ	
3. PLANT	మొ	

నవ్వుల్ నవ్వుల్

రాహుల్ : కుట్టేముందు దోమలు ఎందుకు శబ్దం చేస్తాయి?
రోహిత్ : దాడి చేయబోతున్నాను అని వర్తమానం ఇవ్వడం యుద్ధనీతిలో భాగం.

చుక్కలు కలపండి



దారి కనుక్కోండి




ఔనా!



వందలో డెబ్బై శాతం మంది 'హైపనిక్ జెర్క్' ఎదుర్కొన్నవారే. ఇదేదో కొత్త వ్యాధి అని అనుకుంటున్నారా? అదేం కాదు. మాంచి నిద్రలో ఉన్నప్పుడు ఎక్కడ నుంచో కింద పడుతున్నట్లు అనిపించి చటుక్కున మెలకువ వస్తుంది. అదే 'హైపనిక్ జెర్క్'.

మీకుతెలుసా?

మీకు చెట్లతో కూడిన అరణ్యాలే తెలుసు.. మరి శిలలతో ఉన్న అడవి తెలుసా? చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లో ఉన్న పొడవైన శిలల సముదాయాన్నే 'స్టోన్ ఫారెస్ట్' అని పిలుస్తారు.



చెప్పగలరా?

జాలిలో ఉన్నా కానీ గాలిలో లేను
బిరుదులో ఉన్నా కానీ అరుదులో లేను
లిపిలో ఉన్నా కానీ తాపిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. ఐత్యంకమ ▸ ....
2. సందనపా ▸ ....
3. పిగూడుట్ట ▸ ....

- పత్తిపాక అంకిత, కోరుట్ల

జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. IRAN ▸ ....
2. IDWE ▸ ....
3. DMBU ▸ ....

- గుర్రాల సాయిసుధ, మెట్‌పల్లి

జవాబులు

1.RAIN 2.WIDE 3.DUMB
జంబ్లింగ్ వర్డ్స్ :
జంతర్‌మంతర్ : 1. ఐకమత్యం 2. సంపాదన 3. పిట్టగూడు
చెప్పగలరా? : జాబిలి
ఒకే అక్షరం : 1. మొత్తం 2. మొగ్గ 3. మొక్క

ఎంఆర్ వ్యాక్సిన్
ప్రతి చిన్నారి వేయించుకోవాలి

● విద్యార్థులంతా కష్టపడి చదవాలి.. ● కలెక్టర్ ముత్యాలరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ ముత్యాలరాజు

నెల్లూరు (వైద్యం) : మీజిల్స్, రుబెల్లా వ్యాధులను తరిమికొట్టేలా ప్రభుత్వం అమలు చేస్తున్న ఎంఆర్ వ్యాక్సిన్‌ను ప్రతి చిన్నారి వేయించుకోవాలని కలెక్టర్ ముత్యాలరాజు కోరారు. నెల్లూరులోని కేవెన్ఆర్ కార్పొరేషన్ హైస్కూల్‌లో మంగళవారం మీజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్‌ను ఆయన ప్రారంభించారు. పిల్లలకు ఇంజక్షన్ రూపంలో వేస్తున్న ఈ టీకాను పరిశీలించారు. ఈ వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ తమవంతు చేయూతనివ్వాలంటూ లయన్స్ క్లబ్ సంతకాల బ్యానర్‌పై కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9నెలల నుంచి 15 ఏళ్లలోపు చిన్నారులంతా తప్పనిసరిగా ఈ టీకాను వేయించుకోవాలని తెలిపారు. ఈ టీకా ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు.



టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

● కష్టపడి చదవాలి..

ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులంతా కష్టపడి చదవాలని కోరారు. తాను కూడా ప్రభుత్వ స్కూళ్లలో చదువుకుని ఈ స్థాయికి చేరానని వివరించారు. అలాగే విద్యార్థులు కూడా ఉన్నత స్థాయికి చేరాలని పిలుపునిచ్చారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వరసుందరం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మీజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్‌ను విజయవంతంగా చేపడుతున్నామన్నారు. దీనిపై ఎలాంటి అపోహలు లేకుండా ప్రతి ఒక్కరూ టీకాను వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ జేడీ డాక్టర్ శాలినీదేవి, జేసీ-2 వెంకటసుబ్బారెడ్డి, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రమాదేవి, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

తొలి వేటు పోలీస్ పైనే!

● వీఆర్‌కు ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు సీఐలు
● నేడో, రేపో నిందితుల అరెస్టులు

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : క్రికెట్ బెట్టింగ్ కేసులో ఎస్పీ రామకృష్ణ తొలివేటు సొంత శాఖలోనే వేశారు. గూడూరు, నెల్లూరు డీఎస్పీలు శ్రీనివాస్, వెంకటరాముడులను వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు వెలువడ్డాయి. అలాగే నెల్లూరులో ఇద్దరు సీఐలు కూడా వీఆర్‌కు వెళ్లనున్నట్లు సమాచారం. నెల్లూరు నగరంలో గత నెల 2న పేకాట స్థావరంపై జరిగిన దాడితో మొదలైన క్రికెట్ బుకీలు, బెట్టింగ్ రాయుళ్ల, పంటర్ల అరెస్టుల పరంపర కొనసాగుతూనే ఉంది. అంతర్జాతీయ క్రికెట్ బుకీ బాస్ కృష్ణసింగ్, జాతీయ క్రికెట్ బుకీలు పొదలకూరుకు చెందిన మన్నం శ్యాం ప్రసాద్, బుచ్చికి చెందిన అరుణ్‌కుమార్, నెల్లూరుకు చెందిన షంషేర్, నాగార్జునరెడ్డి, సూళ్లూరుపేటకు చెందిన అల్లూరు అనిల్‌రెడ్డి తదితరులు ఉన్నారు. వీరు అందించిన సమాచారం మేరకు బెట్టింగ్ రాయుళ్లు, బుకీలు 50 మందికిపైగా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వీరంతా ఎమ్మెల్యేలు, ముఖ్య నేతల అనుచరులుగా ఉండడంతో పూర్తి సాక్షాధారాలు సేకరించే పనిలో ఎస్పీ నిమగ్నమయ్యారు. స్వయంగా పర్యవేక్షిస్తూ వివరాలు రాబట్టడమే కాకుండా ప్రత్యేక బృందాలను వేసి వీరి కోసం గాలింపు సాగిస్తున్నారు. 15 రోజులుగా ముఖ్య నేతలుగా చెలామణి అవుతున్న వారిని కూడా అదుపులోకి తీసుకోవడం చర్చనీయాంశమైంది. ఎవరిని అదుపులోకి తీసుకుంటారోనన్న అభద్రతతో నిద్రలేని రాత్రులలో నేతలు గడిపారు. తమ అనుచరులే కీలకంగా ఈ వ్యవహారాల్లో ఉండడంతో నేతలు కూడా ఎలాంటి ఒత్తిళ్లు తేకుండా ఎస్పీకి పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. పూర్తి సాక్ష్యాలు సేకరించిన ఎస్పీ రహస్య నివేదికలు ప్రభుత్వానికి పంపి ఎవరెవరు సూత్ర, పాత్రధారులు ఉన్నారో వారి పేర్లను తెలిపారు. మొదట సొంత ఇంటిని చక్కపెట్టే పరిస్థితులో ఎస్పీ ఉన్నట్లు సమాచారం. అందుకనే బుకీలు, బెట్టింగ్ రాయుళ్లు, పంటర్ల అరెస్టుకు ముందే పోలీసులపై వేటు వేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇక అరెస్టుల పరంగా బుధవారం లేదా గురువారం ఖచ్చితంగా చూపుతామని పోలీసు వర్గాలు వెల్లడిస్తున్నాయి. 15 రోజులపాటు సాగిన ఈ వ్యవహారంలో మెల్లమెల్లగా ఉత్కంఠ వీడుతోంది. ఎవరెవరిని అరెస్టు చూపుతారోనన్న చర్చ కొనసాగుతోంది.

● ఇద్దరు డీఎస్పీలపై వేటు

నెల్లూరు నగర డీఎస్పీగా 2015లో బాధ్యతలు చేపట్టిన జీ వెంకటరాముడుపై మొదటి నుంచి ఆరోపణలు వెల్లువెత్తాయి. గతంలో పని చేసిన పోలీసు బాస్‌కు అత్యంత సన్నిహితంగా ఉంటూ బెట్టింగ్ రాయుళ్లు, బుకీల నుంచి పెద్ద ఎత్తున ముడుపులు స్వీకరించి ఆ బాస్‌కు సమర్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరిపై ఎస్పీ రామకృష్ణ పూర్తిస్థాయిలో విచారించడంతో పాటు క్రికెట్ బుకీ బాస్ కృష్ణసింగ్ పూర్తి సమాచారం



నెల్లూరు డీఎస్పీ వెంకటరాముడు గూడూరు డీఎస్పీ శ్రీనివాస్

ఇవ్వడం, నగదు లావాదేవీలపై సాక్షాలు చూపినట్లు సమాచారం. దీంతో ఎస్పీ శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. దీంతో వెంకటరాముడును వీఆర్‌కు పంపుతూ మంగళవారం రాత్రి డీజీ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. ఇక గూడూరు డీఎస్పీగా 2015లో బాధ్యతలు చేపట్టిన బీ శ్రీనివాస్‌పై కూడా ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. జిల్లా నుంచి ఎర్ర చందనం, ఇసుక, సిలికా అక్రమ రవాణాలో భాగస్వామ్యం ఉన్నట్లు ఎస్పీ గుర్తించారు. అంతేగాక క్రికెట్ బెట్టింగ్‌లు, బుకీలకు సహకరించినట్లు ఆధారాలు లభించాయి. దీనిపై కూడా ప్రభుత్వానికి నివేదికలు పంపడంతో ఆయన్నూ వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు వెలువడ్డాయి. ఇలా ఇద్దరు డీఎస్పీలను వీఆర్‌కు పంపి ఆ తరువాత శాఖాపరమైన విచారణ నిర్వహించి తప్పని తేలితే చర్యలు ఉంటాయి. ఇప్పటికే గూడూరు డీఎస్పీ దీర్ఘకాలిక సెలవులో కొనసాగుతున్నారు. ఇక నెల్లూరులో ఇద్దరు సీఐలపై వేటు పడే అవకాశం ఉంది. ఎస్ఐలు, కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకునే అధికారం ఎస్పీకి ఉండటంతో వారిపై కూడా చర్యలు ఉంటాయని సమాచారం. ఇదే విషయాన్ని ఎస్పీ రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా ఆ ఇద్దరు డీఎస్పీలను వీఆర్‌కు పంపినట్లు, మరో ఇద్దరు సీఐలపై చర్యలు ఉంటాయని ధ్రువీకరించారు.

● ఎంతో గోప్యత

క్రికెట్ బుకీలు, బెట్టింగ్ రాయుళ్లు, పంటర్లను అదుపులోకి తీసుకుని స్వయంగా ఎస్పీ రామకృష్ణ విచారించి, ఆ వివరాలను ఎంతో గోప్యంగా ఉంచారు. సొంత శాఖ అధికారులను కూడా నమ్మకుండానే ఆయన స్వీయపర్యవేక్షణలోనే విచారణలు సాగాయి. క్రికెట్ బుకీ కృష్ణసింగ్‌ను ప్రధాన సూత్రధారుడిగా వ్యవహరించడంతో ఆయన అందించిన సమాచారమే పోలీసులకు కీలకంగా మారింది. బుకీలు, బెట్టింగ్ రాయుళ్ల వెనుక అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఎందరో ఉన్నారు. వీరికి ముఖ్య అనుచరులుగా వ్యవహరిస్తున్న నేతలను కూడా అదుపులోకి తీసుకుని పూర్తిస్థాయిలో విచారిస్తున్నారు. ఎలాంటి రాజకీయ ప్రలోభాలు, ఒత్తిళ్లకు లొంగకుండా ఎస్పీ విచారణ సాగించడం ఇటు పోలీసు వర్గాలు, అటు నేతల్లోనూ ఉత్కంఠ రేపింది. ఏ క్షణం ఏం జరుగుతుందో.. ఎవరిని అదుపులోకి తీసుకుంటారోనన్న అభద్రతతో నిద్రలేని రాత్రులు గడిపిన నాయకులు ఉన్నారు. ఒకరిద్దరు ఎమ్మెల్యేలు పూర్తిస్థాయిలో ఈ వ్యవహారంలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అధికార పార్టీ నేతలే పేకాట రాయుళ్లుగా మారడంతోపాటు నగరంలోని ఎల్ఎస్ఆర్ ఆఫీసులో నగర టీడీపీ నేతలు మకాం వేయడం చర్చనీయాంశమైంది. కాగా కృష్ణసింగ్ ఆచూకీ చెప్పాలంటూ కొందరు హైకోర్టులో హెబియస్ కార్పస్ రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం. దీనిపై 7వతేదీన విచారణకు స్వీకరిస్తామని హైకోర్టు పేర్కొన్నట్లు తెలిసింది. మరి కొందరు కూడా కోర్టును ఆశ్రయించే పనిలో ఉన్నారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకున్న ఎస్పీ రామకృష్ణ బుధ లేదా గురువారం అరెస్టులు చూపుతారని పోలీసు వర్గాలు వెల్లడిస్తున్నాయి.

● అధికారుల సమీక్షలో కలెక్టర్

రైతులకు ఎల్ఈసీ కార్డులను
వెంటనే పంపిణీ చేయాలి

నెల్లూరు(కలెక్టరేట్): రైతులకు లోన్ ఎలిజిబిలిటీ కార్డులను (ఎల్ఈసీ కార్డులు) వెంటనే పంపిణీ చేయాలని కలెక్టర్ ముత్యాలరాజు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో వ్యవసాయ, మార్కెటింగ్, కో-ఆపరేటివ్ అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట సర్టిఫికెట్లను కూడా మంజూరు చేయాలన్నారు. రైతులకు ఆ సర్టిఫికెట్లు ఎంతో అవసరమన్నారు. సర్టిఫికెట్ల పంపిణీకి వ్యవసాయాధికారులు శ్రద్ధ వహించాలన్నారు. పసల్ బీమా యోజనలో రైతులను చేర్పించాలన్నారు. సాయిల్ హెల్త్ కార్డులను రైతులకు వెంటనే అందించాలన్నారు. ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కోఆపరేటివ్ సొసైటీలకు సంబంధించి వివిధ సమస్యలు గ్రీవెన్స్‌కు వస్తున్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసి-2 వెంకటసుబ్బారెడ్డి, వ్యవసాయ శాఖ ఇన్‌చార్జీ జేడీ ఆనందకుమారి, జిల్లా సహకార శాఖాధికారిణి బీ సుధాభారతి తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయశాఖ అధికారుల సమీక్షలో కలెక్టర్ ముత్యాలరాజు

వైద్యులు కావాలంటే
కష్టపడి చదవాలి

● ర్యాగింగ్ చేస్తే చెప్పండి
● ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు



మాట్లాడుతున్న డాక్టర్ సురేష్

నెల్లూరు (వైద్యం) : వైద్య వృత్తిని చేపట్టాలనుకునే విద్యార్థులు కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరని నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రభు సూచించారు. ఆ కళాశాలలో ఈ ఏడాది మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మంగళవారం సమావేశం జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా పిల్లలు చదువులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కళాశాలలో ఎలాంటి ర్యాగింగ్‌లు లేవని, ఎవరైనా సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడితే వెంటనే తన దృష్టికి తీసురావాలని కోరారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. బోధన ఆసుపత్రుల సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణరాజు, డాక్టర్ సురేష్ మాట్లాడుతూ కొత్త విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. తోటి విద్యార్థులతో కలిసి బాగా చదువుకోవాలని సూచించారు. కళాశాలలో మంచి అధ్యాపకులు ఉన్నారని, వారు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని మంచి ర్యాంకులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు జిల్లా నుంచి వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు



శిథిలావస్థలో వసతి గృహ భవనాలు

అనంతసాగరం: రేవూరులోని బీసీ బాలికల వసతి గృహం, ఎస్సీ బాలుర వసతిగృహాల్లో అదనపు గదులు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు వెంకటరమణ తెలిపారు. వసతిగృహాలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరిశీలించామన్నారు. ఆయా వసతిగృహాల్లో గదులు పెచ్చులూడి పడుతున్నాయని, దీంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. వెంటనే తగిన మరమ్మతుపనులు చేయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చినుకు రాలదు.. చేను తడవదు!

- అడుగంటుతున్న నీటివనరులు
- ఎండుతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు

అనంతసాగరం: చిరుజల్లులే తప్ప..పదునయ్యే వర్షాలు కురవకపోవడంతో జిల్లాలో వ్యవసాయం భారంగా మారింది. రుతుపవనాలు ప్రారంభమైనా, ఆశించిన వర్షాలు కురవకపోవడంతో సోమశిల, కండలేరు వంటి జలాశయాలు అడుగంటిపోయాయి. ఇక చెరువులు, వాగులు, కుంటల్లో నీరన్నదే కనిపించని పరిస్థితి.

ఎండుతున్న పంటలు

జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో దాదాపు 20వేల ఎకరాల్లో వేరుశనగ, మరో 25వేల ఎకరాల్లో పత్తి, కొంతమేర వరి, అక్కడక్కడా చిరుధాన్యాలు సాగవుతున్నాయి. రెండేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటడంతో వందలాది బోర్లు నిరుపయోగంగా మారాయి. మెట్ట మండలాల్లో 400అడుగుల లోతుకు వెళ్లినా నీటి జాడ కనిపించడం లేదు. గతంలో నాలుగు ఇంచుల నీరు వచ్చే బోర్లలో ప్రస్తుతం అర ఇంచు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. అనంతసాగరం మండలంలోని బొమ్మవరం , గుడిగుంట, అగ్రహారం, చాపురాళ్లపల్లి, ఎగువపల్లి, చిలకలమర్రి, మంగుపల్లి, గోవిందమ్మపల్లి, పాతాళపల్లి, పడమటికంభంపాడు, సోమశిల, కమ్మవారిపల్లి గ్రామాల్లో బోర్ల ఆధారంగా సాగు చేసిన వేరుశనగ, పత్తి పంటలకు తడులందించేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.


నీరు లేక ఎండిన పత్తి


బోర్లు అడుగంటడంతో ఎండుతున్న వేరుశనగ

కరుణించని వరుణుడు...

జూలై 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని ఇటీవల వాతావరణ శాఖ తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనంతో నెల్లూరు జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని రైతులు ఆశపడ్డారు. కానీ, చిరుజల్లులకే పరిమితం కావడంతో రైతుల ఆశలు అవిరయ్యాయి.

మిర్చి, పత్తి దెబ్బతినింది



గతేడాది బోర్ల కింద మిర్చి సాగు చేశాం. నీరు లేకపోవడంతో పూర్తిగా ఎండి పోయింది. పెట్టుబడి కూడా రాలేదు. పత్తి సాగు చేయగా అందులోనూ నష్టాలే ఎదురయ్యాయి.

- నాగార్జున, ఎంపీటీసీ సభ్యుడు, బొమ్మవరం

బోర్లకు నీరు తగ్గింది



మాకు ప్రధాన నీటి వనరులు బోర్లే. రెండేళ్లుగా వర్షాలు లేకపోవడంతో బోర్లలో నీరు రావడం లేదు. సాగు చేసిన పంటలు దెబ్బతింటు న్నాయి. రైతులు నష్టపోతున్నారు.

- అంకిరెడ్డి, మాజీ సర్పంచు, బొమ్మవరం

కరువు తాండవిస్తోంది



సకాలంలో వర్షాలు కురవకపోవడంతో బోరు బావులు ఎండిపోతున్నాయి. దీంతో కరువు తాండవిస్తోంది. అప్పో సప్పో చేసి సాగు చేసిన పంటలు ఎండుతుండడంతో తీవ్రంగా నష్టపోతున్నాం

- నారాయణ, రైతు, చాపరాళ్లపల్లి

● ఇంటర్వ్యూ



ఉపాధి పనులు ముమ్మరం

లక్ష్మీనరసయ్య, ఏపీవో

?. మండలంలో ఉపాధి పనుల తీరు ఎలా వుంది

!. 24 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం వ్యవసాయపనులు కూడా లేకపోవడంతో కూలీలు ఎక్కువగా హాజరవుతున్నారు.

?. పనులకు హాజరవుతున్న వారికి కూలి గిట్టుబాటు అవుతోందా

!. కొలతల ప్రకారం కూలి చెల్లిస్తున్నాం. ఎవరికీ కూలి తక్కువగా అందిన దాఖలాలు లేవు.

?. కూలీలకు వారానికి సరిపడా నగదు అందుతోందా?

!. రెండు నెలల క్రితం ఉపాధికూలీల నగదు ఐసీఐసీఐ బ్యాంకులో జమ అవుతోంది. అప్పుడు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం తగు చర్యలు తీసుకుని, ఎప్పటికప్పుడు కూలీలకు నగదు అందేలా చూస్తున్నాం.

- మర్రిపాడు

279 జీవో రద్దు చేయాలి

● పారిశుధ్య కార్మికుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికుల పొట్ట కొట్టే 279 జీవోను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని ఏఐటీయూసీ నాయకుడు బి.హజరత్తయ్య, జిల్లా అధ్యక్షుడు జె.నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర ఏఐటీయూసీ పిలుపు మేరకు ఆత్మకూరులో మున్సిపల్ కార్మికులు 279 జీవోకు వ్యతిరేకంగా ఆందోళన ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయల్దేరి బీఎస్ఆర్ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం 279 జీవోను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, సీపీఐ నాయకులు రామమూర్తి, నారాయణ, పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

క్రికెట్ బుకీలపై నిఘా!

● విచారణ కొనసాగిస్తున్న ఆత్మకూరు పోలీసులు

ఆత్మకూరు: క్రికెట్ బెట్టింగ్‌తో కుటుంబాలు రోడ్డున పడకుండా ఎస్పీ తీసుకుంటున్న చర్యల్లో భాగంగా, ఆత్మకూరు సర్కిల్ పరిధిలోని పోలీసులు 12 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఒకరిద్దరు ఉపాధ్యాయులకు సైతం ఈ వ్యవహారంతో సంబంధాలున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటికే అనంతసాగరం మండలంలో పని చేస్తున్న ఓ ఉపాధ్యాయుడిని విచారణ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయమై డీఎస్పీ కేఎస్ఎస్వీ సుబ్బారెడ్డిని వివరణ కోరగా క్రికెట్ బెట్టింగ్‌లో అమాయకులు బలి కాకుండా చూడడమే ఎస్పీ లక్ష్యమన్నారు. ఇకపై ఎవరు బెట్టింగ్‌ల జోలికి వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు

పాత పెన్షన్ విధానం కొనసాగించాలి

అనంతసాగరం: కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని కొనసాగించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి రామకిషోర్, మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి నాయబ్‌జానీ, వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం అనంతసాగరం ఎంపీడీవో కార్యాలయంలో సీపీఎస్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీన విజయవాడలో నిర్వహిస్తున్న మిలీనియం మార్చ్‌కు సీపీఎస్ ఉద్యోగులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగులు కరీమ్‌మొహిద్దీన్, రఫీ, రియాజ్, బాలకృష్ణ, రహమతుల్లా, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రామకిషోర్

రిజర్వాయర్ సామర్థ్యం తగ్గించాలని వినతి

అనంతసాగరం: కేతామన్నేరువాగుపై మర్రిపాడు మండలం పడమటినాయుడుపల్లి వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్‌తో అనంతసాగరం చెరువుకు భవిష్యత్‌లో నీరు వచ్చే అవకాశాలు తగ్గిపోతాయని, రిజర్వాయర్ సామర్థ్యం తగ్గించాలని మంత్రులు పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి అమర్‌నాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ముత్యాలరాజుకు విన్నవించినట్లు సోమశిల ప్రాజెక్టు చైర్మన్ రాపూరు సుందరరామిరెడ్డి తెలిపారు. అనంత సాగరం చెరువుకు ప్రధాన నీటివనరు కేతామన్నేరు వాగేనన్నారు. భవిష్యత్తులో అనంతసాగరం చెరువు ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడకుండా రిజర్వాయర్ డిజైన్ మార్చాలని ప్రభుత్వం సూచించినా, కాంట్రాక్టర్‌కు మేలు చేసేందుకే, పనులు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఎక్కువ సామర్థ్యంతో నిర్మిస్తే ప్రభుత్వ ధనం దుర్వినియోగమవడమే కాకుండా, అనంతసాగరం చెరువుతో పాటు అగ్రహారం, బొమ్మవరం, పడమటినాయుడుపల్లి, రాజుపాళెం చెరువులకు సాగునీటికి గండిపడే అవకాశం ఉందన్నారు. వాగు వెంబడి ఉన్న పొలాల్లోని బోర్లకు నీరందక రైతులకు ఇబ్బందులు కలిగే ప్రమాదం ఉందన్నారు. కేతామన్నేరు రిజర్వాయర్ సామర్థ్యాన్ని 0.15 టీఎంసీలకు పరిమితం చేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవించామన్నారు. ఈ విషయంపై వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల ఏర్పాటుకు వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థి సంఘం నేతలు

సంగం: సంగంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు సమాజ న్యాయ ప్రచార సమితి విద్యార్థి సంఘం నాయకులు మంగళవారం తహసీల్దారు ఉమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగంలో ప్రభుత్వ కళాశాలలు లేకపోవడంతో పేద విద్యార్థులు ప్రైవేటు కళాశాలల్లో ఫీజు కట్టి చదువుకోలేకపోతున్నారన్నారు. ప్రభుత్వ కాలేజీలు ఏర్పాటు చేస్తే నిరుపేద విద్యార్థులకు మేలు జరుగుతుందని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖాదర్‌భాషా, చైతన్య, సూర్య, పవన్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు హామీతో రిలే దీక్ష విరమణ


వినతిపత్రం స్వీకరిస్తున్న తహసీల్దారు ఉమాదేవి

సంగం: శ్మశాన స్థల సమస్య పరిష్కరించాలని, సీజేఎఫ్ఎస్ భూములకు నీటి వసతి కల్పించాలని కోరుతూ కొరిమెర్ల వాసులు రెండు రోజులుగా చేస్తున్న రిలే దీక్ష తహసీల్దారు హామీతో ముగిసింది. మంగళవారం తహసీల్దారు ఉమాదేవి దీక్ష శిబిరానికి చేరుకుని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు భాస్కరయ్య, అంకయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రత మధ్య అంకమ్మమాను

సంగం: తరుణవాయి గ్రామం తూర్పు వీధిలో ఉన్న అంకమ్మ వేపమాను చుట్టు అపరిశుభ్రంగా మారడంతో భక్తులు మనోవేదనకు గురవుతున్నారు. తూర్పు వీధిలో డ్రైనేజీ పూడిపోవడంతో మురుగు నీరు బావి వద్ద ఉన్న అంకమ్మ మాను చుట్టూ చేరుతోంది. గ్రామానికి చెందిన కొందరు ట్రాక్టర్లను మాను చుట్టూ పెట్టడంతో ఆ ప్రాంతంలో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువను పునరుద్ధరించి మురుగు నీరు చేరకుండా చేయాలని కోరుతున్నారు.

పోలీసుల అదుపులో మేకల దొంగలు

అనంతసాగరం: అపహరించిన మేకలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు యత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులను అనంతసాగరం పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. గౌరవరం గ్రామానికి చెందిన 26 మేకలను అపహరించి మర్రిపాడు మండలం చుంచులూరు వద్ద లారీ ఎక్కిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు నిందితులతోపాటు, వాహన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

పారిశుధ్య కార్మికుల సమ్మె బాట



సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఉదయగిరి రూరల్: స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీ వర్కర్స్ జిల్లా గౌరవాధ్యక్షుడు కె.పెంచలనరసయ్య, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జే.లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎనిమిది నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఇచ్చే అరకొర వేతనాలు నెలల తరబడి నిలిపివేయడంతో కుటుంబ పోషణ సైతం కష్టతరమైందన్నారు. పారిశుధ్య పనులను కాంట్రాక్టర్లకు అప్పగించరాదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు వెంటనే విడుదల చేయాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు నాగేశ్వరరావు, బాష, తిమ్మయ్య, రమణయ్య, దిలావర్, నరసింహులు, గురవయ్య, శ్రీకాంత్, చిన్నయ్య, వెంకటరమణయ్య తదితరులున్నారు.

మాదిగల సత్తా చూపుతాం



దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వింజమూరు: ఎస్సీ వర్గీకరణకు అధికార, ప్రతిపక్షాలు సహకరించకపోతే మాదిగల సత్తా ఏంటో చూపుతామని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు పందిటి అంబేద్కర్ తెలిపారు. వర్గీకరణ సాధనకోసం చేస్తున్న దీక్ష మంగళవారం 13వ రోజుకు చేరిన సందర్భంగా మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో మాట తప్పిన చంద్రబాబుకు బుద్ధి చెప్పే రోజు దగ్గర పడిందన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్ అభ్యర్థి రంగంలో ఉంటారన్నారు. ఆ ఎన్నికల్లో మాదిగల సత్తా ఏంటో చూపుతామన్నారు.

ఎంఆర్ వ్యాక్సిన్‌తో

మీజిల్స్, రుబెల్లా రహిత సమాజం



అనంత సాగరం: పడమటికంభంపాడులో వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది



ఆత్మకూరు: సెయింట్‌మేరీస్ స్కూల్‌లో చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్నసిబ్బంది

సంగం: ఎంఆర్ వ్యాక్సిన్‌తో మీజిల్స్, రుబెల్లా వ్యాధులను తరిమికొట్టాలని సంగం మండల నోడల్ వైద్యాధికారి బాలనాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. పలువురు చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 9 నెలల నుంచి 15 ఏళ్ల వయసున్న 7,581 మందికి వ్యాక్సిన్ వేయాలని గుర్తించారన్నారు. ఆగస్టు మొదటి రెండు వారాలు పాఠశాల విద్యార్థులకు, చివరి రెండు వారాలు అంగన్‌వాడీ, బడి బయట పిల్లలకు వ్యాక్సిన్ వేయనున్నామన్నారు. తొలిరోజు మండలంలోని ఆరు పాఠశాలల్లో వ్యాక్సిన్ వేసేందుకు పది టీమ్‌లను నియమించామని తెలిపారు. వైద్యాధికారి రాగిణి, సిబ్బంది సోమేశ్వరరావు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మహిమలూరు పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి జావీద్ పట్టణంలోని సెయింట్ మేరీస్ స్కూల్ చిన్నారులకు వ్యాక్సిన్ వేసి కార్యక్రమాన్ని మండలంలో వ్యాక్సిన్ అర్హులైన 13, 500 మంది చిన్నారులను గుర్తించగా 2,084 మందికి వ్యాక్సిన్ ఇచ్చినట్లు తెలిపారు. హెల్త్‌సూపర్‌వైజర్ సిద్ధం సుధాకర్, ఏఎన్ఎం భూదేవి, ఆశావర్కర్లు, పాల్గొన్నారు.

అనంతసాగరం: మండలంలో తొలి రోజు 960 మందికి వ్యాక్సిన్ వేయాల్సి ఉండగా, 12 కేంద్రాల్లో 911 మందికి వ్యాక్సిన్ వేసినట్లు అనంతసాగరం వైద్యాధికారి హరికృష్ణ తెలిపారు. పడమటికంభంపాడులో ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీరెడ్డి, వైద్యసిబ్బంది వ్యాక్సినేజెషన్‌లో పాల్గొన్నారు.

మర్రిపాడు: మండలంలో తొలిరోజు 693 మంది లక్ష్యంగా నిర్ణయించగా 637 మందికి టీకాలు వేశారు. మర్రిపాడు పీహెచ్‌సీ వైద్యుడు సీహెచ్ మాల్యాద్రి, ఎంపీహెచ్‌వో కొండారెడ్డి, సర్పంచులు సన్నపురెడ్డి అమర్‌నాథ్ రెడ్డి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశవర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చేజర్ల: చిత్తలూరు ప్రాథమిక పాఠశాలలో గ్రామసర్పంచు మోదేపల్లి పెంచలనాయుడు ఆధ్వర్యంలో టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిత్తలూరు పీహెచ్‌సీ పరిధిలో 398 మంది చిన్నారులకు గాను 366 మందికి , చేజర్ల పీహెచ్‌సీలో 408 మంది చిన్నారులకు గాను 371 మందికి టీకా వేసినట్లు చిత్తలూరు, చేజర్ల వైద్యాధికారులు డాక్టర్ ఓబుళరాజు, డాక్టర్ ప్రమీలరాజకుమారి తెలిపారు.

ఏఎస్‌పేట: ఏఎస్‌పేట మండలంలో డాక్టర్ గోపీనాథ్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జడ్పీ హైస్కూల్, కేజీబీవీ, మోడ్రన్‌స్కూల్, రాగూర్ రెసిడెన్షియల్ పాఠశాల, పలు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యసిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్‌పేట కేజీబీవీలో వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ గోపీనాథ్



మర్రిపాడు: బ్రాహ్మణపల్లిలో టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది



సంగంలో చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న వైద్యాధికారులు

తూకాలు, కొలతల్లో మోసాలు

● అవగాహన లోపిస్తే నష్టమే

చట్టాలెన్ని చేసినా, అమలు చేసే అధికారుల అవినీతి, కారణంగా వ్యాపారుల చేతుల్లో వినియోగ దారులు ఏదో విధంగా మోసపోతూనే వున్నారు. నిత్యావసరాలైన బియ్యం, కిరోసి న్, కూరగాయలు, వంట గ్యాస్, పెట్రోలు కొనుగోలు సందర్భంగా ప్రజలు ఎక్కువగా మోస పోతున్నారు. వీటి నుంచి విముక్తి పొందాలంటే వినియోగదారులందరూ తప్పనిసరిగా సంబంధిత చట్టాలు, హక్కులపై అవగాహన పెంపొందించు కోవాల్సిన అవసరం వుంది.


-ఆత్మకూరు

ఎలక్ట్రానిక్ కాటాలే లేవు



ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాల్లో ఎలక్ట్రానిక్ కాటాలు వినియో గించాల్సి వుంది. అయినా, ఇప్పటికీ గ్రామాల్లో కనీసం తూనిక రాళ్లను కూడా వినియోగించడం లేదు. కొన్ని ప్రాంతాల్లో బండ రాళ్లనే తూనిక రాళ్లుగా వినియోగి స్తున్నారు. తూనికరాళ్లతోపాటు, ఎలక్ట్రానిక్ కాటాలకు సైతం ప్రతి రెండేళ్లకోసారి తూనికలు, కొలతల శాఖ అధికారులు పరిశీలించి, సీల్ వేయాల్సి వుంటుంది. ఇలా చేయకపోతే పక్షంలో వినియోగదారుడు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.

పెట్రోలు, డీజిల్ కొనుగోలులో..




పెట్రోలు బంకుల్లో లీటరుకు సరిపడా ఇంధనాన్ని వినియోగదారులు పొందలేకపోతున్నారు. ఇంధనాన్ని నింపే సమయంలో రీడింగ్ '0' ఉండేలా చూసుకోవాలి. రూ.100 లు పెట్రోలు పట్టమంటే రూ.98.80పైసలకు మాత్రమే నింపడం వల్ల వినియోగదారుడు రూ.1.20పైసల పెట్రోలు నష్టపోవాల్సి వస్తుంది. . ప్రతి పెట్రోలు బంకులోను అధికారులు ధ్రువీకరించిన లీటరు క్యాన్లు ఉంటాయి. అనుమానం వచ్చినప్పుడు వినియోగదారులు సంబంధిత యాజమాన్యంతో ఇంధనాన్ని కొలవమనే హక్కు ఉంది.

సిలిండర్ బరువులో తేడా...



వంటగ్యాస్ సిలిండర్ తూకం చూడకుండానే తీసుకుంటాం. రెండు నెలలు రావాల్సిన సిలిండర్, ఒకటిన్నర నెలకే అయిపోతుంది. అప్పుడు జరిగిన మోసం తెలుస్తుంది. నిండుగా ఉన్న గ్యాస్ సిలిండర్ తూకం వేస్తే బరువు తెలుస్తుంది. దీనిలో సిలిండర్ బరువు తీసేస్తే గ్యాస్ బరువు తెలుస్తుంది. తగ్గితే మోసం జరిగినట్లు గుర్తించాలి. గ్యాస్ సిలిండర్ వాహనం వద్ద వద్ద తప్పనిసరిగా స్ప్రింగ్‌త్రాసు ఏర్పాటు చేయాలి. వినియోగదారునికి గ్యాస్ సిలిండర్ అందించేటప్పుడు తప్పనిసరిగా తూకం వేసి ఇవ్వాలి.

ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు



ఇంధన పరిశ్రమలకు సంబంధించిన టోల్‌ఫ్రీ నెంబర్లు పెట్రోల్ బంకులోనే అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వం నిర్దేశించిన తూనికలను వినియోగించకపోతే సంబంధిత అధికారులకు, సిలిండర్ బరువులో తేడా వస్తే సంబంధిత జిల్లా పౌరసరఫరా అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. అంతేకాకుండా ఆయా మండల తహసీల్దారు, జిల్లా పౌరసరఫరా శాఖాధికారి వారికి ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదులు అందితే పరిశీలించి తప్పక చర్యలు తీసుకుంటాం.

- బీ.కే.వెంకటేశ్వర్లు, తహసీల్దారు, ఆత్మకూరు

ప్రభుత్వ భూముల ఆక్రమణపై నివేదిక ఇవ్వాలి

చిల్లకూరు: మండలంలోని ఏరూరు ప్రాంతంలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని అనుభవిస్తున్న సంఘటనపై సమగ్ర విచారణ జరిపి నివేదికలు అందజేయాలని తహసీల్దార్ రమణయ్యను గూడూరు ఆర్డీవో అరుణ్‌బాబు మంగళవారం ఆదేశించారు. ఆర్డీవో ఏరూరు ప్రాంతంలో ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16.40 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకుని రొయ్యల సాగు చేపట్టారని ఫిర్యాదు రావడంతో పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చైతన్యబాబు తదితరులు పాల్గొన్నారు.

సరుకు రవాణాకు వే బిల్లు తప్పనిసరి

● జాయింట్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

గూడూరు(టౌన్): యాభై వేలకు పైబడి విలువ కలిగిన సరుకు రవాణా చేయాలంటే తప్పనిసరిగా జీఎస్టీ వే బిల్లు జతపరచాలని ఎస్‌జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎస్ఈ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ద్వారకామాయి పంక్షన్‌హాలులో పట్టణ పరిధిలోని డీలర్లు, వ్యాపారస్తులతో జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వే బిల్లులు అందుబాటులోకి వచ్చాయన్నారు. సెప్టెంబర్ 22వ తేదీ లోగా పూర్తి స్థాయిలో డీలర్లు, వ్యాపారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. రూ.20 లక్షల వార్షిక టర్నోవర్ కలిగిన వారికి జీఎస్టీ నుంచి మినహాయింపు లభిస్తుందన్నారు. గతంలో వ్యాట్‌లో నమోదు చేసుకోని వారు కూడా తప్పనిసరిగా జీఎస్టీలో నమోదు చేసుకోవాలన్నారు. జీఎస్టీకి సంబంధించి మొదటి రిటర్న్స్ ఈ నెల 20లోగా అందరు దాఖలు చేయాలన్నారు. టోల్‌గేట్లు ఎత్తివేసిన రోడ్ల వెంబడి రాష్ట్ర, కేంద్ర జీఎస్టీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తారన్నారు. ఈ తనిఖీలలో ఈ వే బిల్లు లేకుండా పట్టుబడితే భారీ జరిమానాతోపాటు వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. అనంతరం రాష్ట్ర సేల్స్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ సంఘం ఆధ్వర్యంలో కృష్ణమోహన్‌రెడ్డికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీటీవో సీహెచ్ శ్రీనివాసరావు, రాష్ట్ర సేల్స్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ సంఘం అధ్యక్షుడు కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడు కోట సునీల్‌కుమార్ పాల్గొన్నారు.


కృష్ణమోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం

● ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్


గూడూరు: కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం, చైర్‌పర్సన్ పొనకా దేవసేన


గూడూరురూరల్: చెన్నూరులో టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది


వాకాడు: విద్యార్థికి ఎమ్మార్ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

గూడూరు: టీడీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో తట్టు, రుబెల్లా వ్యాధుల నియంత్రణకు ఎమ్మార్ టీకాలు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 9 నెలల చిన్నారుల నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పనిసరిగా ఈ టీకాలను వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పొనకా దేవసేన, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ రమేష్, శ్రీనివాసులు, వీవీకుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గూడూరురూరల్: మండలంలోని చెన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మార్ టీకాల కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్రకార్యదర్శి చేవూరు విజమోహన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు ఎమ్మార్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ మట్టం శ్రావణి, సర్పంచు తోడేటి శివకుమార్, చిరంజీవి, అల్లీ గోవర్ధన్, కొండయ్య, డాక్టర్ సునీల్, నగేష్‌రెడ్డి పాల్గొన్నారు.

వాకాడు: మీజెల్స్, రూబెల్లా వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించేందుకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన ఎమ్మార్ వ్యాక్సిన్‌ను వైద్య సిబ్బంది స్థానిక ఎస్‌పిఎస్‌సీ పాఠశాలలో ప్రారంభించారు. వాకాడు, కొండాపురం, జాంగ్రపేట, వడ్డిపాళెం, కాశీపురం గ్రామాల్లో వ్యాక్సిన్ వేశారు. చిన్నతోట పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ బీసీ వెంకటయ్య ఆధ్వర్యంలో వ్యాక్సిన్ వేశారు. తొలిరోజు 9 నెలల నుంచి 15 ఏళ్ల వయస్సు కలిగిన 370 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు దువ్వూరు భార్గవరాం, ఎంఈవో బాబు, బాలిరెడ్డిపాళెం వైద్యులు వెంకటేష్, హెచ్ఈవో సత్యనారాయణ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


కోట: చిన్నారులకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ ఇందీవర

కోట: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఎమ్మార్ వ్యాక్సిన్‌పై గ్రామీణులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని చిట్టేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ ఇందీవర అన్నారు. మండలంలోని చిట్టేడులో ఎమ్మార్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్సీ గురుకుల పాఠశాల, మరో రెండు పాఠశాలకు చెందిన 1,520 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో గురుకులం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, ఇన్‌చార్జి హెచ్ఎం వెంకటేశ్వర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకారం


నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న డాక్టర్ రోహిణి

గూడూరు(టౌన్): పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తానని డాక్టర్ రోహిణి అన్నారు. మంగళవారం స్థానిక సరస్వతి శిశు మందిరంలో ఆంధ్రమహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో తూర్పువీధి, పూలతోటలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు మనుబోలు జమునమ్మ దాతృత్వంతో ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఆంధ్రమహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి పాఠశాల అభివృద్ధికి రూ.30 వేలు, సులోచనమ్మ రూ.15 వేలు నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా రోహిణి మాట్లాడుతూ తన తండ్రి డాక్టర్ సీఆర్ రెడ్డితో పాటు తన కుటుంబసభ్యులు పలువురు పాఠశాల అభివృద్ధికి ప్రతి నెలా తమవంతు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సౌందర్యమ్మ, ప్రభరెడ్డి, విష్ణువందన, ఆర్వీరావు, శ్రీనివాసులు, సుప్రియ, స్నేహలతారెడ్డి, జీవని, శైలజా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చిల్లకూరు: మండలంలోని చేడిమాల గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. పారిచెర్లవారి పాళెం గ్రామానికి చెందిన కాలేషా సైకిల్‌పై తిక్కవరం నుంచి గ్రామానికి వెళ్తుండగా గుర్తుతెలియని మోటార్‌సైకిల్ ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం108 వాహనంలో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మెహందీపై మహిళలకు శిక్షణ

గూడూరు: స్థానిక సునీత సేవాసంస్థ కార్యాలయంలో సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్షి ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు మెహందీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబునాయుడికి రుణపడి ఉండాలి

గూడూరు(రూరల్): చెన్నూరును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతున్న సీఎం చంద్రబాబు నాయుడికి చెన్నూరు ప్రజలు రుణపడి ఉండాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి చెన్నూరు గ్రామంలో అధికారులతో కలసి గృహ లబ్ధిదారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు హామీ మేరకు గ్రామానికి 1013 గృహాలను మంజూరు చేశారన్నారు. గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు సీఎం రూ.5.46 కోట్లను మంజూరు చేశారన్నారు. అనంతరం ప్రజలు ఇళ్ల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను, పెంచలకోన ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తానంకి నానాజీలను గజమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అరుణ్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చేవూరు విజయమోహన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ మట్టం శ్రావణి, సర్పంచు తోడేటి శివకుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు కొండూరు వెంకటేశ్వర్లురాజు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పల్లంపర్తి మధురెడ్డి, బొమ్మిరెడ్డి మధురెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం

మధ్యాహ్న భోజనం తనిఖీ

గూడూరు: మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు అందజేసే మధ్యాహ్న భోజనాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పొనకా దేవసేన మంగళవారం తనిఖీ చేశారు. స్థానిక షాదీమంజిల్ సమీపంలోని మున్సిపల్, సీఎస్ఎం ప్రాథమిక పాఠశాలలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షాదీమంజిల్ సమీపంలోని మున్సిపల్ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి వర్షాకాలంలో ఉరుస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో ఈ పాఠశాలలో చదివే 30 మంది విద్యార్థులను సమీపంలోని సీఎస్ఎం ప్రాథమిక పాఠశాలలో చేర్పించి విద్య అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.


భోజనం పరిశీలిస్తున్న పొనకా దేవసేన

వీరభద్రస్వామి ఆలయంలో పేదలకు అన్నదానం

గూడూరు(టౌన్): పట్టణంలోని వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి అన్నదాన సమాజం సభ్యుడు మునిమోహన్ మాట్లాడుతూ 11 ఏళ్లగా దేవస్థానంలో దాతల సహకారంతో ప్రతి మంగళవారం 500 మందికి పైబడి పేదలకు అన్నదానం చేస్తున్నామన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్యాకెట్ల రూపంలో వారివారి ఇళ్లకు ఆటోల ద్వారా అందజేస్తున్నామన్నారు. ఉభయదాతలుగా పేటేటి ఆదిశేషయ్య, శాంతమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పేటేటి ప్రకాష్, బెజవాడ మురళీ, పేటేటి వెంకటేశ్వర్లు, రాజశేఖర్‌రెడ్డి, చంద్రసేన్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

గూడూరు(రూరల్): తుంగపాళెం, నాయుడుపాళెం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏవో నాగమోహన్ రావు మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించుకోవడం ద్వారా రైతులు ఎరువుల ఖర్చు తగ్గించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో హైమావతి, నాగమణి, శివయ్య, శివప్రసాద్ పాల్గొన్నారు.

చిల్లకూరు: మండలంలోని కలువకొండ, అంకులపాటూరు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారి రమణ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు జీలుగ, పిల్లిపెసర, జనుము పంటలు సాగు చేసుకుని భూమి సారవంతం చేసుకోవాలన్నారు. ఈ పచ్చిరొట్ట విత్తనాలు 75 శాతం రాయితీలో అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ఈశ్వర్, ప్రసన్న, చెంచుకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

గూడూరు

శ్రీనివాస్ తేజ:	డీజే
సుందరమహల్:	వాసుకి
సీవీ :	ఫిదా
సంగం:	గౌతమనంద

కోట

ఆర్ఆర్‌టీ :	ఫిదా
రామ్‌రాజ్:	దండుపాళ్యం -2
అరుణ:	గౌతమనంద

జన్మభూమి కమిటీల్లో అర్హులకు స్థానం : ఎమ్మెల్యే పాశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

కోట: పాత జన్మభూమి కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందని, కొత్త కమిటీల్లో అర్హులకు స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. కోటలోని సెంట్రల్ బ్యాంక్ వైస్ చైర్మన్ నల్లప్పరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి నివాసంలో మంగళవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ నూతన జన్మభూమి కమిటీలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇందుకోసం నియోజకవర్గాల వారీగా అర్హుల జాబితాను పంపాలని ఆయన మండలాల సీనియర్ నాయకులను కోరారు. ఈ నెల 4వ తేదీన కోట పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో రాష్ట్ర మంత్రులచే భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సభకు రాష్ట్ర మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, పీ.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అచ్చన్నాయుడుతో పాటు మరో ఇద్దరు రాష్ట్ర మంత్రులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇక్కడ జరిగే భారీ బహిరంగ సభకు ఆయా మండలాల నుంచి భారీగా కార్యకర్తలను ఆహ్వానించాలన్నారు. ఈ సభను ప్రతి కార్యకర్త ప్రతిష్టాత్మకంగా తీసుకుని జనసమీకరణ చేయాలన్నారు. అనంతరం మండలాల ప్రధాన నాయకులతో ఎమ్మెల్యే పార్టీ విషయాలపై గంటపాటు చర్చించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యాం క్ వైస్ చైర్మన్ నల్లప్పరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ మద్దాలి సర్వోత్తమరెడ్డి, జడ్పీటీసీ ప్రసాద్‌గౌడ్, నాయకులు జలీల్ అహ్మద్, వీ.రాజాచౌదరి, నెల్లూరు మోహన్‌రెడ్డి, మధుయాదవ్, దారా సురేష్, పొలయ్య, అనిల్, చిట్టమూరు ఎంపీపీ ఉక్కు జనార్దన్, గణపర్తి కిషోర్‌నాయుడు, డాక్టర్ శ్రీపతి బాబు, వాకాడు జడ్పీటీసీ ప్రమీలమ్మ, ఎంపీటీసీ గండవరం రజనమ్మ, చెంగల్‌రాయులు, సురేంద్ర, మస్తాన్ బాషా, రాజేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, వెంకటశేషయ్య, కోటారెడ్డి పాల్గొన్నారు.

తల్లిపాలు శ్రేష్ఠమైనవి



తల్లులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీలు

వాకాడు: పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేష్ఠమైనవని నెల్లిపూడి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఐవీ రమణయ్య అన్నారు. మంగళవారం మండలంలోని నెల్లిపూడి గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని రెడ్డిగారిదిబ్బ గిరిజన కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హెచ్‌ఎం మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడం వలన రోగ నిరోధక శక్తి పెరిగి పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు, అదేవిధంగా అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహార ప్రదర్శన చేసి తల్లులకు అవగాహన కల్పించి పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పద్మావతి, చెన్నమ్మ, మణెమ్మ, కోటమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

కోట: ఆర్థికస్థోమత లేని నిరుపేద పిల్లలను ఆధరించి ఆదుకోవాలని స్థానిక సబ్‌రిజిస్ట్రార్ భానుమతి అన్నారు. కోటలోని గ్రంథాలయంలో మంగళవారం అంగన్‌వాడీ చిన్నారులు 50 మందికి విద్యా సామగ్రి ఆమె అందజేశారు. కోటకు చెందిన సాయిరక్ష సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి గాయం ప్రసాద్, వివేకనంద పాఠశాల కరస్పాండెంట్ రమేష్, పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ భానుమతి



ఉపాధి పనులకు హాజరైన కూలీలు

వారందరిదీ రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో కూలి పనులు దొరకక అల్లాడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకమైనా పొట్ట నింపుతోందనుకొంటే నెలల తరబడి చేసిన పనులకు కూలి డబ్బులు చెల్లించక ఆకలితో అలమటిస్తున్నారు. నేడో, రేపో వస్తాయనుకొంటూ పస్తులతో పనులకు వెళుతున్న కూలీలకు అధికారుల నిర్లక్ష్యంతో సుమారు ఏడు నెలలుగా చేసిన కష్టానికి ఫలితం దొరకక అల్లాడుతున్నారు. కుటుంబ పోషణకు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా దగ్గర్లోనే పనులు దొరికాయని సంబరపడ్డ వారికి ప్రస్తుత పరిస్థితి మింగుడు పడటం లేదు. - వాకాడు

కడుపు నింపని కష్టం!

- ఏడు నెలలుగా అందని బిల్లులు
- బ్యాంకు ఖాతాతో ఆధార్ అనుసంధానం కాలేదని మెలిక
- రూ.15 లక్షల బకాయిలు
- లబోదిబో మంటున్న ఉపాధి హామీ కూలీలు

వాకాడు మండలంలో దాదాపు వర్షాధారంపైనే వ్యవసాయం ఆధారపడి ఉంది. రెండేళ్లుగా అతివృష్టి, అనావృష్టిల కారణంగా వ్యవసాయ పనులు లేక కూలీలు, రైతులు ఉపాధి పనులకు వెళుతున్నారు. చేసిన పనులకు సంబంధించి నెలల తరబడి డబ్బులు చెల్లించక పెండింగులో ఉన్నాయి. వేతనాలు అందక ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో పలు ప్రాంతాల ఉపాధి కూలీలు తరచూ నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నా, అధికారులు మాత్రం బ్యాంకుల్లో ఆధార్‌సీడింగ్ కావడంలేదంటూ సాదాసీదాగా సమాధానం చెబుతూ కాలం వెళ్లబుచ్చుతున్నారు.

- మండలంలో 19 పంచాయతీల పరిధిలో 63 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో 662 శ్రమశక్తి సంఘాలు, 18 దివ్యాంగ, ఇతర సంఘాలలో సుమారు 10 వేలకు పైగా ఉపాధి కూలీలున్నారు. వీరిలో సుమారు 1,400 మంది కూలీలు రోజువారి పనులకు వెళుతుంటారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 19 పంచాయతీల పరిధిలో 1,18,614 పని దినాల్లో వివిధ పనులు చేశారు. అందుకుగాను కూలీలకు 2 కోట్ల 26 లక్షల, 38 వేల రూపాయలు కూలి చెల్లించాల్సి ఉంది. అయితే కొందరు కూలీల బ్యాంకు ఖాతాకు ఆధార్ నెంబరు అనుసంధానం కాకపోవడంతో సుమారు రూ.15 లక్షల వరకు కూలి నగదు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.
- తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఈ ప్రాంత ప్రజలు కుటుంబ జీవనం కోసం వలస వెళుతుంటారు. ఈ క్రమంలో ఉపాధి పథకంలో కూలీలకు ఉపాధి కల్పించడం కోసం ఆ పథకం అధికారులు ఫారం పాండ్స్, పూడికతీత పనులు, మొక్కలు నాటడం వంటి తదితర పనులు కల్పించడంతో కూలీలు వలసలకు స్వస్తి చెప్పి ఉపాధి పనులకు వెళ్లారు. చేసిన రెక్కల కష్టానికి కూలి అందకపోవడంతో కూలీలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఈ కారణంగా కూలీలు పనులకు వెళ్లడం కూడా మానేస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని పలుచోట్ల ఉపాధి కూలీలకు కూలి చెల్లించాలంటూ ఆందోళనలు, నిరసనలు తెలుపుతున్నా, కూలీల బ్యాంకు ఖాతాకు ఆధార్ లింకేజీ కాకపోవడంతో వేతనాలు రావడం లేదని ఆశాఖ అధికారులు చెబుతున్నారు.

ఖాతాల్లోకి నగదు చేరేదిలా..

ఉపాధి కూలీల పూర్తి సమాచారాన్ని ఆధార్ నెంబర్‌తో సహా ఆయా బ్యాంకులకు అందజేయాలి. ఉపాధి వేతనాలను కేంద్ర ప్రభుత్వం నేరుగా నోడల్ బ్యాంకులకు విడుదల చేస్తోంది. అక్కడ నుంచి వివిధ బ్యాంకుల ప్రధాన కార్యాలయాలకు నిధులు చేరుతాయి. వాటి నుంచి మండల స్థాయి బ్యాంకులకు విడుదలవుతాయి. ఆధార్ అనుసంధానమైన ఖాతా నెంబర్లు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో సింక్ అయి ఉంటే కూలీల వేతనాలు నేరుగా ఖాతాలో జమ అవుతాయి. అయితే కూలీలు అధికారులు కోరిన విధంగా బ్యాంకు ఖాతా నెంబర్లు, ఆధార్ నెంబర్లు అందించినా అధికారులు సరైన సమయానికి కూలీల వివరాలు నమోదు చేయకపోవడం, చేసిన వాటిలో తప్పుల తడకల వల్ల ఎన్‌సీపీఐలో సింక్ కాకపోవడంతో పలు సమస్యలు ఏర్పడ్డాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేతనాల కోసం కూలీలు ఎన్నిసార్లు అధికారులను అడిగినా పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని కూలీలు వాపోతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఉపాధి కూలీలు చేసిన పనులకు నగదు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కూలీలు కోరుతున్నారు.

వారంలో సమస్య పరిష్కరిస్తాం



మండలంలో పనులు చేసిన ఉపాధి కూలీలకు నగదు చెల్లించాల్సిన విషయం వాస్తవమే. అయితే బ్యాంకు ఖాతాతో ఆధార్ లింకు కాకపోవడంతో నగదు జమకావడం లేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఈ నెల 1వ తేదీ నుంచి నెల్లూరు నుంచి ప్రత్యేక గ్రూపులను ఏర్పాటు చేశారు. వారం రోజుల్లో ప్రతి పంచాయతీలో నగదు జమకాని కూలీల వివరాలను బ్యాంకుకు లింకు చేయిస్తున్నాం. వారం రోజుల్లో కూలీలకు పూర్తి స్థాయిలో కూలీల నగదు జమకానుంది.

- విజయ ఏపీవో, ఉపాధి హామీ పథకం

ఏడు నెలలుగా కూలి చెల్లించలేదు



మండలంలో గత ఫిబ్రవరి నుంచి ఉపాధి పనులకు వెళుతున్నాం. 7 నెలలు గడిచినా ఇంతవరకు డబ్బులు రాలేదు. ఎందుకు రాలేదని అధికారులను అడిగితే ఆధార్ లింకు కాలేదని చెప్పారు. దీంతో నా బ్యాంకు ఖాతాకు ఆధార్ నెంబరును లింకు చేయించా. అది జరిగి కూడా నెల రోజులు గడిచాయి. ఇంతవరకూ కూలి డబ్బులు జమకాలేదు. కూలి డబ్బులు అందక పూట గడవక పస్తులతో పనులకు వెళుతున్నాం. అధికారులు ఇప్పటికైనా స్పందించి కూలి చెల్లించాలి.

- గణేష్, ఉపాధి కూలీ, పూడిరాయిదొరువు

కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం



అధికారుల నిర్లక్ష్యం కారణంగా నాలుగు నెలలు చేసిన ఉపాధి పనులకు ఇంతవరకు కూలి నగదు తన బ్యాంకు ఖాతాకు జమకాలేదు. 120 రోజులు శమటోడ్చి చేసిన పనికి కూలి చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. కూలి డబ్బుల కోసం నిత్యం ఉపాధి కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. గత వారంలో వాకాడులో జరిగిన ఆడిట్‌లోనూ వచ్చిన జిల్లా అధికారులకు చెప్పాం. అయినప్పటికీ తమ మొర ఎవరూ ఆలకించక ఇంకా డబ్బులు జమకాలేదు.

- మునికృష్ణ, ఉపాధి కూలీ

విద్యార్థులకు బస్సు పాసుల పంపిణీ

కోట: చిట్టేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్థానిక జీవీఆర్ రొయ్యల పరిశ్రమ దాతృత్వంతో 250 మంది విద్యార్థులకు చిట్టేడు జీవీఆర్ రొయ్యల పరిశ్రమ జనరల్ మేనేజర్ కృష్ణన్, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమణయ్య బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. అనంతరం కృష్ణన్ మాట్లాడుతూ తమ రొయ్యల పరిశ్రమ ద్వారా చిట్టేడు పరిసర గ్రామాల అభివృద్ధికి నిధులు ఇస్తున్నామన్నారు. తాగునీటి సమస్యకు ప్రత్యేక నిధులు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ మధు, విద్యాకమిటీ చైర్మన్ యాకసిరి చిన్నయ్య, ఆర్టీసీ సిబ్బంది రత్నాకర్, శ్రీనివాసులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న జీఎం కృష్ణన్

విదేశీ వద్దు.. స్వదేశీ ముద్దు

నాయుడుపేటరూరల్ : స్వదేశీ ఉత్పత్తులను ప్రతి భారతీయుడు విధిగా వినియోగిస్తే భారతదేశం అనతికాలంలో ప్రపంచంలోనే అగ్రస్థానాన ఉంటుందని శ్రీమాలక్ష్మమ్మ సేవాసమితి అధ్యక్షుడు మహేష్‌రెడ్డి అన్నారు. నాయుడుపేటలోని శ్రీ టంగుటూరు ప్రకాశంపంతులు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సునీల్‌రెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సుధీర్, జనసేన నాయకులు యశ్వంత్, ఎస్. భవదీప్‌రెడ్డి, నవీన్ మొదలియార్, జగదీష్ తదితరులు ఉన్నారు.

ఒక టీకాతో రెండు వ్యాధులు

నివారిద్దాం

● చిన్నారులకు ఎమ్మార్ వ్యాక్సిన్



దొరవారిసత్రంలో..



రుబెల్లా, తట్టు నివారణ వ్యాక్సిన్ చూపుతున్న మాజీమంత్రి పరసా, ఆర్డీవో శీనానాయక్

నాయుడుపేట : ఒకే ఒక్క టీకాతో మీజెల్స్, రుబెల్లా అనే రెండు ప్రాణాంతక వ్యాధులను నివారించవచ్చునని మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం అన్నారు. నాయుడుపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం మీజెల్స్, రుబెల్లా టీకాను చైర్ పర్సన్ మైలారి శోభారాణి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఆర్డీవో శీనానాయక్, డివిజనల్ పీవో డాక్టర్ రమాదేవీలతో కలసి విద్యార్థులకు టీకాలు వేశారు. 9 నెలల నుంచి 15 సంవత్సరాల పిల్లలందరూ తప్పని సరిగా ఈ టీకా వేసుకోవాలన్నారు. పాఠశాలలో, గ్రామాల్లో, వలసలకుటుంబాలలోని అందరి పిల్లలకు తప్పనిసరిగా ఈ టీకాలను వేసేందుకు ఆయా ప్రాంతాల ప్రజా ప్రతినిధులు, మహిళాసంఘాలు, గ్రామపెద్దలు భాగస్వామ్యంకావడం ద్వారా 100 శాతం టీకాలు వేసేందుకు సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గూడూరు రఘునాథరెడ్డి, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కందల కృష్ణారెడ్డి, సభ్యులు నానాబాల సుబ్బారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కేపీ ప్రేమలత, వైద్యులు హరిప్రియ, కిరణ్, వైద్యసిబ్బంది పురుషోత్తంరెడ్డి, బల్లి ప్రభాకర్, కౌన్సిలర్లు నాగభూషణం, చిట్టేటి రేవతి, నారాయణ, రవి, అవధానం సుధీర్, తదితరులు ఉన్నారు.

సూళ్లూరుపేట : తట్టు, రుబెల్లా వ్యాధులను నివారించే ఎంఆర్ వ్యాక్సిన్‌లను వైద్య ఆరోగ్యశాఖ మంగళవారం పలు పాఠశాలల్లో విద్యార్థులకు వేశారు. ఆర్‌కే ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో కరస్పాండెంట్ తమ్మిరెడ్డి, హెచ్ఎం కృష్ణారెడ్డి, టైనీటాట్స్ స్కూల్‌లో వేనాటి ధనంజయరెడ్డి, విద్యార్థులకు టీకాలు వేయించారు.

తడ : తడ పీహెచ్‌సీ పరిధిలో ఎమ్మార్ వ్యాక్సిన్‌ను జడ్పీటీసీ బొమ్మన శ్రీధర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. తడ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు ఓ ప్రైవేట్ పాఠశాలలో కూడా ఈ వ్యాక్సిన్‌లను వేశారు. ఈ పరిధిలో మొత్తం 845 మంది విద్యార్థులకు ఈ వ్యాక్సిన్‌ను వేయడం జరిగిందని తడ పీహెచ్‌సీ డాక్టర్ మురళీధర్ అన్నారు. అలాగే రామాపురం పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ దేదీప్య ఆధ్వర్యంలో 304 మందికి ఈ వ్యాక్సిన్‌లను వేశారు. రామాపురం, ఫకీర్ కండ్రిగ, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులతోపాటు అక్కడే ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలోని విద్యార్థులకు ఈ వ్యాక్సిన్‌లను వేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పూర్ణచంద్రరావు, టీడీపీ నేతలు టికె శ్రీనివాసన్, తడ సర్పంచ్ ఏడుమలై, ప్రధానోపాధ్యాయులు జానకి పాల్గొన్నారు.

ఓజిలి: ఓజిలి మండలం చిల్లమానుచేను గురుకుల పాఠశాల విద్యార్థులకు మంగళవారం మీజుల్స్, రుబెల్లా టీకాలు వేశారు. పాఠశాలకు చెందిన 408 మందితోపాటు గ్రామంలోని జిల్లాపరిష్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం పెద్దపరియ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చైర్మన్ కొండూరు సుబ్రమణ్యంరాజు సూచనల మేరకు వైద్యాధికారి కిషోర్‌కుమార్ అధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. చిల్లమానుచేను గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఈమేరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. మండలంలోని ఓజిలి, అత్తివరం, వజ్జావారిపాళెం ప్రాథమిక ఆరగ్యోకేంద్రాల పరిధిలో కూడా ఎంఆర్ టీకాల కార్యక్రమం పెద్దఎత్తున జరిగింది. వైద్యసిబ్బంది బుజ్జిబాబు, ఎంకటరమణయ్య, రవి, సుప్రియ, సంపూర్ణ, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం : తట్టు, రుబెల్లా అనే వ్యాధుల నుంచి పిల్లలను కాపాడుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన టీకా కార్యక్రమం మంగళవారం దొరవారిసత్రంలో టీడీపీ నేత వేనాటి సతీష్‌రెడ్డి ప్రారంభించారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో మండలంలో 5 పాఠశాలలో టీకా కార్యక్రమం ప్రారంభమైంది. స్థానిక బీసీ గురుకుల పాఠశాలలో టీకా కార్యక్రమాన్ని వేనాటితో పాటు, స్థానిక సీనియర్ నాయకులు దువ్వూరు గోపాల్‌రెడ్డి, వైద్యులు భాస్కర్ రెడ్డి, అరుణ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం. పరంధామయ్య ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులందరికీ వైద్యసిబ్బంది టీకా వేశారు. తట్టు, రుబెల్లా వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యాక్సిన్‌ను వేయిస్తుందని ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వేనాటి సతీష్‌రెడ్డి తెలియజేశారు. పాఠశాలలో లేని పిల్లలు, బయటకు వెళ్లిన వారు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని డాక్టర్ భాస్కర్ రెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు. టీకా కార్యక్రమం మొదటి రోజు 5 పాఠశాలలో 1,059 మంది విద్యార్థులకు వేయడం జరిగిందన వైద్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో ఎంఈవో మస్తానయ్య, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లకూరు : మండల పరిధిలోని పెళ్లకూరు, చెంబేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో వైద్య సిబ్బంది మంగళవారం తట్టు, రుబెల్లా వ్యాధి నివారణలో భాగంగా చిన్నారులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెళ్లకూరు ఆరోగ్య వైద్యకేంద్ర పరిధిలో పెళ్లకూరు, కొత్తూరు గ్రామాలలో ఉన్న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో 451 మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు. చెంబేడు ఆరోగ్యవైద్యకేంద్ర పరిధిలో 372 మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వికాష్, రమణయ్య, సుజాత, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



సూళ్లూరుపేట: ఆర్‌కే స్కూల్‌లో ఎమ్మార్ వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది



తడ : విద్యార్థికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది



ఓజిలి : ఎమ్మార్ వ్యాక్సిన్ వేయించుకునేందుకు హాజరైన విద్యార్థులు

ఇరు వర్గాలపై కేసు నమోదు

నాయుడుపేటరూరల్ : నాయుడుపేట పాతబస్టాండ్ సమీపంలో ఆటోలో ప్రయాణించి నగదు విషయంలో గొడవపడిన ఇరువర్గాలపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు నాయుడుపేట ఎస్ఐ రవినాయక్ తెలిపారు. మండలంలోని కాపులూరు గ్రామానికి చెందిన కోటమ్మను అదే గ్రామానికి చెందిన నరసమ్మ, వెంకటేశ్వర్లు కొట్టి గాయపరచినట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అదే విధంగా నరసమ్మను కోటమ్మ కొట్టి గాయపరచినట్లు ఫిర్యాదు చేసింది. ఆమేర ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

విద్యాభ్యాసంతోపాటు దేశభక్తి అలవర్చుకోవాలి

నాయుడుపేట : విద్యార్థులకు విద్యాభ్యాసంతోపాటు మంచి క్రమశిక్షణ, దేశభక్తి అలవర్చుకోవాలని ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవాక శ్రీనివాసులు అన్నారు. జాతీయ విద్యార్థి దినోత్సవం, ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవంగా నిర్వహించిన కబడ్డీ పోటీలలో గెలుపొందిన టీంలకు మంగళవారం నీలకంఠేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. అంతేకాకుండా ఈ పోటీలలో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పాఠశాల విభాగంలో నారాయణ పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా, విద్యకేంద్ర పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. అదేవిధంగా జూనియర్ విభాగంలో వేమ కాలేజీ విద్యార్థులు విన్నర్స్‌గా, విశ్వం కళాశాల విద్యార్థులు రన్నర్స్‌గా, డిగ్రీ కళాశాల విభాగంలో సీవీరామన్ కళాశాల విన్నర్స్‌గా గెలుపొందినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి నడవడిక, దేశంపట్ల బాధ్యతలు పెంపొందించేందుకు ఏబీవీపీ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పరిషత్ జాతీయ కార్యవర్గ సభ్యుడు సునీల్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున్, ఎం. జగదీష్, నవీన్‌కుమార్, ఆర్ వివేక్, మహేష్‌రెడ్డి, హరి, నాగభూషన్, గురు, మనోజ్ తదితరులు ఉన్నారు.



కబడ్డీ పోటీలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

అపాచీ అభివృద్ధిలో కార్మికులది ప్రధాన భూమిక

తడ : అపాచీ పరిశ్రమ అభివృద్ధి చెందటంలో కార్మికులది ప్రధానభూమికని వారి సహకారంతోనే పరిశ్రమలో అనుకున్న ఉత్పత్తులను సాధించగలుగుతున్నామని అపాచీ పరిశ్రమ సీఈవో జాన్సన్‌సాయి తెలిపారు. మంగళవారం పరిశ్రమ అభివృద్ధి కార్మికుల బాధ్యత అనే కార్యక్రమంలో భాగంగా ఆయన కార్మికులతో మాట్లాడారు. 6 నెలలుగా అనుకున్న ఉత్పత్తి లక్ష్యాన్ని సాధిస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో ఇలాగే పరిశ్రమలో ఉత్పత్తి సాధించాలని, పరిశ్రమ అభివృద్ధికి అందరూ ఇలాగే కృషి చేయాలని ఆయన కోరారు. కష్టపడే కార్మికులను యాజమాన్యం ఎప్పుడు గుర్తిస్తుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఆయనతోపాటు పరిశ్రమ మేనేజర్ ముత్తు, పీఆర్వో రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనంతరం పరిశ్రమల్లో సూళ్లూరుపేట అగ్నిమాపకదళ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ జరిగింది. అగ్ని ప్రమాదాలు, విపత్తుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలను, సలహాలను అగ్నిమాపకదళ అధికారి సుధాకర్ అందజేశారు.

'వాగుకూ పట్టా'పై చర్యలు తీసుకుంటా..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఓజిలి: ఓజిలి మండలం సిద్ధయ్యవాగుపై జరుగుతున్న చెక్‌డ్యామ్ నిర్మాణం అడ్డుకున్న సంఘటనపై వెంటనే చర్యలు తీసుకుంటామని నాయుడుపేట ఆర్డీవో శీనానాయక్ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం వెలువడిన వాగుకూ పట్టా కథనంపై ఆయన మాట్లాడారు. ఈ ఘటనపై పూర్తి వివరాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని తహసీల్దారును ఆదేశించినట్లు తెలిపారు. వాగుపై పట్టా ఇవ్వడం ఏమిటని ఆయన అసహనం వ్యక్తం చేశారు. చెక్‌డ్యామ్ నిర్మాణం ఇతర విషయాలపై పూర్తి సమాచారం తీసుకుంటానన్నారు.

పెద్దపరియలో సాయినాథుడికి గ్రామోత్సవం



సాయినాథుడి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఓజిలి: ఓజిలి మండలం పెద్దపరియలో మంగళవారం షిర్డీ సాయిబాబా విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా సోమవారం రాత్రి సాయినాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేక వాహనంలో గ్రామోత్సవం చేశారు. ఈ గ్రామోత్సవం మంగళవారం ఉదయం వరకు కొనసాగింది. ట్రాక్టర్‌పై ఊరేగుతున్న సాయినాథుడి విగ్రహం ఆకట్టుకునేలా ఉండడంతో గ్రామస్థులు మంత్రముగ్ధులయ్యారు. ఈ కార్యక్రమాలలో బీజేవైఎం ప్రధాన కార్యదర్శి ప్రసాద్, స్థానిక నాయకులు బట్టికాల కృష్ణయ్య, తంబయ్య, యువనాయకులు సుజిత్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

మురుగుకు మోక్షం ఎప్పుడు..?

అంతర్జాతీయంగా పేరుగడించిన ప్రదేశం అది.. శ్రీసిటీ, మాంబట్టు వంటి సెజ్‌లతో దేశ విదేశాలలో పేరుగడించిన తడలోని సర్వీస్ రోడ్లపై నిత్యం మురుగునీరు ప్రవహిస్తుంటుంది. జాతీయ రహదారి అధికారులు ఏర్పాటు చేసిన సర్వీస్‌రోడ్డు, దానికి అనుబంధంగా ఉండే కాలువలు సక్రమంగా నిర్మించకపోవడంతో ఈ మురుగునీరు తరచూ రోడ్లపై చేరుతుంది. పంచాయతీ సిబ్బంది అప్పుడప్పుడు కాలువల్లో పూడికలు తీసినా అది తాత్కాలికమే అవుతుంది. జాతీయ రహదారి అధికారుల పర్యవేక్షణలో ఉన్న మురుగుకాలువలను 15 రోజులకోసారి శుభ్రపరచాల్సి ఉంది. కానీ వారు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ మురుగు నీరు నిల్వకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు వేడుకుంటున్నారు. **- తడ**



ప్రకృతిని కాపాడుకుంటేనే మనుగడ

సూళ్లూరుపేట : ప్రకృతి వనరులను కాపాడుకుంటేనే మానవజాతికి మనుగడ ఉంటుందని సూళ్లూరుపేట వన్యప్రాణి విభాగం డీఎఫ్‌వో హిమశైలజ విద్యార్థులకు బోధించారు. స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో స్మార్ట్‌లివింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రకృతిని కాపాడుదాం అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఎఫ్‌వో ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటాలని, చెట్లను సంరక్షించాలని కోరారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవాలని విద్యార్థులకు చెప్పారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సాయిరాం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏజీఎం శ్రీకాంత్, డీన్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్, పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.



మాట్లాడుతున్న డీఎఫ్‌వో హిమశైలజ

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

ఇందుకూరుపేట : ఇందుకూరుపేట మండలంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని దాదాపు 72 కేంద్రాలలో ఈ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించి మహిళలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు ఈ కార్యక్రమానికి ఆహ్వానించి అంగన్‌వాడీలలో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. అనంతరం స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ సునీలత మాట్లాడుతూ తల్లిపాలతోనే మంచి ఆరోగ్యకరమైన బాల్యాన్ని రూపొందించుకోవాలన్నారు. అదే విధంగా గంగపట్నం లోని పాఠశాల హెచ్‌ఎం జాలయ్య మహి ళలతో సమావేశం నిర్వహించి తల్లిపాల వారోత్సవాలు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు, గర్భవతులు పాల్గొన్నారు.

జేసీ ఆకస్మిక తనిఖీ

ఇందుకూరు పేట : స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా భూములకు చెందిన రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కాలంలో మండలంలోని పోరంబోకు, సీజేఎఫ్ఎస్ భూములకు పట్టాలు ఇచ్చారనే అంశంపై నోటీసులు జారీచేసి వివరణ కోరారు.



రికార్డులు పరిశీలిస్తున్న జేసీ

జయబాబు సేవలు అపూర్వం : మాజీమంత్రి పరసా



జయబాబును సన్మానిస్తున్న పరసా, టీడీపీ నాయకులు

నాయుడుపేటరూరల్ : తెలుగుదేశంపార్టీ ఆవిర్భావంనాటి నుంచి పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్న సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ, ప్రముఖ పారిశ్రామికవేత్త పెసల జయబాబు సేవలు అపూర్వమని మాజీమంత్రి డాక్టర్ పరసారత్నం అన్నారు. నాయుడుపేటలో మంగళవారం జయబాబు స్వగృహంలో ఆయనను టీడీపీ నాయకులతో కలసి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి మెమోంటోను అందజేశారు. జయబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని టీడీపీ నాయకులు మిఠాయిలు పంపిణీ చేశారు. దివంగత నేత ఎన్టీరామారావు నుంచి నేటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వరకు జయబాబు పార్టీకి అందిస్తున్నసేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ గూడూరు రఘునాథరెడ్డి, టీడీపీ వాణిజ్య రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ పరసా వెంకటరమణయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షులు కందలకృష్ణారెడ్డి, పెసల జయరాజ్‌గోపాల్, గాలి రమేష్ నాయుడు, నానాబాల సుబ్బారావు, కందనూరు సంజయ్, బిరదవాడ నారాయణ, రవి, చిరువెళ్ల మునిరాజ, అవధానం సుధీర్, తదితరులు ఉన్నారు.

ఇసుక అక్రమ నిల్వలపై కఠిన చర్యలు

నాయుడుపేటరూరల్ : ఇసుక అక్రమ రవాణాకు పాల్పడినా, ఇసుకను అక్రమంగా నిల్వలు చేసినా కఠిన చర్యలు తప్పవని నాయుడుపేట ఆర్డీవో శీనానాయక్ హెచ్చరించారు.. నాయుడుపేట ఆర్డీవో కార్యాలయంలో సూళ్లూరుపేట పట్టణ ఎడ్లబండ్ల కార్మికులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. వర్షాభావం లేక కరువు తాండవిస్తుండటంతో టైర్ల బండ్ల ద్వారా ఇసుక తోలుకొని జీవనం సాగిస్తున్నామని ఇలాంటి సమయంలో టైరుబండ్ల ద్వారా ఇసుక రవాణా చేయవద్దని పోలీస్, రెవెన్యూ అధికారులు ఆటంకం తెలుపుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీంతో ఆర్డీవో మాట్లాడుతూ కేవలం ప్రభుత్వ గృహనిర్మాణాలకు, సొంత గృహనిర్మాణాలకు మాత్రమే ఇసుకను వినియోగించుకోవాలన్నారు. ఇసుకను టైరుబండ్ల ద్వారా రవాణాచేసి డంప్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



వినతిపత్రం పరిశీలిస్తున్న ఆర్డీవో శీనానాయక్

మద్యం దుకాణం తొలగించాల్సిందే

దొరవారిసత్రం: దొరవారిసత్రంలో పోలీస్‌స్టేషన్ ఎదురుగా, రెండు పాఠశాలల మధ్య పెట్టిన మద్యం దుకాణంను తొలగించాలని నాయుడుపేట ఆర్డీవో శీనానాయక్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానికుల ఫిర్యాదు మేరకు ఆకస్మికంగా మద్యం దుకాణాన్ని తనిఖీ చేశారు. ఏకొల్లు బాలికల వసతి గృహం, కేజీబీ పాఠశాలల మధ్యలో రెండింటికి సమీపంలో ఉన్న ఈ మద్యం దుకాణాల వల్ల విద్యార్థులకు జరగరానిది జరిగితే బాధ్యులు ఎవరని ఆర్డీవో ఆవేదన చెందారు. మద్యం దుకాణంఏర్పాటు చేసే సమయంలోనే అధికారులు అడ్డుకొని ఉండాలన్నారు. ఈ దుకాణాన్ని ఇక్కడ నుంచి తొలగించాలని ఆయన సూళ్లూరుపేట ఎక్సైజ్ అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు ఇచ్చారు. అలాగే అక్కడ కొంత ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైన విషయాన్ని కూడా పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వరరావును ఆదేశించారు.

సగుటూరులో పొలం పిలుస్తోంది

ఓజిలి: ఓజిలి మండలం సగుటూరు, భట్లకనుపూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఓజిలి మండల వ్యవసాయాధికారి రమేష్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని రైతులను రమేష్ సూచించారు. కార్యక్రమంలో రైతు నాయకులు ధర్మయ్యానాయుడు, వ్యవసాయ శాఖ సిబ్బంది నిరూషా, రమణమ్మ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏవో రమేష్

మల్లాంలో బస్‌పాస్‌ల పంపిణీ

చిట్టమూరు : మల్లాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బస్‌పాస్‌లను మంగళవారం అందజేశారు. స్థానిక సర్పంచ్ కామిరెడ్డి సునీల్‌రెడ్డి తండ్రి వెంకురెడ్డి జ్ఞాపకార్థంగా 100 మంది విద్యార్థులకు బస్‌పాస్‌లు అందించేందుకు దాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఆర్టీసీ సిబ్బంది ఎస్ఆర్ చంద్రయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

తాడిమేడు ఉపసర్పంచు మృతి

చిట్టమూరు : మండల పరిధిలోని తాడిమేడు పంచాయతీ ఉపసర్పంచ్ అనపల్లి వెంకటసుబ్బయ్య (46) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఉదయం నిద్రలేచిన వెంకటసుబ్బయ్య చిల్లరదుకాణం వద్దకెళ్లి వస్తుండగా కుప్పకూలిపోయాడు. స్థానికులు ఆసుపత్రికి తరలించేలోపు మృతి చెందాడు. గూడూరు వైసీపీ సమన్వయకర్త మేరిగ మురళీ మంగళవారం సాయంత్రం తాడిమేడుకు చేరుకుని మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు.

సినిమాగ్రేడ్

నాయుడుపేట

సీఎస్‌తేజ : దండుపాళ్యం
మురారి : మాయమాల్
శ్రీవెంకటేశ్వర : ఫిదా

సూళ్లూరుపేట

శ్రీలక్ష్మి : ఫిదా
ఎన్‌వీఆర్ : దండుపాళ్యం

జూదమే ఆదాయంగా..

- ఇల్లు, ఒళ్లు గుల్ల
- శాంతిభద్రతలకు విఘాతం
- పెడదోవన యువత
- మామూళ్ల మత్తులో పోలీసులు

పొదలకూరు: పొదలకూరు మండలంలో కొందరు జూదన్నే ఆదాయ వనరుగా ఎంచుకొని ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకొంటున్నారు. ప్రధానంగా పేకాట, క్రికెట్ బెట్టింగ్, కోడి పందేలు, చిల్లర జూదాలు ఇటీవల జోరందుకున్నారు. ఇల్లూ, ఆస్తులు తెగనమ్మి అభినవ ధర్మరాజులైపోతున్నారు. కొన్ని సందర్భాల్లో వివాదాలు తలెత్తి శాంతిభద్రలకు భంగం వాటిల్లుతోంది. ఇంత జరుగుతుంటే పోలీసులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పోలీసులకు నెలసరి మామూళ్లు నిర్వాహకుల నుంచి అందుతున్నాయన్న ఆరోపణలు మండలంలో వెల్లువెత్తుతున్నాయి.



అమ్మవారిపాళెంలో నిర్వహిస్తున్న కోడి పందేలు

పొదలకూరు, పరిసరాల పల్లెల్లో పేకాట జోరుగా సాగుతోంది. ఒక్కో రోజు ఒక్కో స్థావరం ఏర్పాటు చేసుకుంటున్నారు. రోజూ లక్షల నగదు చేతులు మారుతోంది. ఈ పేకాట కేంద్రం వద్దే అధిక వడ్డీకి అప్పిచ్చే వారు వాలిపోతున్నారు. జూదరులు పాపరైపోతుంటే జూదం నిర్వాహకులు, వడ్డీ వ్యాపారులు కోట్లకు పడగలెత్తుతున్నారు. క్రికెట్ బెట్టింగ్‌లకు సంబంధించి పొదలకూరు నివాసి మన్నెం శ్యామ్‌ప్రసాద్ అనే బుకీని పోలీసులు ఇటీవల అదుపులోకి తీసుకొని విచారిస్తున్న సంగతి విదితమే. దీంతో మండలంలో క్రికెట్ బెట్టింగ్‌కు తాత్కాలికంగా బ్రేక్ పడింది. పొదలకూరులోని ఎనిమిది మంది శ్యామ్‌ప్రసాద్ ఏజెంట్ల బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తే రెండు నెలల కిందట జరిగిన ఐపీఎల్‌లో ఎన్ని కోట్లు చేతులు మారాయనే ఇట్టే తెలిసిపోతుంది. క్రికెట్ బెట్టింగ్ కారణంగా ఎన్నో కుటుంబాలు కూలిపోయాయి.

మండలంలో ప్రధానంగా అమ్మవారిపాళెం, నల్లపాళెం, బిరదవోలు అటవీ ప్రాంతం, పొదలకూరు, మనుబోలు మండలాల సరిహద్దు ప్రాంతాల్లో కోడి పందేలు సాగుతున్నాయి దూర ప్రాంతాల నుంచి సైతం కొందరు ఇక్కడకొచ్చి పందేలు ఆడుతున్నారు. నల్లపాళెంలో జరిగిన కోడి పందెంలో కడప జిల్లా రాజంపేట నుంచి వచ్చి పందెం రాయుళ్ళు పాల్గొన్నారంటే పొదలకూరు ప్రాంతంలో ఏ స్థాయిలో జూదం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల పోలీసులు నల్లపాళెంలో జరుగుతున్న కోడి పందేల స్థావరంపై దాడి చేశారుకూడా.

బొమ్మ బొరుసూ, పులిమేక లాంటి జూదాలు పల్లెల్లో సర్వసాధారణం. ఈ జూదాల్లోనూ వేలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. తమకు ఆదాయ వనరుగా ఉన్న ఈ జూదాలను అరికట్టేందుకు పోలీసులు ఆసక్తి చూపడంలేదన్న విమర్శలున్నాయి. ఫలితంగా పలు కుటుంబాలు నిలువునా నాశనమై పోతున్నారు. బికార్లయిన వారెందరో. ముఖ్యంగా యువత పెడదోవ పట్టడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని కుటుంబాలు పాపరైపోయి వలసబాట పట్టాయి. ఎస్పీ ప్రత్యేక దృషి సారించి ఈ జూదాలనుకూడా అరికట్టాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

• ఇంటర్వ్యూ



గ్రామాల్లో పశుగ్రాస క్షేత్రాల అభివృద్ధి

పశువైద్యశాఖ సహాయ సంచాలకులు సోమయ్య

? : పశుగ్రాస క్షేత్రాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేంటి.

! : గ్రామాల్లో పశుగ్రాస క్షేత్రాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. పొదుపు సభ్యులు, రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి పశుగ్రాస క్షేత్రాల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు వివరిస్తున్నాం.

? : క్షేత్రాల ఏర్పాటుకు ప్రభుత్వం ఇస్తున్న సహకారం.

! : పశుగ్రాస క్షేత్రాల కోసం ఎకరాకు ప్రభుత్వం కౌలు కోసం రూ.25 వేలు ఇస్తుంది. పశుగ్రాస పెంపకం, ఇతర ఖర్చుల నిమిత్తం మరో రూ.20 వేలు వ్యయాన్ని భరిస్తుంది.

? : లబ్ధిదారుల ఎంపిక ఎలా.

! : ఎకరా పొలం ఉన్న వారు ఎవరైనా పశుగ్రాస క్షేత్రాలను అభివృద్ధి చేసుకోవచ్చు. గడ్డి పెంచేవారు తప్పనిసరిగా పొదుపు సంఘంలో సభ్యులుగా ఉండాలి. వెలుగు ద్వారా అందే దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తాం.

? : పశువైద్య శాఖ అందిస్తున్న రాయితీలు.

! : సెర్ప్ ద్వారా ఎస్సీలకు చూడి గేదెలనులను రాయితీపై అందజేస్తున్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ప్రస్తుతం పశువులను ఇస్తున్నాం. అర్హులైన ఎస్సీలు దరఖాస్తు చేసుకుంటే చూడు గేదెలను రాయితీ కింద అందజేస్తాం.

- ముత్తుకూరు

గ్రాసంతోనే పశుగణాభివృద్ధి : ఏడీ సోమయ్య

తోటపల్లిగూడూరు : గ్రామీణ ప్రాంతాల్లో పశువుల పెంపకం అభివృద్ధికి రైతులు గ్రాసాన్ని పెంచడం ఒక్కటే మార్గమని పశువైద్యశాఖ జిల్లా సహాయ సంచాలకులు సోమయ్య తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలోని వెలుగు కార్యాలయంలో జరిగిన పశుగ్రాస క్షేత్ర అభివృద్ధిపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు పశువుల పోషణ విధానంలో జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఒక్క పాడిగేద ఎకరం దిగుబడితో సమానంగా లాభాలు ఇస్తుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ద్వారా రుణాలు పొంది పశువులు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా గ్రాస క్షేత్రాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోడూరు, తోటపల్లిగూడూరు పశుగణాభివృద్ధి శాఖాధికారులు వసంతరాయులు, సుమలత, వెలుగు ఏపీఎం సూరిబాబు, సీసీలు మణి, సునీతమ్మ, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి గణనలో పొదలకూరుకు మూడో స్థానం

పొదలకూరు: విద్యార్థి గణనలో జిల్లాలో పొదలకూరు మండలం మూడో స్థానంలో ఉందని సర్వశిక్ష అభియాన్ సీఎంవో ఎం శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన పొదలకూరు విద్యావనరుల కేంద్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 1013 మందికి గాను 345మందిని ఆప్‌లోడ్ చేశామన్నారు. జిల్లాలో ముత్తుకూరు ప్రథమం, చేజర్ల ద్వితీయంలో ఉండగా పొదలకూరు తృతీయ స్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎం బాలకృష్ణారెడ్డి, ఎంఐఎస్ స్వాలిని, కంప్యూటర్ ఆపరేటర్ సుధారాణి, సీఆర్పీలు కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, కిరణ్మయి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఎంఈవోకి పదోన్నతి

మనుబోలు : స్థానికంగా ఎంఈవోగా పనిచేస్తున్న ఎస్‌కే. ఎండి.రహీమ్ పదోన్నతిపై నెల్లూరుకు వెళ్ళారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సర్వశిక్షా అభియాన్ పరిధిలో జిల్లా ఎమ్ఐఎస్, ప్లానింగ్ కోఆర్డినేటర్‌గా ఆయన నియమితులయ్యారు. రహీమ్ నెలన్నరకే పదోన్నతిపై వెళ్లడంతో మండలంలో ఆ సీటు మళ్లీ ఖాళీ అయింది.

భూ సమస్యలు పరిష్కరించండి : ఆర్డీవో

పొదలకూరు: తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే రైతుల భూ సమస్యలు వెంటనే పరిష్కారించాలని నెల్లూరు ఆర్డీవో వెంకటేశ్వర్లు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పొదలకూరు తహసీల్దార్ కార్యాలయానికి మంగళవారం వచ్చిన ఆర్డీవోను పలువురు రైతులు కలిసి సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని విన్నవించారు. స్పందించిన ఆర్డీవో సర్వేయర్‌ను పంపి కొలతలకు సంబంధించి సమస్యను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ అన్నదాత నిర్మలానందబాబాను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ పెన్నానది పరీవాహక ప్రాంతంలో భూగర్భజలశాఖ, మైనింగ్‌శాఖలతో విచారణ జరిపిస్తామన్నారు. విరువూరు ఇసుకరీచ్‌లో ఎంత ఇసుక ఉంది, ఎంత తీసుకోవాలనే విషయం భూగర్భజలశాఖ నిర్ణయిస్తుందన్నారు. ఎక్కువ తీసినట్లు తేలితే వెంటనే రీచ్‌ను మూసివేస్తామన్నారు. పెన్నా బ్యారేజీపై ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



ఆర్డీవోకు సమ్యలు వివరిస్తున్న రైతులు

పేకాట స్థావరంపై పోలీసు దాడులు

మనుబోలు : మండలంలోని పిడూరు రోడ్డు పక్కనున్న మద్యం దుకాణం సమీపంలో పేకాట స్థావరంపై ఎస్ఐ శ్రీనివాసరెడ్డి సిబ్బందితోమంగళవారం రాత్రి దాడి చేశారు. తొమ్మిది మంది అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4600లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులందరూ మనుబోలు, కాగితాలపూరుకు చెందిన వారే. అదుపులోకి తీసుకున్న నిందితులను బుధవారం కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

90 శాతం ఎంఆర్ టీకా నమోదు

మనుబోలు : స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఎమ్ఆర్ టీకాను మంగళవారం తహసీల్దార్ బీ లీలారాణి ప్రారంభించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఏడుకొండలు ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, సిబ్బంది మనుబోలులోని ఏడు ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులుకు, సుశృత, రేస్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలోని విద్యార్థులకు ఎమ్మార్ టీకాను వేశారు. వైద్యులు మాట్లాడుతూ మనుబోలులో 9 నెలల నుంచి 15 ఏళ్లలోపు వారు మొత్తం 1933మందిని గుర్తించామని వారిలో 1742మందికి ఎమ్మార్ టీకా వేసి 90శాతం తొలిరోజే పూర్తిచేశామన్నారు. మిగిలిన వారికి రెండు రోజుల్లోగా వేస్తామన్నారు. మండలంలోని గ్రామాల్లో కేటాయించిన రోజుల్లో సిబ్బందిని పంపి చిన్నారులందరికీ టీకా వేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ సూరపనేని కిషోర్‌నాయుడు, డైరెక్టర్ లక్ష్మయ్య, సర్పంచు పద్మమ్మ, పీహెచ్ఎన్ నజీమున్నీసా, ఏఎన్ఎంలు ఫరేకా, సుబాషిణీ, కేశవ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఆర్ వ్యాక్సిన్‌తో వ్యాధులు దూరం


పొదలకూరు: పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయించడం ద్వారా భవిష్యత్తులో ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా నివారించవచ్చని మహమ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. పొదలకూరు మండలంలో ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేసిన ఆయన మాట్లాడుతూ మండలంలో 14,820 మంది పిల్లలను గుర్తించామన్నారు. వీరికి సెప్టెంబరు 8వ తేదీ లోగా వ్యాక్సిన్ వేసే కార్యాచరణ రూపొందించామన్నా రు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తారన్నారు. మిగిలి పోయిన పిల్లలను గుర్తించి ఇళ్ళకు వెళ్ళి వేస్తారన్నారు. తొలి రోజు 2943 మంది చిన్నారులకుగాను 2590మంది పిల్లలకు వ్యాక్సిన్ వేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బాలకృష్ణారెడ్డి, పొదలకూరు ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరం రఘురామిరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ ఉమర్, ఎంపీహెచ్‌ఈవో కామేశ్వరమ్మ, సూపర్‌వైజర్లు వరలక్ష్మీ, ఉరూజ్, ఏవీ రమణమ్మ, ఆరోగ్య కార్యకర్తలు వెంకటేశ్వర్లు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి టీకా వేస్తున్న డాక్టర్ శ్రీధర్

బాలు సేవలు శ్లాఘనీయం

మనుబోలు : పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ కుప్పచ్చి బాలసుబ్రహ్మణ్యం సేవలు శ్లాఘనీయమని ఆ శాఖ ఈఈ పీ మహేశ్వరయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ రాజ్ ఏఈగా బాధ్యతలు నుంచి విరమణ పొందిన కుప్పచ్చి బాలసుబ్రహ్మణ్యం అభినందన సభ జరిగింది. మహేశ్వరయ్య మాట్లాడుతూ 42 ఏళ్లు పంచాయతీరాజ్ శాఖలో బాలు విశిష్ఠసేవలు అందించి అందరి మనన్నలు అందుకున్నారన్నారు. అనంతరం ఎంపీడీవోలు, ఇతర అధికారులు, మండలంలోని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, రాజకీయ నాయకులు బాలు సేవలను కొనియాడారు. అనంతరం బాలసుబ్రహ్మణ్యం, సతీమణి అరుణమ్మ దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెంకటాచలం ఎంపీడీవో సుగుణమ్మ, తోటపల్లి గూడూరు ఎంపీడీవో హేమలత, మనుబోలు ఇన్‌చార్జి ఎంపీడీవో ముజిబున్నీసా, పీఆర్ ఈఈ బీ. రమణయ్య, డీఈ. గౌతమ్, బాలు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సన్మానం అందుకుంటున్న బాలసుబ్రహ్మణ్యం దంపతులు

9న 'చలో ఢిల్లీ'

మనుబోలు : ఈనెల 9వ తేదీన రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 'చలో డిల్లీ' నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి దేవదానం తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఆ సంఘం నాయకులు గోడపత్రిక ఆవిష్కరించారు. ఉపాధిహామీ, పేదలకు ఇళ్ళు, ఆహార భద్రత, భూ పంపిణీ తదితర సమస్యలపై చలో డిల్లీలో కేంద్రప్రభుత్వంతో చర్చలు జరిపి పరిష్కరించేలా పోరాడతామని నాయకులన్నారు.

భార్య వియోగం

మనుబోలు : వైసీపీ మండల రైతు నాయకుడు దువ్వూరు శ్రీనువాసులురెడ్డికి మంగళవారం భార్యా వియోగం కలిగింది. ఆయన భార్య రజినీ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేది. మంగళవారం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో చికిత్స కోసం నెల్లూరుకు తరలించగా అక్కడి వైద్యులు బ్రెయిన్‌డెడ్ అన్న కొద్ది గంటల్లోనే రజినీ మృతి చెందారు.


తల్లిపాల వారోత్సవాల్లో అంగన్‌వాడీ వర్కర్లు

ఎమ్మార్ వ్యాక్సిన్‌పై తల్లిదండ్రులు దృష్టి సారించాలి


వెంకటగిరి: పిల్లలకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేస్తున్న శారద


కలువాయి: కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్పీటీసీ


రాపూరు: గురుకులంలో వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

వెంకటగిరి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఎమ్మార్ వ్యాక్సిన్ 9 నెల్ల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలకు వేయించేందుకు తల్లిదండ్రులు చొరవ చూపాలని మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద అన్నారు. తట్టు, రూబెల్లా వ్యాధులు రాకుండా ప్రభుత్వం ఉచితంగా వేస్తున్న ఎమ్మార్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక బంగారుపేట పీహెచ్‌సీలో ఆమె ప్రారంభించారు. బంగారుపేట బీసీ కాలనీలోని యూపీ స్కూల్ విద్యార్థులకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ వేయించడం వలన రెండు ప్రమాద కరమైన వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడవచ్చన్నారు. వైద్యాధికారి పెంచలయ్య మాట్లాడుతూ మండలంలో 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పిల్లలు 12,562 మందిని గుర్తించామని చెప్పారు. మొదటివిడతగా 1 నుంచి 17వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోని విద్యార్థులకు వ్యాక్సిన్లు వేయ నున్నట్లు తెలిపారు. 18 నుంచి 31వ తేదీ వరకు 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలు, బడి బయట పిల్లలకు వేస్తామని వివరించారు. రోజుకు 200 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేయడం లక్ష్యంగా పెట్టు కొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కిశోర్ పాల్గొన్నారు.

● మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద

కలువాయి: మీజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్‌ను విజయవంతం చేయాలని జడ్పీటీసీ బీ.అనిల్‌కుమార్‌రెడ్డి కోరారు. స్థానిక నవ భారతి పాఠశాలలో వైద్య సిబ్బందితో కలసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ కలువాయి పీహెచ్‌సీ పరిధిలో 5,989 మంది పిల్లలకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.సంపూర్ణమ్మ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ చల్లా విశ్వనాథరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొంటారు.

డక్కిలి: తట్టు, రుబెల్లా వంటి వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించేందుకే ప్రభుత్వం తొమ్మిది నెలల చిన్నారుల నుంచి 15 ఏళ్ల బాల బాలికలకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేస్తుందని స్థానిక వైద్యాధికారి సుధీర్ బాబు పేర్కొన్నారు. డక్కిలిలోని హైస్కూలు, గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి, ఆసుపత్రి సలహా కమిటీ చైర్మన్ చెలికం భాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, డక్కిలి హైస్కూల్ హెచ్ ఎం బాబయ్య, గురుకుల ప్రిన్సిపాల్ జయభారతి తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి: ఒక టీకాతో తట్టు, రూబెల్లా వంటి ప్రాణాంతక వ్యాధులను నివారించవచ్చునని వైద్యురాలు అశ్వని అన్నారు. మండలంలోని బాలాయపల్లి, కడగుంట, రామాపురం, సుబ్రహ్మణ్యం గ్రామాలలో 9 పాఠశాలల్లో విద్యార్థులకు ఎమ్మార్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు రాయి మస్తానయ్య, హెచ్‌ఎం కిషోర్, బాబుప్రసాద్ పాల్గొన్నారు.

రాపూరు: తట్టు, రుబెల్లా రాకుండా 9 నెలల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలందరూ తప్పనిసరిగా ఎమ్మార్ వ్యాక్సిన్ వేయించుకోవాలని వెపినాపి పీహెచ్‌సీ వైద్యులు నర్మదాదేవి, సునీల్‌బాబు కోరారు. స్థానిక గురుకులంలో విద్యార్థులకు ఈ వాక్సిన్ వేశారు. ఆరోగ్య, ఆశ కార్యకర్తలు అందరూ అన్నీ పాఠశాలల్లో, అనంతరం ఇంటింటికి తిరిగి వ్యాక్సిన్ వేస్తారన్నారు. పిల్లల తల్లిదండ్రులు అందరూ సహకరించి వ్యాక్సిన్ వేయించాలన్నారు.


డక్కిలి:మాట్లాడుతున్న వైద్యుడు సుధీర్‌బాబు


బాలాయపల్లి: వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

అట్టహాసంగా తల్లిపాల వారోత్సవాలు

రాపూరు: పట్టణంలోని హిందూ ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీలు తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పుట్టిన బిడ్డకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి తల్లులకు వివరించారు. ప్రతి తల్లి బిడ్డకు ముర్రుపాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆరోగ్య కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

వెంకటగిరి(టౌన్): శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నియోజక వర్గ కన్వీనర్ పల్లిపాటి రవి అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రీలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెంగారావు, బాబు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న మురళీకృష్ణ

వెంకటగిరి(టౌన్): పట్టణంలోని ఏపీ మోడల్ పాఠశాలల్లో ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులకు జనహిత ఫౌండేషన్ సహకారంతో జేవీఎన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏపీ మోడల్ కళాశాలలో చదువుతున్న చందు, చెంచుసాయికి రూ. వెయ్యి చొప్పున ప్రోత్సాహక బహుమతి అందజేశారు. అనంతరం పుత్తూరులో బీటెక్ చదువుతున్న వెంకటగిరి విద్యార్థిని హిమబిందు కుటుంబ సభ్యులకు రూ.7వేల చెక్కు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ దశయ్య, ప్రిన్సిపాల్ అపర్ణ, జీసీ ప్రతాప్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ

వెంకటగిరి(టౌన్): మున్సిపాలిటీ పరిధిలోని 16 వార్డుల్లో కొత్తగా మంజూరైన పింఛన్లు, పింఛన్ పుస్తకాలు వైస్‌చైర్మన్ బీరం రాజేశ్వరరావు మంగళవారం పంపిణీ చేశారు.


పింఛను పుస్తకాన్ని అందజేస్తున్న రాజేశ్వరరావు

విద్యార్థులకు సమదుస్తుల పంపిణీ

సైదాపురం: మండలంలోని మర్లపూడి జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం సేవా భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో జడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి 100 మంది విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమమైన విద్య అందిస్తున్నారన్నారు. విద్యార్థుల చదువుకు ప్రోత్సహిస్తున్న దాతల కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ పొట్టేళ్ల శిరీష, హెచ్‌ఎం చలపతి, పాఠశాల కమిటీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, దాత బండి కృష్ణారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, జిల్లా నాయకుడు నోటి రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


యూనిఫాం పంపిణీ చేస్తున్న జడ్పీ చైర్మన్

వివాదాస్పద రహదారిని పరిశీలించిన ఆర్డీవో

రాపూరు: మండలంలోని రంగాపురం వివాదాస్పద రహదారిని నెల్లూరు ఆర్డీవో వెంకటేశ్వర్లు మంగళవారం పరిశీలించారు. రంగాపురంలో కొంతమంది ఏళ్ల తరబడి నివాసాలు ఉంటున్నారు. వారికి తోటల్లోంచి దారి ఉండేది.అయితే ఇటీవల ఆ దారిని తోట యజమానులు కంచెవేసి మూసివేశారు. దీంతో రహదారి లేక వారు అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో ఆర్డీవో స్థానిక తహసీల్దారు, సర్పంచు మురళీమోహన్ రెడ్డితో కలసి ఆ రహదారిని పరిశీలించారు.

బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా రేణుక

రాపూరు: పట్టణంలోని సేవా భారత ట్రస్టు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా రేణుక మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె గుంటూరు జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసులు బుచ్చికి బదిలీ అయ్యారు.

సమస్యల పరిష్కారం కోసం కార్మికుల నిరసన

వెంకటగిరి: సమ్యల సాధన కోసం మున్సిపల్ కార్మికులు మంగళవారం పురవీధుల్లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక కాశీపేట కూడలిలో మానవహారంగా ఏర్పడి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి జాన్ మాట్లాడుతూ కార్మికుల పొట్ట కొట్టే జీవో నెంబర్ 279ని రద్దు చేయాలని, జీవో 151 ప్రకారం కార్మికులకు 18వేల వేతనం చెల్లించాలని, సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చలపతి, సుబ్బయ్య, నరేష్, ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.


నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు

తొమ్మిదో రోజుకు ఎమ్మార్పీఎస్ దీక్ష

డక్కిలి: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరుగుతున్న రిలే దీక్షలు మంగళవారానికి తొమ్మిదో రోజుకు చేరాయి. ఎస్సీ వర్గీకరణ సాధించేంత వరకు దీక్షలు విరమించేదిలేదని ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ మల్లికార్జున్, నాయకులు శ్రీనివాసులు, డీ పెంచలయ్య పేర్కొన్నారు.

సినిమా గైడ్

వెంకటగిరి

త్రిభువని:	గౌతమనంద
జ్యోతిమహల్:	నాయకి
భ్రమరాంబ :	ఫిదా

రాపూరు

శ్రీనివాసమహల్:	గౌతమ్‌నందా
వేంకటేశ్వరమహల్:	ఫిదా